గురువారం
22•8•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 58
• పేజీలు: 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD






బుధవారం రాత్రి ఢిల్లీలో కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ ఆర్థికమంత్రి చిదంబరంను ఆయన నివాసం నుంచి అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న సీబీఐ అధికారులు

# చిదంబరం అరెస్ట్



చిదంబరం తన నివాసం గేటు తీయకపోవడంతో గోడదూకి ఇంట్లోకి వెళ్తున్న సీబీఐ అధికారి

- ఢిల్లీలోని ఆయన ఇంట్లోనే అదుపులోకి తీసుకున్న సీబీఐ, ఈడీ బృందాలు
- సీబీఐ కేంద్ర కార్యాలయానికి తరలింపు
- రోజంతా హైడ్రామా.. ముందస్తు బెయిల్‌పై సుప్రీంకోర్టును ఆశ్రయించిన చిదంబరం
- శుక్రవారం విచారణ జరుపుతామన్న సీజేఐ
- సాయంత్రం ఏఐసీసీ ఆఫీస్‌లో హఠాత్తుగా ప్రత్యక్షమైన చిదంబరం.. అక్కడి నుంచి ఇంటికి
- ఆయన ఇంటి గోడదూకిన సీబీఐ అధికారులు

**ఐఎన్‌ఎక్స్** మీడియా కుంభకోణం కేసులో కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరంను సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. బుధవారం రాత్రి ఢిల్లీలోని జోర్‌బాగ్‌లో ఉన్న ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను సీబీఐ కేంద్ర కార్యాలయానికి తరలించారు. చిదంబరం అరెస్టుకు ముందు బుధవారం సుప్రీంకోర్టులో, ఆయన ఇంటి వద్ద నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. తన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను రద్దుచేస్తూ మంగళవారం ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై చిదంబరం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌ను అత్యవసరంగా విచారించడం కుదరదని, శుక్రవారం విచారణ జరుపుతామని కోర్టు తెలిపింది. మరోవైపు చిదంబరం విదేశాలకు పారిపోయే అవకాశం ఉన్నదంటూ సీబీఐ, ఈడీ అధికారులు లుక్ అవుట్ నోటీసులు జారీచేశారు. మంగళవారం రాత్రి నుంచి ఆచూకీ లేని చిదంబరం.. నాటకీయంగా బుధవారం రాత్రి ఢిల్లీలోని ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యక్షమై మీడియాతో మాట్లాడారు. తాను ఏ నేరమూ చేయలేదని, శుక్రవారం సాయంత్రం వరకు తనను అరెస్ట్ చేయొద్దని కోరారు. అనంతరం తన నివాసానికి వెళ్లారు. కొద్దిసేపటికే సీబీఐ, ఈడీ అధికారులు చిదంబరం నివాసానికి వెళ్లి.. గేటు తీయకపోవడంతో గోడదూకి ఇంట్లోకి ప్రవేశించారు. అక్కడ హైడ్రామా అనంతరం చిదంబరంను అరెస్ట్ చేశారు. ఢిల్లీలోని సీబీఐ కేంద్ర కార్యాలయానికి తరలించారు. 5



బుధవారం గజ్వేల్ నియోజకవర్గంలోని సింగాయిపల్లి అటవీ ప్రాంతంలో పునరుద్ధరణ పనులను జిల్లాల కలెక్టర్లకు వివరిస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్, ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి ఉన్నారు.

# అడవులు పునరుద్ధరించాలి

## కార్యాచరణ ప్రారంభించండి

- 27 రకాల పండ్లమొక్కల పెంపకంతో మంకీ ఫుడ్‌కోర్టులా కోమటిబండ అడవి
- అడవుల పెంపకం బాధ్యత మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు తీసుకోవాలి
- అటవీపునరుద్ధరణ పనులను కలెక్టర్లకు స్వయంగా చూపించిన సీఎం కేసీఆర్
- ప్రజలకు సత్వరసేవలందేలా కొత్త రెవెన్యూ చట్టం
- రూపకల్పనకోసం మళ్లీ సమావేశమవుదాం
- కోమటిబండలో కలెక్టర్లతో సమావేశంలో సీఎం

**హైదరాబాద్/ సంగారెడ్డి, సిద్దిపేట, ప్రతినిధులు, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలో 66.48 లక్షల ఎకరాల అటవీభూమి ఉన్నప్పటికీ ఆ నిష్పత్తితో అడవులు లేవని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. ఈ స్థాయిలో అడవులను పునరుద్ధరించాలని చెప్పారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అటవీభూముల్లో అడవుల పునరుద్ధరణకు ప్రణాళిక రూపొందించి, కార్యాచరణ ప్రారంభించాలని కలెక్టర్లను ఆదేశించారు. సామాజిక అడవుల పెంపకం ఆవాసప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తగ్గించడానికి ఉపయోగపడితే.. అడవుల పెంపకం మొత్తం వాతావరణంలోనే మార్పు తెస్తుందని, వర్షాలు బాగా కురవటానికి, జీవవైవిధ్యానికి దోహదపడుతుందని ముఖ్యమంత్రి చెప్పారు. బుధవారం ఉదయం గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని సింగాయిపల్లి, నేంటూరు, కోమటిబండ తదితర ప్రాంతాల్లో చేపట్టిన అటవీ పునరుద్ధరణ పనులను జిల్లాల కలెక్టర్లకు ముఖ్యమంత్రి స్వయంగా చూపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలోని అటవీభూములు చెట్లు లేని ఎడారుల్లా మారిన దుస్థితి ఉండేదన్నారు. అటవీభూముల్లో అడవిని పునరుద్ధరించాలనే లక్ష్యంతో సమగ్ర ప్రణాళిక రూపొందించి అమలుచేసినట్లు వెల్లడించారు. మూడేండ్ల క్రితం ప్రారంభమైన పునరుద్ధరణ ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని అన్నారు. ఈ ప్రాంతమంతా పచ్చని చెట్లతో కళకళలాడుతున్నదని, వర్షపాతం కూడా పెరిగిందని చెప్పారు. 27 రకాల

మిగతా 2వ పేజీలో

> **పల్లెలు,** పట్టణాలు పచ్చదనం, పరిశుభ్రతతో కళకళలాడాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దీనికి అనుగుణంగా 60 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలుచేయాలి. రాష్ట్రంలోని పట్టణాలు, గ్రామాల్లో ఈ 60 రోజుల్లో స్పష్టమైన మార్పు కనిపించాలి. ప్రజలకు సేవలు అందించేందుకే కొత్త పంచాయతీ రాజ్, పురపాలకచట్టాలు చేసుకున్నాం. వీటిని పక్కాగా అమలు చేయాలి. రాష్ట్రంలోని అన్ని అటవీ ప్రాంతాలను అభివృద్ధి చేయాలి.
>
> – ముఖ్యమంత్రి కేసీఆర్



# సరళ్‌లో మనం అద్వితీయం

- పెట్టుబడి అనుకూలత, వినియోగదారుల సంతృప్తిలో అగ్రస్థానం
- సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటులో ర్యాంకులు
- ప్రకటించిన కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధనశాఖ
- తెలంగాణ సర్కారు చర్యలతో మెరుగైన ర్యాంకులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్‌కు సంబంధించి రాష్ట్రాలకు కేటాయించిన ర్యాంకుల్లో దేశంలోనే తెలంగాణ ద్వితీయస్థానాన్ని కైవసం చేసుకున్నది. 'స్టేట్ రూఫ్‌టాప్ సోలార్ అట్రాక్టివ్‌నెస్ ఇండెక్స్' (సరళ్) పేరుతో కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధనశాఖ (ఎంఎన్‌ఆర్‌ఈ) ర్యాంకులను ప్రకటించింది. బుధవారం ఢిల్లీలో జరిగిన సమావేశంలో ఆయా రాష్ట్రాలకు వచ్చిన ర్యాంకులు, గ్రేడ్లను పునరుత్పాదక వనరుల సహాయమంత్రి ఆర్కే సింగ్ విడుదలచేశారు. ఆయా రాష్ట్రాల్లో రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలు, సాధించిన ప్రగతిని పరిగణనలోకి తీసుకుని ర్యాంకులను ప్రకటించారు. కర్ణాటకకు మొదటిస్థానం దక్కగా, తెలంగాణ రెండోస్థానంలో నిలిచింది. గుజరాత్, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ మూడు, నాలుగు, ఐదు స్థానాలు పొందాయి.

**తెలంగాణకు ఏ++ గ్రేడ్.. 72.2 సరళ్ స్కోర్**

సరళ్ స్కోర్ల ఆధారంగా ఏ++, ఏ+, ఏ, బీ++, బీ+, బీ అనే ఆరు గ్రేడ్లను కేంద్రం కేటాయించింది. ఇందులో తెలంగాణకు ఏ++ గ్రేడ్ దక్కింది. మొదటి నాలుగుస్థానాల్లో ఉన్న కర్ణాటక, తెలంగాణ, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఏ++ గ్రేడ్ కేటాయించారు. సరళ్ స్కోరు 72.2 పాయింట్లను సాధించి తెలంగాణ దేశంలోనే రెండోస్థానంలో నిలిచింది. మొదటిస్థానంలో ఉన్న కర్ణాటక 78.8 స్కోరు సాధించింది. గుజరాత్ 67.9, ఆంధ్రప్రదేశ్ 66.1, రాజస్థాన్ 62.2 స్కోరు సాధించాయి.

**వినియోగదారుల సంతృప్తిలో అగ్రస్థానం**

ఐదు అంశాలను ప్రామాణికంగా తీసుకుని ఒక్కో రాష్ట్రం ఆయా అంశాల్లో సాధించిన ఫలితాలను పరిశీలించి స్కోర్ వేశారు. ఈ ఐదు అంశాల్లో.. వినియోగదారుల సంతృప్తికి సంబంధించిన అంశంలో దేశంలోనే అత్యధికంగా 80.59 స్కోరును తెలంగాణ సాధించింది. అంటే.. పకడ్బందీగా రూఫ్‌టాప్ సోలార్ స్కీమ్‌ను అమలుచేయడం, అందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చేయూత, సహాయ సహకారాలతో వినియోగదారులు పూర్తి సంతృప్తికరంగా, సానుకూలతతో

మిగతా 2వ పేజీలో



బుధవారం హైదరాబాద్ గచ్చిబౌలిలో ప్రారంభమైన అమెజాన్ క్యాంపస్ భవనం

# అమెజాన్ అతిపెద్ద క్యాంపస్

- అమెరికా వెలుపల హైదరాబాద్ వేదికగా ఏర్పాటు
- ప్రారంభించిన హోంమంత్రి మహమూద్‌అలీ
- 15వేల మంది ఉద్యోగులు పనిచేసేలా 3 మిలియన్ల చదరపు అడుగుల్లో నిర్మాణం



అమెజాన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మహమూద్‌అలీ. చిత్రంలో అమెజాన్ గ్లోబల్ రియల్ ఎస్టేట్ వైస్‌ప్రెసిడెంట్ జాన్‌స్కాట్లర్, యూఎస్ కాన్సులేట్ జనరల్ జోయల్ రీఫ్‌మన్, తెలంగాణ ఐటీ, పరిశ్రమల ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ ఉన్నారు 2

# 2020 ఏప్రిల్ 1 నుంచి జనగణన

- కేంద్ర ప్రభుత్వ నిర్ణయం • రాష్ట్ర ప్రభుత్వ నోటిఫికేషన్
- మాన్యువల్ పద్ధతికి చెల్లుచీటీ • ట్యాబ్‌ల ద్వారా వివరాల సేకరణ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పదేండ్లకోసారి నిర్వహించే జనాభా లెక్కలకు కేంద్ర ప్రభుత్వం సమాయత్తమవుతున్నది. 2021 జనాభా లెక్కల కోసం 2020 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి సెప్టెంబర్ 30 వరకు ఇంటింటా సమగ్ర జనాభా గణన చేపట్టనున్నట్టు కేంద్ర హోంశాఖ ఆధీనంలోని రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ వెల్లడించారు. ఒక్క అసోం మినహా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రతి వ్యక్తి

మిగతా 3వ పేజీలో

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 74.00 | రిటైల్ లైవ్ | 96.00 |
| డ్రెస్‌డ్ | 139.00 | స్కిన్‌లెస్ | 158.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 320.00 | రంగారెడ్డి | 320.00 |
| మెదక్ | 320.00 | కరీంనగర్ | 323.00 |
| వరంగల్ | 323.00 | చిల్లర ధర | 3.80 |



9

## 39వేల దిశగా పసిడి

- మరో రూ.50 పెరుగుదల
- రూ.38,820కి తులం
- రూ.1,140 ఎగబాకిన కిలో వెండి

## కార్మికుడే పారిశ్రామికవేత్త



- 387 కోట్లతో 'వర్కర్ టు ఓనర్'
- దేశానికే ఆదర్శవంతమైన పథకం
- త్వరలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభం
- టీఆర్‌ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ వెల్లడి

3

# పైసల్ తీసుకొని పాలోళ్లకు పట్టా!

- సాగులో ఒకరు.. పట్టాలో మరొకరు
- రూ.4 కోట్లు విలువైన భూమి దాయాదులకు కట్టబెట్టిన మంచిర్యాల జిల్లా నస్పూరు రెవెన్యూ అధికారులు
- న్యాయంకోసం పోరాడుతున్న బాధిత వృద్ధురాలు

ధర్మగంట



6

బాధితురాలు లింగమ్మ

# డాక్టర్లు గ్రామాల్లో సేవచేయాల్సిందే

- ఇందుకు ఒకే రకమైన విధానాన్ని కేంద్రం రూపొందించాలి
- ఆదేశించిన సుప్రీంకోర్టు
- వైద్య విద్యార్థులపై ప్రభుత్వం లక్షలు ఖర్చు చేస్తున్నది
- కొంతకాలం గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తే తప్పేమిటని నిలదీత



**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** చదువు పూర్తయిన తర్వాత వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో కచ్చితంగా కొంతకాలం పనిచేసేలా విధివిధానాలు రూపొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో చదువుకుంటున్నవారిపై ప్రభుత్వం లక్షల రూపాయలను ఖర్చు చేస్తున్నదని, అలాంటప్పుడు వారు గ్రామీణ ప్రాంతాల్లో కొంతకాలం పనిచేస్తే తప్పేమిటని ప్రశ్నించింది. పలు రాష్ట్రాల్లో అమలవుతున్న బాండ్ల విధానాన్ని తొలిగించాలంటూ సూపర్ స్పెషాలిటీ వైద్యవిద్యను అభ్యసించాలనుకునేవారి తరపు సంఘం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ బాండ్ల విధానం

మిగతా 5వ పేజీలో







1. బుధవారం సిద్దిపేట జిల్లా కోమటిబండలో మిషన్‌భగీరథ ప్లాంటునుంచి అటవీప్రాంతాన్ని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు.
2. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం సింగాయిపల్లి ఫారెస్టు పునరుద్ధరణ పనుల వివరాలను కలెక్టర్లకు తెలియజేస్తున్న అటవీశాఖ పీసీసీఎఫ్ ఆర్ శోభ. చిత్రంలో సీఎం కేసీఆర్, మంత్రులు కూడా ఉన్నారు.

# అడవులు పునరుద్ధరించాలి

మొదటిపేజీ తరువాయి...

పండ్ల మొక్కలను ఈ అడవుల్లో పెంచడం వల్ల ఇవి మంకీ ఫుడ్‌కోర్టుల్లా తయారవుతున్నాయన్నారు. గజ్వేల్ చుట్టుపక్కల ప్రాంతాల్లో చేపట్టిన అటవీ పునరుద్ధరణ కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని, రాష్ట్రవ్యాప్తంగా అడవుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రంలో 66.48 లక్షల ఎకరాల అటవీ భూమి ఉందని, ఇది మన భూభాగంలో 23.4 శాతం అని సీఎం అన్నారు. ఇంత అటవీభూమి ఉన్నప్పటికీ అదే నిష్పత్తిలో అడవులు లేవని చెప్పారు.

## సహజ పద్ధతిలో చెట్ల పెంపకం

గజ్వేల్ అటవీప్రాంతంలో చేపట్టిన అడవుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని ఆ శాఖ పీసీసీఎఫ్ ఆర్ శోభ, అడిషనల్ పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ కలెక్టర్లకు వివరించారు. అడవుల్లో ఉన్న రూట్‌స్టాక్‌ను ఉపయోగించుకొని సహజ పద్ధతిలో చెట్ల పెంపకం చేపట్టామన్నారు. అడవి చుట్టూ కందకాలు తీశామని, దీనివల్ల అడవికి రక్షణ ఏర్పడుతుందని చెప్పారు. బయటి జంతువులు లోపలకు రావడంగానీ, లోపలి జంతువులు బయటకు వెళ్లడంకానీ సాధ్యంకాదన్నారు. ఆ కందకాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల చెట్లకు కావల్సిన తేమ అందుతుందని చెప్పారు. కందకాల కట్టలపై గచ్చకాయ చెట్లు నాటడం వల్ల అడవికి సహజ రక్షణ ఏర్పడుతుందన్నారు. 27రకాల పండ్లచెట్లు కూడా పెంచుతున్నామని, దీనివల్ల గ్రామాలు, పట్టణాల్లోని కోతులు అడవికి వాపస్ పోతున్నాయని అటవీశాఖ అధికారులు తెలిపారు. అడవుల పునరుద్ధరణవల్ల కాలుష్యం తగ్గుతుందని, ఉష్ణోగ్రతలు కూడా తగ్గుతాయని, వర్షపాతం పెరుగుతుందని, జీవ వైవిధ్యానికి అవకాశం కలుగుతుందని వివరించారు. ఆయాజిల్లాల్లో ఉన్న అడవులను కాపాడుకోవాలని, అందులో మొక్కలునాటి అడవిని పునరుద్ధరించాలని, మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు ఈ బాధ్యత తీసుకోవాలని సీఎం కేసీఆర్ ఈ సందర్భంగా సూచించారు. పునరుద్ధరించిన అడవుల సందర్శన అనంతరం కలెక్టర్లు కోమటిబండలో నిర్మించిన మిషన్ భగీరథ ప్లాంటును సందర్శించారు. అక్కడే కలెక్టర్లతో కలిసి ముఖ్యమంత్రి మధ్యాహ్న భోజనంచేశారు. అనంతరం కలెక్టర్లతో సమావేశమయ్యారు. కార్యక్రమాల్లో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఈటల రాజేందర్, జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్, నిరంజన్‌రెడ్డి, మల్లారెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, సీఎంవో ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కోమటిబండలో మిషన్ భగీరథ ప్లాంటును పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్



గజ్వేల్ నియోజవర్గంలో పునరుద్ధరించిన అటవీ పనుల గురించి మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లాల కలెక్టర్లకు వివరిస్తున్న సీఎం కేసీఆర్

# సత్వరసేవల కోసం కొత్త రెవెన్యూ చట్టం

- రూపకల్పనకోసం మళ్లీ సమావేశమవుదాం
- పకడ్బందీగా 60 రోజుల కార్యాచరణ అమలు
- కోమటిబండలో కలెక్టర్లతో సమావేశంలో సీఎం కేసీఆర్



సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం కోమటిబండలో కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు ఈటల రాజేందర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్, మల్లారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎంపీ సంతోష్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ తదితరులున్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రజలకు సత్వరమే సేవలు అందించేలా పటిష్ఠమైన రెవెన్యూ చట్టం తీసుకురావాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. రెండురోజులపాటు జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో కొత్తగా తీసుకురానున్న రెవెన్యూచట్టంపై విస్తృతంగా చర్చించారు. ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా పకడ్బందీగా కొత్త రెవెన్యూ చట్టాన్ని రూపొందించడానికి జరిగే ఈ కసరత్తులో మరోసారి సమావేశం అవుదామని చెప్పారు. కొత్తచట్టంతో భూ వివాదాలకు శాశ్వతంగా ఫుల్‌స్టాప్ పడాలని, భూమి క్రయవిక్రయాల్లో రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆటోమేటిక్‌గా అమ్మినవారి ఖాతానుంచి డిలీట్ అయి కొనుగోలుచేసిన రైతు ఖాతాలో జమకావాలని, ఇవన్నీ పట్టాదార్ పాస్‌పుస్తకంలో నమోదుకావాలని చెప్పారు. తనకు సమస్య ఉన్నదని, తన భూమిని రికార్డుల్లోకి ఎక్కించాలని, పహాణీలు కావాలని కార్యాలయాల చుట్టూ రైతు తిరిగే దుస్థితి పోవాలని కలెక్టర్లకు సీఎం కేసీఆర్ సూచించారు. భూరికార్డుల్లో భూ యజమాని కాలమ్ మాత్రమే ఉండాలని, అనుభవదారు కాలమ్ అవసరంలేదని కలెక్టర్లకు సీఎం స్పష్టంచేసినట్లు తెలిసింది. భూ యజమానులకు హక్కులు కలిగేలా కొత్త చట్టం రావాలన్న సీఎం.. దీనిని ఎలా రూపొందిస్తే బాగుంటుంది.. కొత్తచట్టంలో ఏయే అంశాలు పొందుపర్చాలనే అంశాలపై కలెక్టర్ల నుంచి అభిప్రాయాలు స్వీకరించినట్లు సమాచారం.

## పకడ్బందీగా 60 రోజుల కార్యాచరణ

పల్లెలు, పట్టణాలు పచ్చదనం, పరిశుభ్రతతో కళకళలాడాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, దీనికి అనుగుణంగా 60 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలుచేయాలని సీఎం కేసీఆర్ కలెక్టర్లను కోరారు. కొత్త పంచాయతీరాజ్ చట్టం, పురపాలక చట్టాల అమలుపై చర్చ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రజలకు సేవలు అందించేందుకే చట్టాలు చేసుకున్నామని, వీటిని పక్కాగా అమలుచేయాలని కలెక్టర్లకు స్పష్టం చేసినట్లు తెలిసింది. 60 రోజుల ప్రత్యేక కార్యాచరణ పక్కాగా అమలుకావాలని ఆదేశించారు. రెండోరోజు సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని కోమటిబండలో పునరుద్ధరించిన అడవిని కలెక్టర్లకు చూపించిన సీఎం.. ఈ దిశగా రాష్ట్రంలోని అన్ని అటవీప్రాంతాలను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర అభివృద్ధి ముఖచిత్రాన్ని మార్చేవిధంగా రెండురోజులపాటు కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం చేశారు.

## విద్యాశాఖలో ఈ-ఆఫీస్

### అక్టోబర్ 2 నుంచి అమలు!

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని పాఠశాల విద్యాశాఖలో ఈ-ఆఫీస్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. అక్టోబర్ 2 నుంచి రాష్ట్రంలో అమలుకు ఏర్పాట్లు కొనసాగిస్తున్నారు. ఎన్ఐసీ సహకారంతో విద్యాశాఖలో ఈ-ఆఫీస్ ద్వారా ఫైళ్లకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నారు. ఫైళ్లు ఎప్పటికప్పుడు పరిష్కరించడంతోపాటు కొత్త ఫైళ్లకు వెంటనే పరిష్కారం ఆ శాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి తెలిపారు.

**ముహూర్తం**

సూర్యోదయం: 6.04 గంటలకు

సూర్యాస్తమయం: 6.34 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం, షష్ఠి ఉదయం 7.08 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: భరణి, అమృతఘడియలు: రాత్రి 9.27 నుంచి 11.02 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.53 నుంచి 3.26 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.14 నుంచి సాయంత్రం 4.54 వరకు, వర్జ్యం: లేదు.

# అమెజాన్ అతిపెద్ద క్యాంపస్

- అమెరికా వెలుపల హైదరాబాద్ వేదికగా ఏర్పాటు
- ప్రారంభించిన హోంమంత్రి మహమూద్‌అలీ
- 15వేల మంది ఉద్యోగులు పనిచేసేలా 3 మిలియన్ల చదరపు అడుగుల్లో నిర్మాణం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఈ కామర్స్ రంగంలో దిగ్గజం అమెజాన్ సంస్థ హైదరాబాద్‌లో భారీ క్యాంపస్‌ను ఏర్పాటుచేసింది. గచ్చిబౌలి సమీపంలోని నానక్‌రాంగుడాలో 9.5 ఎకరాల స్థలంలో 3 మిలియన్ చదరపు అడుగుల నిర్మాణ స్థలంలో 15వేల మంది ఉద్యోగులు ఏకకాలంలో పనిచేసేలా ఉన్న ఈ ప్రాంగణం అమెరికా వెలుపల అమెజాన్ సంస్థకు చెందిన అతిపెద్ద కార్యాలయం కావడం విశేషం. ఈ కార్యాలయాన్ని బుధవారం రాష్ట్ర హోంమంత్రి మహమూద్‌అలీ ప్రారంభించారు. అమెజాన్ గ్లోబల్ రియల్ ఎస్టేట్ వైస్‌ప్రెసిడెంట్ జాన్‌స్కాట్లర్, యూఎస్ కాన్సులేట్ జనరల్ జోయల్ రీఫ్‌మన్, తెలంగాణ ఐటీ, పరిశ్రమల ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, అమెజాన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ, తెలంగాణలో ఇప్పటికే అనేక ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు తమ కేంద్రాలను పెద్దఎత్తున ఏర్పాటుచేశాయని, ఈ జాబితాలో అమెజాన్ కూడా చేరడం హర్షణీయమన్నారు. అత్యుత్తమ పరిపాలనా విధానాలు, వాతావరణపరంగా ఎలాంటి ఇబ్బందుల్లేని ప్రాంతంలో హైదరాబాద్ ఉన్నదని వెల్లడించారు. నగరానికి తూర్పువైపున కూడా తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరించేందుకు అమెజాన్ కృషిచేయాలని కోరారు. ఐటీశాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్ మాట్లాడుతూ, టీఎస్ఐపాస్‌ను ప్రవేశపెట్టిన సమయంలో నియమిత వ్యవధిలో అనుమతి పొందిన తొలిసంస్థ అమెజాన్ అని వెల్లడించారు. జాన్ స్కాట్లర్ మాట్లాడుతూ.. తక్కువ సమయంలో, అత్యున్నత ప్రమాణాలతో నిర్మాణమైన ఈ భవనంలో భాగస్వామ్యం పంచుకోవడం అదృష్టమన్నారు. తెలంగాణ ప్రభుత్వ విధానాలు, అందించిన సహకారంతోనే స్వల్ప వ్యవధిలోనే తమ కార్యకలాపాలు ప్రారంభించుకోగలిగామని చెప్పారు. ఈ కేంద్రంలో ప్రస్తుతం 4వేల మంది ఉద్యోగులు సేవలు అందిస్తున్నారని తెలిపారు. భారత్‌లో 15 ఏండ్లుగా తమసంస్థ కార్యకలాపాలు సాగుతున్నాయని, రాబోయే కాలంలో మరింత విస్తరించేందుకు ఈ కేంద్రంగా సాక్షిగా నిలుస్తుందని అమెజాన్ ఇండియా ఉపాధ్యక్షుడు అమిత్ అగర్వాల్ వెల్లడించారు. భారత్‌లో 62,000 మంది పనిచేస్తున్నారని, దేశంలో ఇప్పటికే 5 బిలియన్ల పెట్టుబడులు పెట్టామని, ఫుడ్ అండ్ రిటైల్‌లో మరో 500 మిలియన్ల పెట్టుబడి పెట్టినట్టు వివరించారు. భారత్‌లో ఆర్థికమాంద్యం ఛాయలు ఉన్నప్పటికీ అది తమ వ్యాపారంపై ప్రభావం చూపించదని భావిస్తున్నామన్నారు. కేంద్రం ప్రారంభం సందర్భంగా హోంమంత్రి మహమూద్‌అలీ అలెక్సాతో అనుసంధానమై పలు ప్రశ్నలు అడిగారు. 2016 మార్చి 30న ఈ భవనానికి శంకుస్థాపన జరిగింది.



హైదరాబాద్‌లో అమెజాన్ క్యాంపస్‌ను ప్రారంభించి మొక్కకు నీళ్లుపోస్తున్న మంత్రి మహమూద్ అలీ




హైదరాబాద్‌లో అమెజాన్ భారీ క్యాంపస్ ఏర్పాటును హర్షిస్తూ కేటీఆర్ చేసిన ట్వీట్

## అమెజాన్ ప్రారంభోత్సవం గర్వకారణం: కేటీఆర్

**హైదరాబాద్‌లో** అమెజాన్ అతిపెద్ద కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషకరమే కాకుండా గర్వకారణమని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు తెలిపారు. ఐటీ రంగానికి సంబంధించి ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న పురోగామి విధానాలు, ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ సహాయసహకారాలతో తెలంగాణ అత్యుత్తమ గమ్యస్థానంగా మారిందని కొనియాడారు. ఈ మేరకు ఆయన బుధవారం ట్వీట్‌చేశారు. 2016లో శంకుస్థాపన నాటిచిత్రాలను ఈ సందర్భంగా ట్విట్టర్‌లో ఉంచారు.

# సరళ్‌లో మనం అ'ద్వితీయ'ం

మొదటిపేజీ తరువాయి...

ఉన్నట్టు తేటతెల్లం అవుతున్నది. ఓవరాల్‌గా అగ్రస్థానంలో ఉన్న కర్ణాటక.. వినియోగదారుల సంతృప్తి, సానుకూలత అంశంలో 67.02 స్కోరు మాత్రమే సాధించింది. పెట్టుబడులకు అనుకూలత అంశంలో కర్ణాటక (80.79) కన్నా తెలంగాణ మెరుగైన స్కోరు (81.79) సాధించడం గమనార్హం.

## ఐదు ప్రామాణిక అంశాలు ఇవీ..

రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ఏర్పాటులో ఆయా రాష్ట్రాలు తీసుకున్న చర్యలు, వాటి ఫలితాలను కేంద్రం (ఎంఎన్ఆర్ఈ) పరిశీలించింది. ఇందుకు దృఢమైన పాలసీ నిర్మాణం, పాలసీ అమలుకు అనుకూలమైన వాతావరణం, పెట్టుబడులకు అనుకూలత, వినియోగదారుల సంతృప్తి, వ్యాపార అనుకూల వ్యవస్థ అనే ఐదు అంశాలను ప్రామాణికంగా తీసుకున్నది. ఈ అంశాలవారీగా రాష్ట్రాల్లో రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటును పరిశీలించింది. ఒక్కో అంశంలో కొన్ని పరిమితులు, సూచీలను నిర్దేశించుకుని స్కోర్ వేశారు.

## రూఫ్‌టాప్ సోలార్ ద్వారా 135.35 మెగావాట్లు..

రూఫ్‌టాప్ సోలార్ ద్వారా 135.35 మెగావాట్ల విద్యుత్తును తెలంగాణ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటివరకు రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్‌కోసం 4736 దరఖాస్తులు రిజిస్టర్ కాగా.. ఇందులో 3878 దరఖాస్తులకు సంబంధించి 95.21 మెగావాట్లను ఇప్పటికే గ్రిడ్‌కు అనుసంధానించారు. మరో 858 దరఖాస్తులకు సంబంధించి 40.14 మెగావాట్లను అనుసంధానించాల్సి ఉన్నది.

## కేంద్రం లక్ష్యాలకు అనుగుణంగా..

2022నాటికి దేశవ్యాప్తంగా 100 గిగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తిచేయాలని, అందులో 40 గిగావాట్లను రూఫ్‌టాప్ ద్వారానే సాధించాలనే లక్ష్యంతో కేంద్రం ఉండగా.. అందుకు అనుగుణంగా.. తెలంగాణ దూసుకెళుతున్నది. అత్యంత చిన్న వయసున్న రాష్ట్రమైనా.. విద్యుత్‌రంగంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది. ఇందులో భాగంగానే సోలార్ విద్యుత్‌ను తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. ఇప్పటికే సౌర విద్యుత్‌లో గుజరాత్, రాజస్థాన్‌ల సరసన తెలంగాణ నిలిచింది. అత్యధికంగా సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నది. అదే సమయంలో రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ఏర్పాటులోనూ దేశంలో రెండో స్థానంలో.. ముఖ్యంగా వినియోగదారుల సంతృప్తి, సానుకూలత అంశాల్లో అగ్రస్థానంలో నిలువటం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను స్పష్టం చేస్తున్నదని అధికారులు పేర్కొంటున్నారు.



**కేంద్రం ప్రకటించిన ర్యాంకులు, సరళ్ స్కోరు, అంశాలవారీగా సాధించిన స్కోర్లు ఇలా ఉన్నాయి..**

| ర్యాంకు | రాష్ట్రం | సరళ్ స్కోరు | దృఢమైన పాలసీ | ప్రభావవంతంగా అమలు | పెట్టుబడి అనుకూలత | వినియోగదారుల సంతృప్తి | వ్యాపారాభివృద్ధి వాతావరణం | గ్రేడ్ |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | కర్ణాటక | 78.76 | 99.54 | 76.77 | 80.79 | 67.02 | 70.50 | ఏ ++ |
| 2 | తెలంగాణ | 72.21 | 61.48 | 68.08 | 81.79 | 80.59 | 66.63 | ఏ ++ |
| 3 | గుజరాత్ | 67.87 | 31.25 | 81.11 | 83.28 | 75.25 | 61.06 | ఏ ++ |
| 4 | ఏపీ | 66.10 | 79.17 | 66.84 | 72.08 | 54.50 | 58.95 | ఏ ++ |
| 5 | రాజస్థాన్ | 62.25 | 66.67 | 64.29 | 80.76 | 51.53 | 46.03 | ఏ + |
| 6 | మధ్యప్రదేశ్ | 58.27 | 12.50 | 63.10 | 77.98 | 78.00 | 52.10 | ఏ+ |
| 7 | ఢిల్లీ | 54.61 | 31.25 | 68.61 | 60.52 | 56.86 | 48.76 | ఏ + |
| 8 | పంజాబ్ | 53.42 | 45.83 | 48.08 | 78.51 | 55.75 | 35.25 | ఏ + |
| 9 | మహారాష్ట్ర | 52.01 | 31.25 | 50.57 | 74.93 | 52.07 | 58.09 | ఏ + |
| 10 | తమిళనాడు | 50.87 | 40.97 | 46.82 | 65.98 | 51.72 | 53.43 | ఏ + |

## లోకం పోకడ



వస్తానంటే బీజేపీలోకి తీసుకోండి, లేదంటే అదుపులోకి తీసుకోండి!

# సభ్యత్వ నమోదుపై నేడు కేటీఆర్ సమీక్ష

- కమిటీల నియామకం, కార్యాలయాల నిర్మాణ పురోగతిపై చర్చ
- హాజరుకానున్న సభ్యత్వాల, భవనాల నిర్మాణ ఇంచార్జీలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) సభ్యత్వ నమోదుపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు గురువారం సమీక్షించనున్నారు. వివిధ కమిటీల నియామకంతోపాటు జిల్లా పార్టీ కార్యాలయాల నిర్మాణ పురోగతిపై పార్టీ సభ్యత్వ నమోదు ఇంచార్జీలను అడిగి తెలుసుకోనున్నారు. తెలంగాణభవన్‌లో ఉదయం నిర్వహించే సమావేశానికి పార్టీ సభ్యత్వ నమోదు ఇంచార్జీలు, పార్టీ కార్యాలయాల భవనాల నిర్మాణ ఇంచార్జీలు, డాటా ఎంట్రీ ఇంచార్జీలు హాజరుకానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ సభ్యత్వ నమోదు ఇప్పటికే పూర్తయింది. బూత్, గ్రామ, వార్డు కమిటీల ఎన్నికలు వివిధ దశల్లో ఉన్నాయి. ఇటీవల జరిపిన సమీక్ష సమావేశం నాటికి పార్టీ సభ్యత్వ నమోదు 50 లక్షలు పూర్తయింది. బోనాలు తదితర పండుగలు రావడంతో సభ్యత్వ నమోదు గడువును ఈ నెల 10 వరకు పెంచారు. వీటన్నింటి నేపథ్యంలో పార్టీ సభ్యత్వ నమోదు ఇంచార్జీలతో కేటీఆర్ సమీక్ష జరుపనున్నారు. గ్రామీణ ప్రాంత నియోజకవర్గాల్లో బూత్, గ్రామ కమిటీల ఎన్నిక పూర్తికావచ్చింది. మరికొన్ని నియోజకవర్గాల్లో కొనసాగుతున్నది. అలాగే, దసరా పండుగ నాటికి జిల్లా పార్టీ కార్యాలయాల నిర్మాణాలను పూర్తిచేయాలని పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటికే కార్యాలయాల భవనాల నిర్మాణ నమూనా, నిర్మాణానికయ్యే వ్యయాన్ని పార్టీ ఫండ్ నుంచి నిధులను చెక్కుల రూపంలో అందించారు. కార్యాలయాల భవనాల నిర్మాణం పనులు ఎక్కడిదాకా వచ్చాయి..? ఎప్పటిలోగా పూర్తవుతాయి..? అనే విషయాలపై కేటీఆర్ మాట్లాడుతారు. నిర్మాణం పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పడంతోపాటు పలు సూచనలు చేయనున్నట్టు తెలిసింది.



రాజీవ్‌గాంధీ దేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే క్రమంలోనే ఆత్మ బలిదానం చేశారు. పంజాబ్, అస్సాం, మిజోరం లాంటి రాష్ట్రాల్లో ఉన్న వేర్పాటువాద ఉద్యమాలను శాంతి ఒప్పందాల ద్వారా పరిష్కారం చేశారు. కానీ మోదీ విధానాలతో నేడు ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది.

**ముకుల్ వాస్నిక్, సీనియర్ కాంగ్రెస్ నేత**

రాజకీయ దురుద్దేశాలతోనే ఈడీ, సీబీఐలతో మాజీ ఆర్థికమంత్రి పి.చిదంబరంపై దాడులు చేయిస్తున్నారు. చిదంబరం న్యాయకోవిదులు. ఆయన తనపై వచ్చిన ఆరోపణల నుంచి న్యాయబద్ధంగానే బయటపడుతారు.

**ఎంకే స్టాలిన్, డీఎంకే అధినేత**



**చరిత్రలో నేడు**



**1639**

మద్రాసు నగరానికి పునాదిరాయి వేసిన బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ. స్థానిక పాలకుల నుంచి భూమిని కొనుగోలు చేసిన కంపెనీ.

**1894**

దక్షిణాఫ్రికా నాటల్‌లో భారతీయ వ్యాపారస్థుల పట్ల వివక్షకు వ్యతిరేకంగా నాటల్ ఇండియన్ కాంగ్రెస్ (ఎన్ఐసీ)ను స్థాపించిన గాంధీ.





**1945**

వియత్నాంలో హోచిమిన్ నాయకత్వంలో విజయవంతమైన ప్రజాఉద్యమం.

అస్సాంలో చేపట్టిన జాతీయ పౌర నమోదు రిజిస్టర్ (ఎన్ఆర్‌సీ) ప్రక్రియ గడువు ఈ ఆగస్టు 31తో ముగియనున్నది. సరిహద్దు జిల్లాల్లో 20 శాతం మంది పౌరసత్వ గుర్తింపును పునఃపరిశీలించాలన్న రాష్ట్రప్రభుత్వ విన్నపాన్ని సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఇంతకుముందే రాష్ట్రంలో 27 శాతం జాబితాను పరిశీలించింది. ఇంకా వివిధవర్గాల నుంచి విజ్ఞప్తులు వస్తూనే ఉన్నాయి. దేశంలో పౌరగుర్తింపు, నమోదు ప్రక్రియ ఎంత అధ్వాన్నంగా ఉన్నదో తెలుపుతున్నది. ఇప్పటికే 41 లక్షల మంది భవితవ్యం త్రిశంకు స్వర్గంగా మారింది. ఈ సమస్య మరో జాతీయ సమస్యగా మారకుండా చూడాల్సిన బాధ్యత పాలకులది.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

తమిళనాడులో కుల సమస్య కొత్తరూపంలో తెరమీదికి వచ్చింది. ఉత్తర తమిళనాడులో పాఠశాల విద్యార్థులు తమతమ కులాన్ని చాటిచెప్పే ప్రత్యేక తరహా బ్యాండ్లను ధరించటం వివాదాస్పదమైంది. దీంతో విద్యాశాఖ అలాంటి బ్యాండ్లను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. బ్రాహ్మణేతర, కులాధిపత్యానికి వ్యతిరేకంగా ద్రవిడ ఉద్యమం నడిచిన తమిళనాడులో కుల గుర్తింపు సమస్య చిన్నపిల్లల స్థాయిలోకి కూడా చొరబడటం ఆశ్చర్యం. ఇలాంటి పోకడలను ఆదిలోనే తుడిచివేయాల్సిన అవసరం ఉన్నది.

**ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్**



# ఆచితూచి అడుగులు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కశ్మీర్ విషయంలో మధ్యవర్తిత్వం వహించాలన్న కుతూహలాన్ని మరోసారి వ్యక్తం చేశారు. కశ్మీర్‌లో 'విస్ఫోట' పరిస్థితి ఉందని అంటూ అదొక సంక్లిష్టమైన ప్రదేశంగా అభివర్ణించారు. అక్కడ హిందువులు, ముస్లింలు ఉన్నారనీ, సర్దుకుపోలేకపోతున్నారనీ, తాను మధ్యవర్తిత్వం చక్కగా నెరపగలననీ ఆయన అంటున్నారు. భారత, పాకిస్థాన్ ప్రధానులతో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం ట్రంప్ చెబుతున్న మాటలివి! ట్రంప్ భారత్‌కు మద్దతు ఇస్తున్నట్టు మీడియాలో ఇప్పటికే ప్రచారం అయిపోయింది. కానీ ట్రంప్ మాటలు చూస్తే మద్దతు ఇస్తున్నారా, కశ్మీర్ పరిస్థితి ఆందోళకరంగా ఉందని ప్రపంచానికి చాటుతున్నారా అనే సందేహం కలుగుతుంది. అమెరికా వైఖరి ఎప్పుడూ నమ్మదగినదిగా ఉండదు. భారత్‌కు మద్దతు ఇస్తూనే ఇరుకునపెట్టే రీతిలో మాట్లాడుతుంది. మన దేశంతో స్నేహం చేస్తూనే ఉపగ్రహంగా మార్చేసుకునే పథకాలు అమలు చేస్తుంది. ఏకకాలంలో భారత్‌ను, పాకిస్థాన్‌ను స్నేహదేశంగా నమ్మించగలదు. అమెరికాకు కావలసింది తమ ప్రయోజనాలను తీర్చుకోవడం, తమ అధిపత్యాన్ని కాపాడుకోవడం. స్నేహదేశం అని చెప్పుకోవడం కూడా ఈ లక్ష్యాల సాధనలో అనుసరించే ఒక వైఖరి! అమెరికా వైఖరిని మన దేశం మార్చడం సాధ్యం కాదు. మన ప్రభుత్వం చేయవలిసిందల్లా అమెరికాకు కానీ, మరే దేశానికి కానీ మన ఆంతరంగిక వ్యవహారాల్లో తలదూర్చే అవకాశం ఇవ్వకపోవడం. చైనా, పాకిస్థాన్‌లను శక్తిమేర కట్టడి చేయవచ్చు, కానీ మిత్రరాజ్యాన్ని నియంత్రించడానికి నేర్పు కావాలె.

**జమ్ముకశ్మీర్‌పై తీసుకున్న నిర్ణయాలు భారత ఆంతరంగికమైనా, విదేశాలపై ప్రభావం చూపగలవని, ఈ ఉద్రిక్తతను సడలించడానికి భారత్, పాకిస్థాన్ చర్చలు జరుపాలని ఆ అధికారి హితవు చెప్పారు. అమెరికా అధికారి వ్యాఖ్యల నేపథ్యంలో కేంద్రం అప్రమత్తం కావాలె. అంతర్జాతీయంగా ఇప్పుడున్న అనుకూల పరిస్థితి ఎప్పుడూ ఉంటుందనుకోలేము. కశ్మీర్‌లో ఎక్కువ కాలం భారీగా సైనిక బలగాలను కొనసాగిస్తూ, ఆంక్షలు ఎత్తివేయకపోతే విదేశాలు వేలెత్తి చూపడానికి అవకాశం కల్పించినట్టవుతుంది. కశ్మీర్‌లో వీలైనంత వేగంగా సాధారణ పరిస్థితులు నెలకొల్పడంతో పాటు ఎన్నికలు నిర్వహించడానికి సమాయత్తం కావాలె.**

జమ్ముకశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దుచేయడం సరైన నిర్ణయమా అనేది ఒక చర్చ అయితే, కేంద్ర ప్రభుత్వం తక్షణం చేయవలసింది ఏమిటనేది మరో చర్చ. కేంద్ర ప్రభుత్వం చతురతతో వ్యవహరించి తాము చెబుతున్న ఫలితాలను సాధించినట్టయితే 370 అధికరణాన్ని నిర్వీర్యం చేయడం సరైందేనని నిరూపించుకున్నట్టు అవుతుంది. స్వయం ప్రతిపత్తి రద్దు విషయంలో ఇప్పుడు జరుగుతున్న చర్చ భిన్నాభిప్రాయాలతో కూడిన ది. ఎవరి దృఢాభిప్రాయాలు వారికి ఉంటాయి. తీసుకున్న నిర్ణయం సరైందా కాదా అనేది భవిష్యత్ పరిణామాలను బట్టి తేలుతుంది. పరిస్థితి ని తమకు అనుగుణంగా మలుచుకున్నప్పుడే మోదీ చెప్పుకుంటున్న లక్ష్యం నెరవేరినట్టు. మోదీ ప్రభుత్వం తాము అనుకున్నది చేయడానికి అనేక అనుకూలాంశాలు ఉన్నాయి. మోదీకి స్వపక్షం, విపక్షం నుంచి పెద్దగా అడ్డంకుల్లేవు. పార్లమెంటులో తమ మాట నెగ్గించుకోగలుగుతున్నారు. జమ్ముకశ్మీర్ పరిస్థితిపై సుప్రీం కోర్టు కూడా కొంత వ్యవధి ఇవ్వాలన్నది. ఐక్యరాజ్య సమితి నుంచి కూడా ఒత్తిడి రావడం లేదు. తాను అనుకున్నది అమలు చేయడానికి మోదీకి ఇది మంచి తరుణం. జమ్ముకశ్మీర్, లడాఖ్ అభివృద్ధి గురించి ప్రధాని మోదీ తన దృక్కోణాన్ని చక్కగా వివరించారు. అక్కడి పిల్లలకు విద్య అం దించడం, నైపుణ్యం గరిపి ఉద్యోగాలు ఇవ్వడం తమ కర్తవ్యమని చెప్పారు. ప్రత్యేక ప్రతిపత్తి రద్దు చేయడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలకు అవరోధాలు తొలిగి అక్కడి ప్రజలకు మరింత లాభం జరుగుతుందని వివరించారు. ఈ వాగ్దానాలనే మోదీ ప్రభుత్వం ఆచరణలో చూపవలసి ఉం టుంది. జమ్ముకశ్మీర్ ప్రజల మనసును చూరగొనడం ద్వారానే విమర్శకులకు తగు జవాబు ఇవ్వగలరు.

కశ్మీర్‌లో ప్రభుత్వ కార్యాలయాలను, పాఠశాలలను తెరిచినట్టు ప్రభుత్వం చెబుతున్నది. కానీ ఉద్యోగస్తులు, విద్యార్థులు రావడం లేదు. వ్యాపారాలు సాగడం లేదు. రవాణా అంతంత మాత్రంగా ఉన్నది. ల్యాండ్‌లైన్ ఫోన్లు చాలా వరకు పునరుద్ధరించినప్పటికీ, మొబైల్, ఇంటర్‌నెట్ సౌకర్యం ఇంకా లేదు. రాజకీయ నాయకులు నిర్బంధంలోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో కశ్మీర్ విషయమై అమెరికా విదేశాంగశాఖ అధికారి బుధవారం మాట్లాడిన తీరు గమనార్హమైనది. సమీప భవిష్యత్తులో మేం కోరుకునేది– కశ్మీర్‌లో నిర్బంధంలో ఉన్న వారి విడుదల, ప్రాథమిక హక్కుల పునరుద్ధరణ, ప్రధాని చెపినట్టుగా మొదట కేంద్ర పాలిత ప్రాంతంగా, తర్వాత రాష్ట్రంగా సాధారణ పరిస్థితులు ఏర్పడటం, రాజకీయ చర్చలు ప్రారంభించడం... అని ఆ అధికారి వివరించారు. పౌరులపై ఆంక్షలు తొలిగిపోవాలని, చట్టబద్ధ విధానాలను అనుసరించాలని సూచించారు. జమ్ముకశ్మీర్‌పై తీసుకున్న నిర్ణయాలు భారత ఆంతరంగికమైనా, విదేశాలపై ప్రభావం చూపగలవని, ఈ ఉద్రిక్తతను సడలించడానికి భారత్, పాకిస్థాన్ చర్చలు జరుపాలని ఆ అధికారి హితవు చెప్పారు. అమెరికా అధికారి వ్యాఖ్యల నేపథ్యంలో కేంద్రం అప్రమత్తం కావాలె. అంతర్జాతీయంగా ఇప్పుడున్న అనుకూల పరిస్థితి ఎప్పుడూ ఉంటుందనుకోలేము. కశ్మీర్‌లో ఎక్కువ కాలం భారీగా సైనిక బలగాలను కొనసాగిస్తూ, ఆంక్షలు ఎత్తివేయకపోతే విదేశాలు వేలెత్తి చూపడానికి అవకాశం కల్పించినట్టవుతుంది. కశ్మీర్‌లో వీలైనంత వేగంగా సాధారణ పరిస్థితులు నెలకొల్పడంతో పాటు ఎన్నికలు నిర్వహించడానికి సమాయత్తం కావాలె. ప్రజాస్వామ్య విధానాలే మన దేశానికి బలాన్నిస్తాయి.

**జనగళం**

### విష జ్వరాలను అదుపు చేయాలి

ఈ మధ్య పడిన వానలతో రాష్ట్రవ్యాప్తంగా విషజ్వరాలు ప్రబలాయి. ఎక్కువగా చిన్నపిల్లల్లో విషజ్వరాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దవాఖానాలన్నీ జ్వరపీడితులతో నిండిపోతున్నాయి. దవాఖాన్లలో రోగులకు సరైన వసతులు, అవసరమైన మందులు కూడా ఉంటున్న పరిస్థితి లేదు. కాబట్టి సీజనల్ వ్యాధులను ఎదుర్కోవటానికి దవాఖాన ల్లో చాలినన్ని మందులు అందుబాటులో ఉంచాలి. మౌలిక సదుపాయాలు కల్పించాలె. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో విషజ్వరాల ప్రభావం ఎక్కువగా ఉంటున్నది. కాబట్టి మండలస్థాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా విష జ్వరాల కోసం మందులు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

**- విష్ణు, హయత్‌నగర్**

### సెల్‌ఫోన్ ఎందుకోసం?

ఆధునిక ప్రపంచంలో అందుబాటులోకి వచ్చిన ప్రతి వస్తువూ ప్రజల చేతుల్లో ఆడంబరంగా మారిపోతున్నది. ఈ నేపథ్యంలోంచే ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటున్నది. ఫోన్ అవసరం పరస్పర సమాచారం కోసమే అయితే ఫోన్లలోని బేసిక్ మోడల్ అయినా సరిపోతుంది. కానీ ఇవ్వాళ పాఠశాల విద్యార్థుల నుంచి అందరి చేతుల్లో స్మార్ట్ ఫోన్ ఫ్యాషన్‌గా మారిపోయింది. ఆ స్మార్ట్ ఫోన్లను ముఖ్యంగా విద్యార్థులు, యువత ఏ తీరుగా వినియోగిస్తున్నారు అన్నదానిపై ఎలాంటి పర్యవేక్షణ, నియంత్రణ ఉండటం లేదు. స్మార్ట్ ఫోన్లలో అందుబాటులో ఉంటే పలురకాల సైట్లలో ఎంతటి వికృతాలున్నాయో అందరూ ఆలోచించాలి. ఇలాంటి వికృత సైట్ల మూలంగానే సమాజంలో నేర ప్రవృత్తి, సామాజిక హింస పెరిగిపోతున్నది. జరుగుతున్న నేరాలు, వాటి స్వభావాలను లోతుగా విశ్లేషించి చూస్తే వాటన్నింటి వెనుకాల స్మార్ట్ ఫోన్లే కారణమని తెలుస్తున్నది. కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను స్మార్ట్ ఫోన్లకు దూరంగా ఉంచటం ఒక బాధ్యతగా చేపట్టాలి. నిజానికి ఇంజినీరింగ్ లాంటి ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులకు ఓ మోస్తరుగా ఉపయోగపడే స్మార్ట్ ఫోన్ ఇప్పుడు పదోతరగతి విద్యార్థి చేతిలోకి చేరితే జరిగే అనర్థాలు ఈ రీతిన ఉంటాయో జరుగుతున్న ఘటనలు చెబుతున్నాయి. ఇప్పటికైనా అందరూ మేల్కోవాలి.

**- డి.గణేశ్, మిర్యాలగూడ, నల్లగొండ జిల్లా**

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్ నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

ఆలోకన



**టంకశాల అశోక్**

# అంతిమ శ్రీరామరక్ష అభివృద్ధే

**మనం వర్తమానంలో చూస్తున్న రాజకీయ దృశ్యాలు అన్నింటికీ వర్తించే సూత్రం ఒకటున్నది. అధికారంలో ఉన్నది ఒక జాతీయపార్టీ లేదా ప్రాంతీయపార్టీ కావచ్చు. దాని సిద్ధాంతం ఏదైనా కావచ్చు. వారి అధికారానికి అంతిమ శ్రీరామరక్ష మాత్రం అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయమే. ఆ సూత్రాన్ని సవ్యంగా పాటించినంత కాలం ఏ ప్రమాదమూ వాటిల్లదు. ఏవైనా అసాధారణ పరిణామాలు సంభవిస్తే తప్ప. దేశంలో మొదటి ఎన్నికలు జరిగినప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన జాతీయ, ప్రాంతీయ ఎన్నికల ఫలితాలు అన్నింటికి ఇవే సూత్రాలు వర్తిస్తూ వచ్చాయి. ఇకముందూ ఇదే జరుగుతుంది.**

వర్తమానాన్ని గమనించినపుడు మనకు ఒకానొక భావ జాలం పైచేయి సాధిస్తున్నట్లు కన్పిస్తుంది. లోతుల్లోకి వెళ్లకుండా స్థూలదృష్టితో చూసినపుడు ఇది వాస్తవమే కూడా. అంతకుముందు వరకు పైచేయిగా ఉండిన భావజాలం విఫలమై శూన్యం ఏర్పడినపుడు అం దులోకి మరొక భావ జాలం ప్రవేశించటం సహజం. అయితే ఇక్కడ అర్థం చేసుకోవలసిన ధర్మసూక్ష్మం ఒకటున్నది. అంతకు ముందువరకు పైచేయిగా ఉండిన భావజాలం విఫలం కావటానికి కారణమేమిటి? యథాతథంగా ఆ భావజాలమే విఫలమైందా లేక దానిని అమలుపరుచటంలో నాయకత్వ వైఫల్యం కారణంగా అట్లా జరిగిందా? ఈ ప్రశ్నలను అర్థం చేసుకుంటే తప్ప మనకు పరిస్థితి సరిగా అర్థం కాదు. శూన్యం ఎందుకు ఏర్పడిందో, అందులోకి ఒక కొత్త భావజాలం ఎందుకు ప్రవేశిస్తున్నదో బోధపడదు.

ఒకసారి దీనినంతా గ్రహించినట్లయితే, అపుడు సూత్రరీత్యా ఈ దేశానికి, సమాజానికి ఏది తగిన భావజాలమో, నాయకత్వాల వైఫల్యం వల్ల ఆ భావజాలం ఒడిదుడుకులకు లోనైనప్పటికీ, తాత్కాలికంగా మరొక భావజాలానిది పైచేయి అయినప్పటికీ, అంతిమంగా ఏది మన సమాజం ఎంచుకోదగిన భావజాలమో తెలియవస్తుంది. దీన్నిబట్టి, అదేవిధంగా మన దేశంలో మొదటి నుంచి గల జాతీయ, ప్రాంతీయ పార్టీలను, వాటి సిద్ధాంతాలను, పరిపాలనలను, సాఫల్య వైఫల్యాలను, ఎన్నికల్లో గెలుపోటములను విశ్లేషించిన మీదట తేలుతున్నది ఒకటున్నది. అది, ఎవరి అధికారానికి అయినా అంతిమ శ్రీరామరక్ష అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయమే. అయితే ఇక్కడ ఒక వివరణ అవసరం. మనకు 1947లో స్వాతంత్ర్యం లభించి, 1952లో మొదటి ఎన్నికలు జరిగినప్పటి నుంచి సుమారు 15 ఏండ్లు లేదా మూడు ఎన్నికల పాటు అభివృద్ధి, సంక్షేమం అనే రెండు అంశాలే సాధారణ ప్రజలకు విచారణాంశాలుగా ఉండేవి. సామాజిక న్యాయం అనే మూడవ అంశం ఎస్సీ, ఎస్టీలకు పరిమితమై ఉండేది. వారికి రిజర్వేషన్లు, కొన్నిరకాల రక్షణలు కల్పించినందున సామాజికన్యాయం లభించిందనే భావన ఉండేది. ఆ దశలో అంతటితో సంతృప్తి చెందినట్లు కనిపించిన ఆ వర్గాలు కూడా కాలం గడిచినా కొద్దీ, తమకు రిజర్వేషన్లు సరిగా అమలుకావడం లేదని, అట్లాగే ఇతరత్రా అభివృద్ధి, సంక్షేమం, సామాజిక రక్షణ లభించటం లేదని అసంతృప్తి చెందసాగాయి. ఆ విధంగా స్వాతంత్ర్యానంతరం రెండు దశాబ్దాలు గడిచేసరికి ఎస్సీ, ఎస్టీలు ఒకవైపు, ఆ వర్గాలకు చెందని ఇతర బడుగుజీవులు మరొకవైపు అసంతృప్తికి గురికాసాగారు. అది తీవ్ర రూపం దాల్చటం కూడా మొదలైంది. ఆ విధంగా తర్వాత కాలంలో సామాజిక న్యాయం, సాధికారత అనే భావనలు బడుగు, బలహీనవర్గాలన్నింటికి సార్వత్రికంగా మారాయి.

ఆ విధంగా అసంతృప్తి తీవ్రరూపం దాల్చటం దేశ రాజకీయ రంగంలో కేంద్ర స్థాయిలో, రాష్ట్రాల స్థాయిలో కూడా పెద్దపెద్ద శూన్యాలను సృష్టించసాగింది. దానితో, అప్పటివరకు ఉండిన పార్టీలు ఓడిపోవటం, ఆ శూన్యాల్లోకి ఇతర భావజాలాలతో వేరే పార్టీలు ప్రవేశించటం మొదలైంది. వాస్తవానికి పెద్దపెద్ద శూన్యాలు ఏర్పడటం రెండు దశాబ్దాల తర్వాత మొదలైనా, అసలు అసంతృప్తి అంటూ తలెత్తి చిన్నచిన్న శూన్యాలు రావటం 1957 నాటి రెండవ ఎన్నికల సమయానికే కన్పించింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేరళలో అధికారాన్ని కోల్పోవటంతో పాటు ఉత్తరప్రదేశ్, బీహార్, బెంగాల్, ఒరిస్సా వంటి ప్రధాన రాష్ట్రాలలో 1952తో పోల్చినపుడు ఓట్లు, సీట్లు పోగొట్టుకున్నది. ఆ పరిస్థితిని గమనించిన నెహ్రూ, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి, సంక్షేమాలను విస్మరిస్తే వారు మనను తోసివేసి ముందుకు పోగలరని హెచ్చరించారు. ఆయన మాటలు సరిగా ఇవే కాకపోయినా సారాంశం ఇదే. నెహ్రూ ఎంత అభ్యుదయవాది అయినా అపుడు కాంగ్రెస్ పార్టీలో ప్రాబల్యం ఫ్యూడల్ శక్తులది అయినందున తన హెచ్చరికలు పనిచేయలేదు. 1957 తర్వాత మరొక పదేండ్లు గడిచేసరికి వైఫల్యాలు మరింత పెరిగి, శూన్యం కూడా మరింత పెరిగి, అందులోకి ఇతర భావజాలాల శక్తులు ప్రవేశించటం వేగాన్ని పుంజుకున్నది. ఈ పరిస్థితిని మరొకవిధంగా చెప్పాలంటే, ఒకవేళ కాంగ్రెస్ పార్టీ తన స్వాతంత్ర్యోద్యమ కాలపు అభివృద్ధి, సంక్షేమ, సామాజిక న్యాయం లక్ష్యాలకు తు.చ తప్పకుండా కట్టుబడి పాలించినట్లయితే, రాజ్యాంగాన్ని, చట్టాలను, బడ్జెట్లను, పంచవర్ష ప్రణాళికలను సవ్యంగా అనుసరించి ఉంటే, అసలు శూన్యాలు తలెత్తటం గాని, వాటిలోకి ఇతర భావజాల శక్తులు ప్రవేశించటం గాని జరిగేది కాదు.

**సిద్ధాంతరీత్యా చూసినపుడు కాంగ్రెస్ వంటి మధ్యేమార్గ పార్టీలు అన్నివర్గాలను కలుపుకొనిపోయి, అందరి ప్రయోజనాలను పరిరక్షిస్తూ, అభి వృద్ధి-సంక్షేమం-సామాజిక న్యాయాల సమన్వయ వేదికలుగా (అంబరెల్లా పార్టీ) తమనుతాము చెప్పుకున్నాయి. తక్కినవాటిలో అనేకం అభి వృద్ధి గురించి, సంక్షేమం గురించి సాధారణ రూపంలో మాట్లాడుతూనే, నిర్దిష్ట సామాజికవర్గాలకు సామాజిక న్యాయం లేదా రాజకీయాధికారం తమ లక్ష్యమన్నాయి. ప్రాంతీయపార్టీలు ప్రాంతీయ ఆర్థిక-రాజకీయ-సామాజికశక్తుల కోసం అధికారాన్ని సాధించటంతో పాటు అభివృద్ధి, సంక్షేమం తమ అజెండాలన్నాయి.**

ఈ కథాక్రమం అంతా తదనంతర కాలంలో కాంగ్రెస్‌తో పాటు మొత్తం అన్ని పార్టీలకు, వాటి విభిన్న భావజాలాలకు, వాటి ప్రభుత్వాలకు, వాటి పరిపాలనలకు, సాఫల్య వైఫల్యాలకు వర్తిస్తూ పోయింది. ఇందులో కాంగ్రెస్ వంటి మధ్యేవాదులు, బీజేపీ వంటి మితవాదులు, కమ్యూనిస్టుల వంటి అతివాదులు ఉన్నారు. వారితో పాటు వృత్తులు, కులాలు, మతాలు, ప్రాంతీయశక్తుల పార్టీలు ఉన్నాయి.

సిద్ధాంతరీత్యా చూసినపుడు కాంగ్రెస్ వంటి మధ్యేమార్గ పార్టీలు అన్నివర్గాలను కలుపుకొనిపోయి, అందరి ప్రయోజనాలను పరిరక్షిస్తూ, అభివృద్ధి–సంక్షేమం–సామాజిక న్యాయాల సమన్వయ వేదికలుగా (అంబరెల్లా పార్టీ) తమనుతాము చెప్పుకున్నాయి. తక్కినవాటిలో అనేకం అభివృద్ధి గురించి, సంక్షేమం గురించి సాధారణ రూపంలో మాట్లాడుతూనే, నిర్దిష్ట సామాజికవర్గాలకు సామాజిక న్యాయం లేదా రాజకీయాధికారం తమ లక్ష్యమన్నాయి. ప్రాంతీయపార్టీలు ప్రాంతీయ ఆర్థిక–రాజకీయ–సామాజికశక్తుల కోసం అధికారాన్ని సాధించటంతో పాటు అభివృద్ధి, సంక్షేమం తమ అజెండాలన్నాయి.

కానీ గత సుమారు 70 ఏండ్ల చరిత్రను గమనిస్తే, పార్టీలేవైనా, సిద్ధాంతాలేవైనా, ఎవరికి వారు తమకోసం అధికార సాధన పట్ల చూపిన శ్రద్ధ అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయాల పట్ల చూపలేదు. అందువల్లనే శూన్యాలు ఏర్పడి, వాటిలోకి మరొకరు ప్రవేశించటం జరుగుతూ వస్తున్నది. కాంగ్రెస్, బీజేపీలు జాతీయస్థాయిలో, రాష్ట్రాలలో గెలువటం, ఓడటం అనేకసార్లు జరిగింది. అదేవిధంగా రకరకాలైన ఇతర పార్టీలు. గమనించదగినదేమంటే, అభివృద్ధి మాటను అట్లుంచి, ప్రత్యేకంగా సంక్షేమం, సామాజిక న్యాయం తాము పూర్తిగా కట్టుబడిన లక్ష్యాలని చెప్పుకున్న పార్టీలు సైతం కనీసం ఆ రంగాలలోనైనా సఫలం కాలేక, తమవారు అని ప్రకటించుకున్న వర్గాలకు సైతం తగు న్యాయం చేయలేక విఫలమై శూన్యాన్ని సృష్టించాయి. ఓడిపోయాయి. ఆ శూన్యంలోకి ప్రవేశించినవారు సైతం తిరిగి అవే వైఫల్యాలతో తాముకూడా ఓడిపోయారు. ఇందుకు గత 70 ఏండ్లలో మధ్యేమార్గ–అతివాద–మితవాద–అస్తిత్వవాద–సామాజికన్యాయవాద పార్టీలు అన్నింటిలో ఏదీ మినహాయింపు కాలేదు.

ఇదంతా భారత రాజకీయాల్లో సాధారణ పరిస్థితులలో సాధారణ రూపంలో జరుగుతూ వస్తున్న చరిత్ర. పైన ప్రస్తావించినట్లు అసాధారణ పరిస్థితులు ఏవైనా, ఎపుడైనా ఏర్పడి భిన్నమైన ఫలితాలు రావటం వేరు. ఉదాహరణకు తూర్పు పాకిస్థాన్‌ను బంగ్లాదేశ్‌గా మార్చటం, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ హత్యలు, రథయాత్ర అనంతరం బాబ్రీ మసీదు కూల్చివేత, పాకిస్థాన్‌పై సర్జికల్ దాడుల వంటివి. ఇటువంటివి ప్రజల్లో భావోద్వేగాలను సృష్టించి ఒక తాత్కాలిక వాతావరణాన్ని కల్పించేవి గనుక లెక్కించదగినవి కావు. ఇటువంటి ఘటనలు ఒకోసారి అనుకోకుండా జరుగవచ్చు, ఒకోసారి ఎన్నికల కోసం ఉద్దేశపూర్వకంగా జరుపవచ్చు. అయినా అవి కృత్రిమమైనవి, తాత్కాలికమైనవి.

నికరమైన రీతిలో, దీర్ఘకాలికంగా, దేశం మేలును, సమాజపు బాగును కోరే పార్టీలు చేయవలసింది మాత్రం 'అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం' అనే మూడు లక్ష్యాలనూ తమ ఎదుట ఉంచుకొని, వాటి సాధనకు త్రికరణశుద్ధిగా కృషిచేయటం. ఆ పార్టీల అధికారానికి అదే అంతిమ శ్రీరామరక్ష అవుతుంది. వారు ఆ మార్గంలో చిత్తశుద్ధితో, సమర్థవంతంగా సాగినపుడు శూన్యం ఏర్పడటమన్నది ఉండనే ఉండదు. ప్రస్తుతం మనం చూస్తున్న రాజకీయ అట్టహాసాల వంటివి ఏ శక్తులు ఏమిచేసినా వాటికి ప్రవేశమన్నది ప్రజలు కల్పించరు.

# విద్యా సామర్థ్యాలు పెరుగాలె

విద్య



**పాలకుర్తి రామమూర్తి**

ఏ సమాజాభివృద్ధికైనా విద్యావిధానమే మూలం. చదువును రెండు రకాలుగా చూడాలి. ఒకటి చదువు వల్ల అక్షరాస్యత పెరుగడం, తద్వారా ఉపాధి అవకాశాలు పొందడం కాగా, చదువు వల్ల విద్యాధికుడు, జ్ఞానవంతుడు కావడం రెండవది. సామాన్యమైన అవగాహనలో విద్య, అక్షరాస్యతలు రెండూ ఒకటిగానే భావించడం జరుగుతున్నది. కానీ ఆ రెండింటి మధ్య చాలా భేదం ఉన్నది.

విద్య బతుకడం కోసం కాదు. జీవితం ఏమిటో అర్థం చేసుకోవడం విద్య. విశ్వాసంతో, వికాసంతో, సంతృప్తితో, సమగ్రంగా, సంపూర్ణంగా, సాధికారికంగా ప్రతి క్షణాన్నీ ఆస్వాదించడమే జీవించడం. సామర్థ్యం అంటే నిపుణత, చతురత, యోగ్యత లేదా ఏదైనా పనిచేయటానికి విశేషమైన అర్హత కలిగి ఉండుట.

'Life is a struggle for existane and it is a war for survival'అంటారు కొందరు. కానీ అది సత్యం కాదు. జీవితం సాధనాపర్వం. అక్షరాలను నేర్వడం అక్షరాస్యత అయితే, అక్షరాంతర్గత భావాన్ని సమన్వయం చేసుకోవడం, విద్య. అది (విస్తృతంగా చదువడం, సంబంధిత జ్ఞానాన్ని అత్యధికంగా పొందడం), బోధ (ఎదుటివారి కోణంలో అర్థం చేసుకోవడం), అవగతం (ప్రామాణిక పరీక్షల ద్వారా నిర్ధారించుకోవడం), ప్రచారం (పదుగురికి ఆ విజ్ఞానాన్ని అందించడం, చర్చించడం లొసుగులు సవరించుకోవడం) వల్ల సార్థకమౌతుంది. ఆ చదువు సత్–అసత్ మధ్య ఉండే భేదాన్ని గుర్తించే వివేకాన్ని, చతురతను ఇస్తుంది. కర్తవ్యమేమిటో అవగతం చేస్తుంది. అలాంటి చదువు విద్యగా పరిగణించబడుతుంది. విద్యా సామర్థ్యాలు అన్నప్పుడు వీటినన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలి. రెండును రెండుతో గుణిస్తే నాలుగు లేదా రెండుకు రెండు కలిపితే నాలుగు. అదే మూడును మూడుతో గుణిస్తే తొమ్మిది కాని మూడుకు మూడు కలిపితే అది ఆరు మాత్రమే. ఇక్కడ అంకెలు మాత్రమే మారాయి. కానీ కలుపడం లేదా గుణించడం మారలేదు. అయినా భిన్నమైన ఫలితాలు రావడానికి కారణం ఏమిటనేది విద్యార్థి ఆలోచించగలుగాలి. ఆ కోణంలో ఉపాధ్యాయుడు విద్యార్థిలో ఆలోచనను రేకెత్తించగలుగాలి. ఆ ప్రేరణ విద్యార్థి సామర్థ్యాన్ని పెంచుతుంది. ఆలోచించే విధానాన్ని నేర్పుతుంది. సమస్యలను పరిష్కరించే మార్గానికి తెరతీస్తుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఆ ఆలోచనాసరళిని జీవితానికి అన్వయించుకోగలుగుతాడు. జీవితాన్ని ఉన్నతీకరించుకుంటాడు.

చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలకు తోటివారికన్నా ఎక్కువ మార్కులు రావాలని, అందరిలో తమ పిల్లలకే మొదటి గ్రేడ్ రావాలని కోరుకుంటారు. తల్లిదండ్రుల ఇష్టాయిష్టాలపై ఆధారపడి పిల్లలు చదువాలనుకుంటారు. తల్లిదండ్రుల ఆశయాలను, లక్ష్యాలను అధిగమించాలనే తపనతో చేసే ప్రయత్నంలో ఒత్తిడి ఎక్కువై అవసరానుగుణంగా విలువలను అతిక్రమించడం జరుగుతుంది. పోటీతత్వం మంచిదే. అది పరస్పరాధారిత మార్గంలో ఉంటే ఉత్తమ ఫలితాలనిస్తుంది. అలా కాని నాడు నైతికత దెబ్బతినే అవకాశం ఉన్నది.

విద్యార్థిలో ఏమిటి, ఎందుకు, ఎప్పుడు, ఎలా, ఎక్కడ, ఎవరు అనే ప్రశ్నలు ఉద్భవిస్తే ఆ విద్యార్థిలో ఉత్సుకత పెరుగుతుంది. నేర్చుకోవాలనే ప్రేరణ కలుగుతుంది. అన్వేషణ ఆరంభమవుతుంది. ఉత్సాహంతో ఆరంభమైన ప్రయాణం ఆనందంగా సాగిపోతుంది. ఒత్తిడి ఉండదు. సహజ స్వీకృతి ఆధారంగా, తార్కికంగా సాగే పయనంలో తన సామర్థ్యాన్ని వివిధ అంశాలపై విస్తరించుకోగలుగుతాడు. చేసేపనిలో నైపుణ్యాన్ని సంతరించుకునేందుకు తోడ్పడేది జిజ్ఞాస. ఆ పని పట్ల ఆసక్తి. నేర్చుకోవాలనే తపన. యాంత్రికంగా పిల్లలకు ఆసక్తిలేని రంగాల్లో, ఆసక్తి కలుగని పద్ధతులలో బోధిస్తే వారిలో నేర్చుకోవాలనే కుతూహలం లోపిస్తుంది. సామర్థ్యాలు పెరుగవు. పుస్తకస్తమైన విజ్ఞానం బట్టీయం ద్వారా మార్కులు సాధించవచ్చు, గ్రేడులను పొందవచ్చు, ఉద్యోగాలు రావచ్చు కానీ పిల్లల వైఖరి మారే అవకాశాలు తక్కువ. పరిస్థితులకు అన్వయించుకునే విధానం కొరవడుతుంది. ఉదాహరణకు ఒక ఛార్టర్డ్ అకౌంటెంట్ తన క్లయింట్ వద్ద పనిచేసే ఉద్యోగుల ఆదాయపు పన్నును మదింపు వేసే సమయంలో, ఆ ఉద్యోగి మూలవేతనంతో కలిసే అన్ని అలవెన్స్‌లు కలిపి ఎంత ఆదాయపు పన్ను కట్టగలడో చెప్పగలుగుతాడు. కానీ వ్యతిరేక దిశలో అంటే ఎంత ఆదాయపు పన్ను కట్టవలెనో చెపితే మూలవేతనం ఎంత ఉండాలన్న గణింపు అతను చేయలేకపోవచ్చు. మొదటిది చదువు వల్ల వస్తుంది. రెండవది చదువును సమర్థవంతంగా అన్వయించుకోవడం ద్వారా వస్తుంది. రెండూ కలిస్తే అతనిలో విద్యాసామర్థ్యాలు ఉన్నట్లుగా పరిగణించాలి.

అక్షరాస్యతా సామర్థ్యం కాదు మనకు విద్యా సామర్థ్యాలు కావాలనుకున్నాం. కాబట్టి ఆ వైపు దృష్టిసారించినా, పాచిపట్టిన ఆలోచనాసరళితో, కాలంచెల్లిన ప్రణాళికా నేపథ్యంలో, ఆధునిక సాంకేతిక విజ్ఞాన దీప్తిని సమన్వయం చేసుకోలేకపోవడంతో, విద్యారంగంలో ఎన్ని మార్పులు చేసినా, ఎందరు అధికారులను మార్చినా అవన్నీ పైపై పూతలుగా మిగిలిపోయాయే కానీ మూలాలపై ప్రభావాన్ని చూపలేకపోయాయి. ఆశించిన ఫలితాలు రావడం లేదు. మార్పు కావాలనుకుంటే కొన్ని సాహసోపేత నిర్ణయాలు తీసుకోవాలి. అంతర్జాతీయ ప్రమాణాలతో, ప్రపంచ నిపుణులతో నేటి యువత పోటీ పడవలసిన అవసరం వచ్చిన నేపథ్యంలో అన్నిరంగాల్లో అంతర్జాతీయంగా వస్తున్న మార్పులను పట్టించుకోకుండా, మన ప్రమాణాలు మనవనుకుంటూ ముందుకుసాగితే యువశక్తి ప్రతిభను చాటలేదన్నది నిర్వివాదాంశం.

కనీసం వచ్చే 50 ఏండ్ల కాలానికి విద్యా స్వరూపం ఎలా ఉండాలన్న దార్శనికత ఉండేవిధంగా విద్యా ప్రమాణాలతో ప్రణాళికలు రూపొందించగలుగాలి. విధాన రూపకల్పనలో ప్రాచీన సాంప్రదాయ భారతీయ సాహిత్యంలో చోటుచేసుకున్న అంశాలు నేటి ఆధునిక సాంకేతిక విధానాలకు ఏ విధంగా అనుసంధానించవచ్చునో ఆలోచించవలసిన అవసరం ఉన్నది. 10వ తరగతి చదివే విద్యార్థికి తప్పనిసరిగా కార్యస్థలంలో అనుభవం ఉండాలి. అక్కడి స్థితిగతులపై కనీస అవగాహన ఉండాలి. అవసరమైతే పాఠశాల పనిరోజులు పెంచైనా ప్రయోగాత్మకమైన, క్రియాశీలకమైన అవగాహన కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందాలి.

**విధాన రూపకల్పనలో ప్రాచీన సాంప్రదాయ భారతీయ సాహిత్యంలో చోటుచేసుకున్న అంశాలు నేటి ఆధునిక సాంకేతిక విధానాలకు ఏ విధంగా అనుసంధానించవచ్చునో ఆలోచించవలసిన అవసరం ఉన్నది. 10వ తరగతి చదివే విద్యార్థికి తప్పనిసరిగా కార్యస్థలంలో అనుభవం ఉండాలి.**

విద్యార్థులు తాము నేర్చిన విద్యను నిత్య జీవితంలో ఉపయోగించుకునే విధానంలో శిక్షణ ఇవ్వబడాలి. వ్యవసాయరంగానికి, పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక సహకారం అందించే వ్యవస్థ దిశలో విద్యా ప్రణాళికలకు విద్యాలయాలు రూపకల్పన చేయగలిగితే ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అలాగే రీసెర్చ్ డెవలప్‌మెంట్‌పై కంపెనీలు పెట్టే ఖర్చును తగ్గించవచ్చు. కాకపోతే ఈ రెంటినీ సమన్వయం చేయగలిగిన విధానాలకు రూపకల్పన జరుగాలి.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

## నాడు అమిత్‌షా.. నేడు చిదంబరం



**న్యూఢిల్లీ:** 'ఓడలు బండ్లయ్యాయి.. బండ్లు ఓడలయ్యాయి' అన్న సామెత కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, మాజీ మంత్రి చిదంబరంలకు సరిగ్గా వర్తిస్తుంది. 14 ఏండ్ల క్రితం 2005లో వివిధ కేసుల్లో నిందితుడిగా ఉన్న సోహ్రాబుద్దీన్‌ను నాడు గుజరాత్ హోంమంత్రిగా ఉన్న అమిత్‌షా ఆమోదంతోనే పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారని ఆరోపణలు వచ్చాయి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2010లో ఈ కేసు దర్యాప్తు చేపట్టిన సీబీఐ.. అదే ఏడాది జూలైలో అమిత్‌షాను సీబీఐ అరెస్ట్ చేసింది. అప్పుడు కేంద్ర హోంమంత్రిగా చిదంబరం ఉంటే.. ఇప్పుడు కేంద్రంలోని మోదీ సర్కార్‌లో హోంమంత్రిగా అమిత్‌షా ఉన్నారు. 2007లో ఐఎన్‌ఎక్స్ మీడియా సంస్థలోకి విదేశీ పెట్టుబడులను అనుమతించడంలో నిబంధనల ఉల్లంఘన జరిగిందని, అందులో నాటి కేంద్ర ఆర్థిక మంత్రి చిదంబరం కీలక పాత్ర పోషించాడని అభియోగం. ఈ ఆరోపణలపైనే బుధవారం చిదంబరంను సీబీఐ అరెస్ట్ చేసింది. ఇదంతా రాజకీయ వేధింపుల్లో భాగమేనని ఈనాడు కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలే నాడు 2010లో నాటి యూపీఏ ప్రభుత్వం, చిదంబరంలపై అమిత్‌షా, బీజేపీ ఎక్కుపెట్టాయి. అమిత్‌షా అమాయకుడని, కాంగ్రెస్ తన రాజకీయ ప్రత్యర్థులను వెంటాడుతున్నదని బీజేపీ అప్పట్లో ఆరోపించింది.

- చిదంబరం, కార్తీ గురించి ఈడీకి వెల్లడించిన ఇంద్రాణి, పీటర్

## వాళ్లు చెప్పిన వివరాలే కీలకం!





**న్యూఢిల్లీ:** ఐఎన్‌ఎక్స్ మీడియా మనీ లాండరింగ్ కేసులో ప్రధాన నిందితులైన ఇంద్రాణి, పీటర్ ముఖర్జీయా కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి చిదంబరం లోగుట్టును రట్టు చేసినట్లు తెలుస్తున్నది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తులో వీరిద్దరిచ్చిన కీలక వివరాల ఆధారాలతోనే ఆయన్ను అరెస్టు చేసినట్లు సమాచారం. ఐఎన్‌ఎక్స్ మీడియాలో విదేశీ పెట్టుబడులను అనుమతించే విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు(ఎఫ్‌ఐపీబీ) ఆమోదం కోసం తాను, తన భర్త పీటర్ ముఖర్జీయా, కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌తో కలిసి నాటి ఆర్థిక మంత్రి చిదంబరం కార్యాలయానికి వెళ్లి ఆయన్ను కలిసినట్లు ఈడీకి ఇంద్రాణి తెలిపారు. 'నా భర్త పీటర్ తొలుత చిదంబరంతో సంభాషణ ప్రారంభిస్తూ.. ఐఎన్‌ఎక్స్ సంస్థలో విదేశీ పెట్టుబడులకు సంబంధించిన దరఖాస్తు ప్రతిని అందజేశారు. విషయాన్ని గ్రహించిన చిదంబరం, తన కుమారుడు కార్తీ వ్యాపారానికి సహకరించాలని పీటర్‌ను కోరారు. ఎఫ్‌ఐపీబీ ఆమోదానికి బదులుగా కొంత విదేశాల్లో చెల్లించాలన్నారు' అని ఈడీ దర్యాప్తులో ఇంద్రాణి చెప్పారు. చిదంబరాన్ని సంతృప్తి పరిచేందుకు ఎంత డబ్బు ఇచ్చారో ఆమె చెప్పలేదు. 'ఢిల్లీలోని ఓ హోటల్‌లో కార్తీ చిదంబరాన్ని మేం కలిశాం. సమస్య పరిష్కారానికి పది లక్షల డాలర్లు తనకు, లేదా తన అనుచరుల విదేశీ ఖాతాకు మళ్లించాలని ఆయన చెప్పారు. విదేశాల్లో చెల్లించడం అసాధ్యమని పీటర్ చెప్పగా, చెస్ మేనేజ్‌మెంట్, అడ్వాన్‌టేజ్ స్ట్రాటజిక్ అనే రెండు సంస్థల ద్వారానైనా చెల్లింపులు జరుపవచ్చని కార్తీ సూచించారు' అని ఇంద్రాణి చెప్పారు. '2008లో కంపెనీ అక్రమాలపై ఆరోపణలు రావడంతో ఎఫ్‌ఐపీబీ ఆమోదం కోసం నాటి ఆర్థిక మంత్రి చిదంబరాన్ని కలవాలని నిర్ణయించాం. చిదంబరం ఆర్థిక మంత్రిగా ఉండటంతో ఆయన కుమారుడు కార్తీ సహాయం, సూచనలతో ఆరోపిత ఉల్లంఘనల నుంచి బయటపడవచ్చని భావించాం' అని పీటర్ చెప్పినట్లు ఈడీ పేర్కొంది.



# చిదంబరం అరెస్ట్



చిదంబరాన్ని అరెస్టు చేసి తీసుకెళ్తున్న సీబీఐ అధికారులు

**20 సార్లు అరెస్టు నుంచి మినహాయింపు!**

ఐఎన్‌ఎక్స్ మీడియా, ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసుల్లో పీ చిదంబరం, ఆయన కొడుకు కార్తీ చిదంబరం గత రెండేండ్లలో కనీసం ఇరవై సార్లు అరెస్టుల నుంచి తాత్కాలిక రక్షణ పొందారు. ఐఎన్‌ఎక్స్ కేసులో 2017 జూన్ 16న కార్తీపై లుక్ అవుట్ నోటీసులు జారీకాగా, అదే ఏడాది ఆగస్టు 10న మద్రాస్ హైకోర్టు స్టే విధించింది. 2018 ఫిబ్రవరి 28న కార్తీ అరెస్టయ్యాడు. అనంతరం బెయిల్‌పై విడుదలయ్యాడు. ఇదే కేసులో 2018 మార్చి 31న ఢిల్లీ హైకోర్టు చిదంబరానికి అరెస్ట్ నుంచి రక్షణ కల్పించింది. దాన్ని ఈ ఏడాది జనవరి 24 వరకు పలుమార్లు పొడిగిస్తూ పోయింది. జనవరి 25న చిదంబరం పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ చేయగా, ఆగస్టు 20న దాన్ని కొట్టివేసింది. మరోవైపు ఎయిర్‌సెల్ మ్యాక్సిస్ కేసులో చిదంబరానికి, కార్తీకి 2018 మార్చి 30 నుంచి ఢిల్లీ కోర్టు కల్పిస్తున్న తాత్కాలిక రక్షణ ఈ నెల 23తో ముగుస్తుంది.

### ఢిల్లీలోని ఆయన ఇంట్లో అదుపులోకి తీసుకున్న సీబీఐ, ఈడీ అధికారులు

### సీబీఐ కేంద్ర కార్యాలయానికి తరలింపు.. రోజంతా కొనసాగిన హైడ్రామా

- ముందస్తు బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరుపుతామన్న సుప్రీంకోర్టు
- సాయంత్రం ఏఐసీసీ ఆఫీస్‌లో హఠాత్తుగా ప్రత్యక్షమైన మాజీ మంత్రి.. అక్కడి నుంచి ఇంటికి..
- కాసేపటికే ఆయన నివాసానికి చేరుకున్న అధికారులు
- గేటు తీయకపోవడంతో గోడదూకి ఇంట్లోకి ప్రవేశం అనంతరం అరెస్ట్.. నేడు సీబీఐ కోర్టుకు..

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** ఐఎన్‌ఎక్స్ మీడియా కుంభకోణం కేసులో కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరంను (73) సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. బుధవారం రాత్రి ఢిల్లీలో జోర్‌బాగ్‌లోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను సీబీఐ కేంద్ర కార్యాలయానికి తరలించారు. చిదంబరం అరెస్టుకు ముందు బుధవారం సుప్రీంకోర్టులో, ఆయన ఇంటి వద్ద నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. తన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను రద్దు చేస్తూ మంగళవారం ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే ఇవ్వాలని కోరుతూ చిదంబరం బుధవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)విచారణ కోసం మూడుసార్లు ప్రయత్నించినా విఫలమయ్యారు. శుక్రవారం విచారణ జరుపుతామని కోర్టు సమాచారం ఇచ్చింది. మరోవైపు చిదంబరంపై సీబీఐ, ఈడీ అధికారులు లుక్ అవుట్ నోటీసులు జారీచేశారు. ఎవరూ ఊహించని విధంగా ఆయన బుధవారం రాత్రి ఢిల్లీలోని ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యక్షమయ్యారు. మీడియాతో మాట్లాడిన అనంతరం తన నివాసానికి వెళ్లారు. కొద్దిసేపటికే సీబీఐ, ఈడీ అధికారులు అక్కడికి చేరుకున్నారు. ఎంతకీ గేట్ తీయకపోవడంతో గోడదూకి ఇంట్లోకి ప్రవేశించారు. దాదాపు గంటసేపు హైడ్రామా అనంతరం చిదంబరంను అరెస్ట్ చేసి, ఢిల్లీలోని సీబీఐ కేంద్ర కార్యాలయానికి తరలించారు. రామ్‌మనోహర్ లోహియా దవాఖాన నుంచి వైద్యబృందం వచ్చి ఆయనకు వైద్యపరీక్షలు నిర్వహించినట్టు సీబీఐ వర్గాలు తెలిపాయి. ఆయనను గురువారం సీబీఐ కోర్టులో హాజరుపరుచను న్నట్టు వెల్లడించాయి.

**సీబీఐ, ఈడీ లుక్‌అవుట్ నోటీసులు**

చిదంబరంపై ఈడీ, సీబీఐ తాజాగా లుక్ అవుట్ నోటీసులు జారీచేశాయి. అన్ని విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, ప్రధాన రవాణా వ్యవస్థలకు, వివిధ ప్రాంతాల్లోని తమ శాఖలకు నోటీసులను పంపించాయి. చిదంబరం విదేశాలకు పారిపోయే అవకాశం ఉన్నదని, అప్రమత్తంగా ఉండాలని సూచించాయి.

**హఠాత్తుగా ప్రత్యక్షం**

మంగళవారం సాయంత్రం నుంచి అజ్ఞాతంలో ఉన్న చిదంబరం బుధవారం రాత్రి హఠాత్తుగా ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యక్షమయ్యారు. సుప్రీంకోర్టులో నిరాశే ఎదురవడం, సీబీఐ, ఈడీ లుక్ అవుట్ నోటీసులు జారీచేసిన నేపథ్యంలో ఆయన అజ్ఞాతం వీడినట్టు తెలుస్తున్నది. ఏఐసీసీ కార్యాలయంలో చిదంబరం తన వెంట తెచ్చుకున్న ప్రకటనను మీడియాకు చదివి వినిపించారు. తన ముందస్తు బెయిల్‌పై శుక్రవారం సుప్రీంకోర్టు తీర్పు వచ్చే వరకు తనను అరెస్ట్ చేయొద్దని దర్యాప్తు సంస్థల అధికారులను కోరారు. 'శుక్రవారం వరకు ప్రజాస్వామ్య జ్వాల ప్రకాశవంతంగా వెలుగుతూ ఉంటుందని, దేశానికి వెలుగునిస్తుందని ఆశిస్తున్నా' అని పేర్కొన్నారు. దర్యాప్తు సంస్థలు పక్షపాతంతో వ్యవహరిస్తున్నాయని, అయినా తాను చట్టాన్ని గౌరవిస్తానని చెప్పారు. తనపై, తన కుమారుడిపై తప్పుడు కేసులు బనాయించారని ఆరోపించారు. సీబీఐ, ఈడీ నమోదు చేసిన కేసుల్లో, దాఖలు చేసిన చార్జిషీట్లలో ఎక్కడా నేరుగా తమ పాత్ర ఉన్నట్టు నిరూపితం కాలేదన్నారు. విచారణ నుంచి తప్పించుకొని తిరుగుతున్నారన్న ఆరోపణలను కొట్టిపారేశారు. 'నిన్న రాత్రి వరకు నేను లాయర్ల బృందంతోనే ఉన్నాను. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు కావాల్సిన పత్రాలను తయారుచేశాం' అని చెప్పారు. అనంతరం జోర్‌బాగ్‌లోని తన ఇంటికి వెళ్లారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేతలు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీ, గులాంనబీ ఆజాద్, అహ్మద్ పటేల్, మల్లికార్జున ఖర్గే, సల్మాన్ ఖుర్షీద్ తదితరులు చిదంబరం పక్కనే ఉన్నారు.

### సుప్రీంకోర్టులో నిరాశ

**ముందస్తు** బెయిల్ పిటిషన్‌ను రద్దుచేస్తూ మంగళవారం ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధించాలని కోరుతూ చిదంబరం బుధవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కోర్టులో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. తమ పిటిషన్‌ను సీజేఐ రంజన్ గొగోయ్ దృష్టికి తీసుకెళ్లి.. అత్యవసర విచారణ చేపట్టాలని చిదంబరం తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ బుధవారం ఉదయం ఒక పిటిషన్ దాఖలు చేశారు. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే తనపై ఈ కేసు నమోదుచేశారని పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎఫ్‌ఐపీబీ) ఏకగ్రీవంగా ఆమోదించి ఇచ్చిన ప్రతిపాదనలపైనే తాను సంతకాలు చేశానని, నేరుగా తన ప్రమేయం లేదని గుర్తుచేశారు. ఈ పిటిషన్‌లో సాంకేతిక లోపాలు ఉండటంతో, వాటిని సరిదిద్ది మధ్యాహ్నం మరో పిటిషన్‌ను దాఖలు చేశారు. వీటిపై జస్టిస్‌లు ఎన్వీ రమణ, ఎం శంతనగౌడర్, అజయ్ రస్తోగితో కూడిన ధర్మా సనం విచారణ జరిపింది. ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఈ పిటిషన్‌ను వెంటనే విచారించాలని కపిల్ సిబల్ కోరగా, ధర్మాసనం నిరాకరించింది. తాను విదేశాలకు పారిపోవడంలేదని చిదంబరం అఫిడవిట్ దాఖలు చేస్తామన్నా ఒప్పుకోలేదు. దీంతో కపిల్ సిబల్ నేరుగా సీజేఐ ఉన్న కోర్టు రూమ్‌లోకి వెళ్లారు. ఆ సమయంలో సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం అయోధ్య వివాదంపై విచారణ జరుపుతుండటంతో ఆయన దృష్టికి తీసుకెళ్లలేకపోయారు. చివరగా చిదంబరం పిటిషన్‌ను శుక్రవారం విచారణ జరుపుతామని సీజేఐ సమాచారం అందించారు.

ఐఎన్‌ఎక్స్ కేసు కథాకమామిషు..

## తండ్రిచాటున కొడుకు అక్రమం!



### కార్తీ, చిదంబరంపై సీబీఐ, ఈడీ ఆరోపణలు

**ఐఎన్‌ఎక్స్** మీడియా విదేశీ అక్రమ లావాదేవీలను కప్పిపుచ్చేందుకు నాడు కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్న తన తండ్రి చిదంబరం అధికారాన్ని అడ్డుపెట్టుకుని కార్తీ చిదంబరం ఐఎన్‌ఎక్స్‌కు అనుచిత లబ్ధి చేకూర్చారని సీబీఐ, ఈడీ ఆరోపిస్తున్నాయి. ఇందుకుగాను ఐఎన్‌ఎక్స్ నుంచి కార్తీ ముడుపులు అందుకున్నారని పేర్కొంటున్నాయి. మారిషస్‌కు చెందిన మూడు కంపెనీల నుంచి రూ.4.62 కోట్ల ఎఫ్‌డీఐలు అందుకునేందుకు 2007 మార్చిలో ఐఎన్‌ఎక్స్ మీడియా సంస్థకు విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎఫ్‌పీఐబీ) అనుమతినిచ్చింది. తన అనుబంధ సంస్థ ఐఎన్‌ఎక్స్ న్యూస్ లిమిటెడ్‌లో డౌన్‌స్ట్రీమ్ ఇన్వెస్ట్‌మెంట్‌కు ఐఎన్‌ఎక్స్ చేసిన ప్రతిపాదనకు మాత్రం నిరాకరించింది. షేర్ల సబ్‌స్క్రిప్షన్, అక్విజిషన్ ద్వారా ఒక భారత కంపెనీ మరో కంపెనీలో పరోక్షంగా విదేశీ పెట్టుబడులు పెట్టడాన్ని డౌన్‌స్ట్రీమ్ ఇన్వెస్ట్‌మెంట్ అంటారు. కాగా, అనుమతినిచ్చిన రూ.4.62 కోట్ల ఎఫ్‌డీఐలకు బదులుగా ఐఎన్‌ఎక్స్ మీడియా సుమారు రూ.305 కోట్ల మేర ఎఫ్‌డీఐలను సేకరించిందని, నిబంధనలను ఉల్లంఘించి డౌన్‌స్ట్రీమ్ ఇన్వెస్ట్‌మెంట్‌కు పాల్పడిందని ఆరోపణలు వ్యక్తమయ్యాయి. దీనిపై ఫిర్యాదు అందడంతో ఆదాయం పన్ను శాఖ ఎఫ్‌పీఐబీ నుంచి స్పష్టతకోరింది. దీంతో ఐఎన్‌ఎక్స్ మీడియాను ఎఫ్‌పీఐబీ వివరణ కోరింది. ఈ అంశాన్ని ఆర్థిక శాఖతో 'సెటిల్' చేసుకునేందుకు ఐఎన్‌ఎక్స్ మీడియా నాటి కేంద్ర ఆర్థిక మంత్రి చిదంబరం కుమారుడు, కార్తీని రంగంలోకి దింపింది. తన తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని కార్తీ ఐఎన్‌ఎక్స్‌కు అనుచిత లబ్ధి చేకూర్చారని సీబీఐ పేర్కొంది. ఈ కేసుపై విచారణకు ఆదేశించడానికి బదులు.. అప్పటికే పొందిన/లభించిన ఎఫ్‌డీఐలు, డౌన్‌స్ట్రీమ్ ఇన్వెస్ట్‌మెంట్‌కు అనుమతి కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఐఎన్‌ఎక్స్‌కు ఎఫ్‌పీఐబీ సూచించిందని తెలిపింది. ఇంద్రాణీ ఈ కేసులో అప్రూవర్‌గా మారారు. ఎఫ్‌ఐపీబీ క్లియరెన్స్ కోసం 2008లో తాను చిదంబరాన్ని కలిశాక ఐఎన్‌ఎక్స్‌కు అనుకూలంగా నిర్ణయం వెలువడిందని ఆమె సీబీఐకి తెలిపారు. దీంతో ఇందులో కీలక సూత్రధారిగా చిదంబరం ఉన్నారని సీబీఐ పేర్కొంటున్నది.

### గోడదూకి వెళ్లిన అధికారులు



చిదంబరం ఇంటిలోకి ప్రవేశించేందుకు గోడ దూకుతున్న అధికారులు

**కపిల్** సిబల్, అభిషేక్ సింఘ్వీతో కలిసి చిదంబరం తన నివాసానికి వెళ్లిన కాసేపటికే సీబీఐ అధికారులు, ఢిల్లీ పోలీసులు చేరుకున్నారు. చిదంబరం వ్యక్తిగత సిబ్బంది వారిని అడ్డుకున్నారు. గేటు తీయాలని ఎన్నిసార్లు కోరినా తీయలేదు. దీంతో ముగ్గురు సీబీఐ అధికారులు దాదాపు ఐదున్నర అడుగుల ఎత్తున్న గోడమీది నుంచి చిదంబరం ఇంట్లోకి దూకారు. తర్వాత గేటు తెరిచి మిగతా అధికారులను, తమ కారును లోనికి తీసుకెళ్లారు. కొద్దిసేపటికి ఈడీ అధికారులు అక్కడికి చేరుకున్నారు. మొత్తంగా దాదాపు డజను మంది అధికారులు ఇంటిలోకి వెళ్లారు. ఇదే సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున చిదంబరం నివాసానికి చేరుకొన్నారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరికొద్ది సేపటి తర్వాత బీజేపీ కార్యకర్తలు అక్కడికి చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. చివరికి సీబీఐ, ఈడీ అధికారులు చిదంబరంను అరెస్ట్ చేశారు. సీబీఐ కేంద్ర కార్యాలయానికి తరలించారు.

## ఎస్సీ ఫెలోషిప్ లబ్ధిదారులు రెట్టింపు!

- 2 వేల నుంచి 4 వేలకు పెంచేందుకు కేంద్రం యోచన
- ఎంపిక విధానంలోనూ మార్పులు
- యూజీసీ నెట్ ర్యాంకింగే ఎంపికకు ప్రామాణికత

**న్యూఢిల్లీ:** ఉన్నత విద్య కోసం ఎస్సీ విద్యార్థులకు అందజేస్తున్న జాతీయ ఫెలోషిప్ ద్వారా లబ్ధి పొందుతున్న వారి సంఖ్యను 2 వేల నుంచి 4 వేలకు పెంచనున్నట్లు కేంద్ర సామాజిక, సాధికారిక మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. ఫెలోషిప్ ఎంపిక విధానాన్నీ మార్చనున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్‌ఎఫ్) అభ్యర్థులను నెట్ పరీక్ష ద్వారా యూజీసీ ఏడాదికి రెండు విడుతలుగా ఎంపిక చేస్తున్నది. ఇంతకుముందు సామాజిక మంత్రిత్వ శాఖ కమిటీ ఈ అభ్యర్థులను ఎంపిక చేసేది. దీన్ని ప్రతిభ ఆధారిత విధానంగా మార్చినట్లు విశ్వసనీయ వర్గా లు తెలిపాయి. 2005లో నాటి కేంద్రం రాజీవ్ గాంధీ నేషనల్ ఫెలోషిప్ పేరిట ఈ పథకం ప్రారంభించింది. 'ఈ పథకంలో చేపట్టిన ప్రతిపాదిత మార్పుల వల్ల ప్రభుత్వంపై రూ.3000 కోట్ల భారం పడనుంది. దీనికి క్యాబినెట్ ఆమోదం కావాలి. అంతకంటే ముందు ఆయా శాఖల అనుమతి అవసరం' అని అధికార వర్గాలు తెలిపాయి. దీని కింద ఫెలోషిప్ పొందే వారి సంఖ్యను 5,000కు పెంచాలని సామాజిక న్యాయశాఖ మంత్రి తావర్‌చంద్ గెహ్లాట్ పట్టుబట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి. 'ప్రతిపాదిత మార్పులతో భారీగా వ్యయం పెరుగనుంది. ఇంతకుముందు, ఖజానాపై రూ. 300-రూ.400 కోట్ల భారం పడేది. దీన్ని 4 రెట్లు పెంచడం అంటే.. ఆర్థిక శాఖ ప్రశ్నలు లేవనెత్తుతుంది. మంత్రి స్వయంగా కల్పించుకుంటున్నందున దీనికి ఆమోదం లభించవచ్చు' అని ఆ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది జనవరి నుంచి జేఆర్‌ఎఫ్ ఫెలోషిప్ అలవెన్స్‌ను నెలకు రూ.25వేల నుం చి రూ.31,000కు పెంచినా పెంచిన మొత్తం ఇప్పటికీ విద్యార్థులకు అందట్లేదు. వచ్చే నెల నుంచి విద్యార్థులకు పెంచిన మొత్తం అందుతుందని యూజీసీ వర్గాలు తెలిపాయి. ఈ పథకాన్ని ర్యాంక్ ఆధారిత పథకంగా మార్చడం వల్ల అసలు లక్ష్యం నీరుగారే ప్రమాదం ఉందని విశ్లేషకులు అంటున్నారు.

## మరో 4 ఒప్పందాల్లో అక్రమాలు

- చిదంబరంపై ఈడీ విచారణ విస్తృతం

**న్యూఢిల్లీ:** కేంద్ర మాజీ మంత్రి పీ చిదంబరంపై ఈడీ విచారణను విస్తృతం చేసింది. ఐఎన్‌ఎక్స్ మీడియా, ఎయిర్‌సెల్ మ్యాక్సిస్ ఒప్పందాలతోపాటు మరో నాలుగు వ్యాపార ఒప్పందాల్లో ఎఫ్‌ఐపీబీ అనుమతుల విషయంలో చిదంబరం పాత్ర ఉన్నదని ఈడీ అనుమానిస్తున్నది. అలాగే డొల్ల కంపెనీల ద్వారా ఆయన రూ.కోట్ల ముడుపులు పొందినట్లు భావిస్తున్నది. అక్రమ ఎఫ్‌డీఐ అనుమతులు, ఎఫ్‌ఐపీబీ క్లియరెన్స్‌కు ప్రతిఫలంగా తీసుకున్న ముడుపులను చిదంబరం, ఆయన కుమారుడు కార్తీ, ఒక డొల్ల కంపెనీలో రూ.300 కోట్ల మేర డిపాజిట్ చేసినట్లు ఈడీ గుర్తించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తండ్రీకొడుకును కస్టోడియల్ విచారణకు అనుమతించాలని కోర్టును ఈడీ అభ్యర్థించనట్లు అధికార వర్గాలు తెలిపాయి. డియాజియో స్కాట్లాండ్ లిమిటెడ్, కటారా హోల్డింగ్స్, ఎస్సార్ స్టీల్ లిమిటెడ్, ఎల్‌పోర్జ్ లిమిటెడ్ కంపెనీలకు సంబంధించిన ఎఫ్‌ఐపీబీ అనుమతుల్లోనూ చిదంబరం పాత్రపై ఈడీ దృష్టిసారించినట్లు పేర్కొన్నాయి.

**ఇది కక్షసాధింపే: కార్తి చిదంబరం**

తన తండ్రి అరెస్ట్ అక్రమమని, ఇది రాజకీయంగా కక్షసాధింపు చర్య అని చిదంబరం కుమారుడు, కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం ఆరోపించారు. చెన్నైలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కొందరు నేతల ఒత్తిడి మేరకు వారిని సంతృప్తి పరుచడానికే దర్యాప్తు సంస్థలు ఇలా చేస్తున్నాయని విమర్శించారు. '2008లో జరిగిన పరిణామాలపై 2017లో కేసు నమోదు చేశారు. రెండేండ్లు గడుస్తున్నా ఎలాంటి చార్జిషీట్ దాఖలు చేయలేదు. దీని అర్థం.. ఎలాంటి అక్రమం జరుగలేదు' అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇతర విషయాల నుంచి దేశం దృష్టిని మళ్లించేందుకే ఈ నాటకం ఆడుతున్నదని ఆరోపించారు.

## అధికార దుర్వినియోగం

- చిదంబరం వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్నారు
- మోదీ సర్కారుపై రాహుల్ గాంధీ ధ్వజం



**న్యూఢిల్లీ:** ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ నేత చిదంబరానికి ఆ పార్టీ నేతలు బాసటగా నిలిచారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ బుధవారం ట్విట్టర్ ద్వారా స్పందిస్తూ.. 'ఈడీ, సీబీఐతో పాటు వెన్నెముకలేని పలు మీడియా సంస్థలను వినియోగించుకుని మోదీ సర్కారు చిదంబరం వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నది. ఈ విధంగా అధికార దుర్వినియోగానికి పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా' అని పేర్కొన్నారు. రాహుల్ సోదరి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ స్పందిస్తూ.. 'అత్యంత గౌరవనీయులైన రాజ్యసభ సభ్యులు పీ చిదంబరం. దశాబ్దాలపాటు దేశానికి సేవలందించారు. ఆయన నిజాలను నిర్భయంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నారు. అయితే ఈ నిజాలు పిరికిపందలకు రుచించడం లేదు. అందుకే నిస్సిగ్గుగా ఆయన వెంటపడుతున్నారు. ఆయనకు మేం అండగా నిలబడతాం. ఎలాంటి పరిణామాలు ఎదురైనా సత్యం కోసం పోరాడుతాం' అని పేర్కొన్నారు.

**పర్యవసానాలను ఎదుర్కోవాల్సిందే: బీజేపీ**

చిదంబరంపై కేంద్ర ప్రభుత్వం ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతున్నదని కాంగ్రెస్‌పార్టీ చేసిన ఆరోపణలను బీజేపీ ఖండించింది. విచారణలో కేంద్ర ప్రభుత్వ ప్రమేయం ఏమీ లేదని, తన చర్యల పర్యవసానాలను చిదంబరం ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేసింది.

## డాక్టర్లు గ్రామాల్లో సేవ చేయాల్సిందే

మొదటిపేజీ తరువాయి...

సరికాదని, ఇది వ్యక్తిగత హక్కుల ఉల్లంఘనేనని పిటిషన్‌లో పేర్కొంది. తమ కెరీర్‌ను అడ్డుకోవడమేకాక నిర్బంధంగా పనిచేయించడంలా ఉన్నదని తెలిపింది. దీంతో స్పందించిన జస్టిస్‌లు ఎల్ నాగేశ్వర రావు, హేమంత్ గుప్తాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం వీరి పిటిషన్‌ను తోసిపుచ్చింది. తాము కోర్సు పూర్తయ్యాక గ్రామీణ ప్రాంతాల్లో కొంతకాలం విధులు నిర్వర్తిస్తామని వైద్య విద్యార్థులు బాండ్లు సమర్పించాలన్న నిబంధన అక్రమం కాదని, ఏకపక్షం కూడా కాదని ధర్మాసనం పేర్కొంది. ఈ విధానంతో స్పెషాలిటీ వైద్య సేవలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించే అవకాశముందన్నది. ప్రస్తుతం కొన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్న బాండ్ల విధానం ఒకే విధంగా లేదని, కొన్ని చోట్ల రెండేండ్లు, మరి కొన్ని చోట్ల ఐదేండ్లు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయాలని, లేకుంటే దాదాపు రూ.50 లక్షల వరకు జరిమానా చెల్లించాలంటూ నిబంధనలను అమలు చేస్తున్నాయని పేర్కొంది. ఇలా ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం సొంతంగా నిబంధనను విధించుకోవడం సరికాదని, చదువు పూర్తయిన వైద్య విద్యార్థి రెండేండ్లు గ్రామీణ ప్రాంతంలో పనిచేయాలని, లేకుంటే రూ.20 లక్షలు జరిమానా చెల్లించాలని కోర్టు సూచించింది. 'కేంద్రానికి, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు మేం సూచించేది ఒక్కటే. పలు రాష్ర్టాలు పలు రకాల నిబంధనలను అమలు చేయడం సరికాదు. దేశమంతటా ఒకే విధానం ఉండేలా విధి విధానాలు రూపొందించాలి' అని ధర్మాసనం పేర్కొంది. ప్రాథమిక వైద్యాన్ని పొందలేకపోతున్న వారి హక్కులను కాపాడటానికే తాము ఏకరూప విధానం ఉండాలని ఆదేశిస్తున్నామని వివరించింది. కాగా, పీజీ వైద్య విద్యార్థులు, స్పెషాలిటీ కోర్సులు చదివే విద్యార్థులు ప్రవేశాల సందర్భంగా కోర్సు పూర్తికాగానే కొంతకాలంపాటు గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తామని బాండ్‌ను సమర్పించే విధానం ఇప్పటికే కొన్ని రాష్ర్టాల్లో అమలవుతున్నది. ఈ విధానం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గోవా, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో అమల్లో ఉంది.

## ఆర్మీలో సంస్కరణలకు రాజ్‌నాథ్ ఆమోదం

- ప్రధాన కార్యాలయంలో 206 మంది అధికారులకు స్థానచలనం



**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** సైన్యంలో సంస్కరణలు చేపట్టేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బుధవారం ఆమోదం తెలిపారు. ఢిల్లీలోని ఆర్మీ ప్రధాన కార్యాలయంలోని 206 మంది అధికారుల బదిలీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. మానవ హక్కుల ఉల్లంఘనలపై దృష్టిసారించేందుకు ప్రత్యేక విజిలెన్స్ సెల్ ఏర్పాటుకు అంగీకారం తెలిపారు. 13 లక్షల మందితో కూడిన సైన్యాన్ని మరింత బలోపేతం చేయడం, యుద్ధ సామర్థ్యాల మెరుగు, ఖర్చుల నియంత్రణ వంటి అంశాలపై గత ఏడాది 12 స్వతంత్ర సంస్థలు అధ్యయనం చేశాయి. ఆ సంస్థలు సూచించిన సంస్కరణలను ఆర్మీ ఉన్నతాధికారులు గతేడాది అక్టోబర్‌లో ఖరారు చేశారు. ఈ నేపథ్యంలో ఆర్మీ హెడ్డాఫీసులో కొన్ని పునర్వ్యవస్థీకరణ నిర్ణయాలకు రాజ్‌నాథ్ బుధవారం ఆమోదం తెలిపారు. ఇందు లో భాగంగా ప్రధాన కార్యాలయంలోని 206 మంది అధికారులకు వేర్వేరు యూనిట్లు, క్షేత్రస్థాయి శిబిరాలకు స్థానచలనం కల్పించామని రక్షణశాఖ తెలిపింది. ఇందులో ముగ్గురు మేజర్ జనరల్స్, 8 మంది బ్రిగేడియర్స్, 9 మం ది కల్నల్స్, 186 మంది కల్నల్/ మేజర్ ర్యాంకు అధికారులున్నట్లు తెలిపింది. ఇప్పటి వరకు బహుళ ఏజెన్సీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజిలెన్స్ విభాగం స్థానంలో ఆర్మీ చీఫ్ నేతృత్వంలో త్రివిధ దళాల ప్రతినిధులతో కూడిన ప్రత్యేక నిఘా విభాగం ఏర్పాటుకు నిర్ణయించినట్లు చెప్పింది.



### జాబిల్లికి మరింత చేరువగా చంద్రయాన్-2

**బెంగళూరు:** చంద్రుడి రెండో కక్ష్యలోకి చంద్రయాన్-2 విజయవంతంగా ప్రవేశించినట్లు ఇస్రో తెలిపింది. దీనికోసం బుధవారం మధ్యాహ్నం 12.50 గంటలకు చేపట్టిన కక్ష్య తగ్గింపు ప్రక్రియ 20.44 నిమిషాలు సాగడంతో 118 కి.మీ X 4,412 కి.మీ కక్ష్యకు చంద్రయాన్-2 చేరగా, అందులోని పరికరాలు ప్రమాణాల మేరకు పని చేస్తున్నట్లు ఇస్రో తెలిపింది. ఈ నెల 28న తదుపరి ప్రక్రియ చేపడతామన్నది. వచ్చే మంగళవారం ఉదయం 5.30-6.30 గంటల మధ్య చేపట్టే చర్యలతో చంద్రుడి తొలి కక్ష్యలోకి చంద్రయాన్-2 చేరుతుందన్నది. సెప్టెంబర్ 7న వేకువ జామున 1.55 గంటలకు చంద్రుడి ఉపరితలంపై విక్రమ్ ల్యాండర్‌ను దించే ప్రక్రియ అత్యంత ఉత్కంఠతో కూడుకున్నదని ఇస్రో తెలిపింది.

## పాత యుద్ధ విమానాలే వాడుతున్నాం

- 40 ఏండ్ల కిందట కొన్న కార్లనే ఎవరూ నడుపడంలేదు
- ఐఏఎఫ్ అధిపతి ధనోవా



**న్యూఢిల్లీ:** నాలుగు దశాబ్దాల కింద కొనుగోలు చేసిన పాత కార్లను ప్రస్తుతం ఎవరూ నడుపడంలేదని కానీ, మన దేశం మాత్రం ఇప్పటికీ 44 ఏండ్ల నాటి మిగ్-21 యుద్ధవిమానాన్నే ఉపయోగిస్తున్నదని భారత వైమానిక దళం (ఐఏఎఫ్) అధిపతి బీఎస్ ధనోవా అన్నారు. మంగళవారం ఢిల్లీలో 'ఆధునీకరణ, స్వదేశీ ప్రణాళికలు' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. రష్యాకు చెందిన మిగ్-21 యుద్ధ విమానాలను డిసెంబర్‌నాటికి దశలవారీగా తొలిగిస్తామన్నారు. 'కనుమరుగవుతున్న ఆయుధాలనూ వినియోగిస్తున్నామంటే అది హాల్ (హిందుస్థాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్), బీఆర్డీ (బేస్ రిపేర్ డిపో) నిర్వహణతోనే సాధ్యమవుతున్నది. వీటి మరమ్మతుల కోసం 95 శాతం పరికరాలు దేశంలోనే తయారవుతున్నాయి. రష్యానే మిగ్‌ను వినియోగించకున్నా.. మరమ్మతు పరికరాలను మనం తయారు చేసుకోగలుగుతుండటంతో వాటిని ఇంకా వినియోగిస్తున్నాం' అని చెప్పారు. విదేశీ పరిజ్ఞానంపై ఆధారపడటం తగ్గించుకుని స్వదేశీ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో ఆయుధాల తయారీ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఈ సదస్సులో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా పాల్గొన్నారు.

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు
ధర్మగంట
నమస్తే తెలంగాణ, 8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.
Whatsapp No. 9346979997
dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.
స్థానిక నమస్తే తెలంగాణ
కార్యాలయంలో వివరాలు అందించండి.
/NTDAILYONLINE

## గిరిజన రైతులకు అందిన ప్రొసీడింగ్స్

- 'లావుణీ పట్టాలు లాక్కున్నారు' కథనానికి స్పందన
- త్వరలోనే పాస్‌పుస్తకాలు అందజేస్తామన్న నవాబ్‌పేట తాసిల్దార్


రైతులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న తాసిల్దార్

**నవాబ్‌పేట:** 'లావుణీ పట్టాలు లాక్కున్నారు' శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో జూలై 31న ప్రచురితమైన కథనానికి మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం రెవెన్యూ అధికారులు స్పందించారు. విచారణ చేసిన అధికారులు బుధవారం భూబాధిత గిరిజన రైతులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. నవాబ్‌పేట మండలం తీగల్‌పల్లి పరిధిలోని కొత్త చెల్కతండాలోని సర్వే నంబర్ 135లో 30 ఎకరాలు భూమిని ప్రభుత్వం గతంలో గిరిజనులకు పంపిణీ చేసింది. గతంలో చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళనలో రెవెన్యూ అధికారులు సర్వేల పేరుతో ఉన్న పట్టాలను రద్దుచేశారు. దీనిపై కథనం ప్రచురితమవడంతో స్పందించిన రెవెన్యూ అధికారులు ఈ భూమిలో సర్వే నిర్వహించారు. బుధవారం తాసిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో తాసిల్దార్ రాజునాయక్ 12.20 ఎకరాల భూమికి సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను రైతులు నర్సింగ్‌నాయక్, తుక్యారామ్‌నాయక్, రుక్కాలి, సక్రి, లాలికి అందజేశారు. త్వరలోనే ఆన్‌లైన్‌చేసి పాస్‌పుస్తకాలు అందిస్తామని తాసిల్దార్ తెలిపారు. భూసమస్యను వెలుగులోకి తెచ్చి ప్రొసీడింగ్స్ వచ్చేలా కృషిచేసిన 'నమస్తే తెలంగాణ'కు రైతులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తీగల్‌పల్లి సర్పంచ్ జంగయ్య, ఎంపీటీసీ సభ్యుడు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పైసల్ తీసుకొని పాలోళ్లకు పట్టా!

- సాగులో ఒకరు.. పట్టాలో మరొకరు
- రూ.4 కోట్లు విలువైన భూమి దాయాదులకు కట్టబెట్టిన
- మంచిర్యాల జిల్లా నస్పూరు రెవెన్యూ అధికారులు
- న్యాయం కోసం పోరాడుతున్న బాధిత వృద్ధురాలు

**మంచిర్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** మంచిర్యాల జిల్లా నస్పూరు మండలం సీతారాంపల్లి శివారులో రాంటెంకి దుర్గయ్య కుమారుడు చిన్న లింగయ్య(బాపు) పేరిట సర్వే నంబర్లు 15/4లో 0.18 గుంటలు, 20/3లో 1.39 గుంటలు, 21/3లో 1.28 గుంటలు.. మొత్తం 4.05 ఎకరాల భూమి ఉన్నది. దీనిని 1977లో కటికవేని లక్ష్మణ్‌రావు వద్ద కొన్నారు. చిన్న లింగయ్య పేరిట అప్పుడు అధికారులు రికార్డుచేశారు. దాదాపు 30 ఏండ్ల కిందట చిన్న లింగయ్య చనిపోయారు. ఆ భూమిని చిన్న లింగయ్య భార్య లింగమ్మ సాగు చేసుకొంటున్నారు. ఆమె 30 ఏండ్లుగా దానిని కౌలుకు ఇవ్వడమో, లేక మనుమడితో సాగుచేయించుకోవడమో చేస్తున్నారు. ఈ క్రమంలో చిన్న లింగయ్యకు వరుసకు అన్న అయిన భూమయ్య కొడుకు కన్ను ఆ భూమిపై పడింది. భూమయ్య కొడుకు రాంటెంకి కార్తీక్ రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఆ భూమిని తన పేరిట పట్టా చేయించుకొన్నాడు. కార్తీక్ తాత పేరు కూడా లింగయ్య కావడంతో ఆ ఆస్తి తనదేనని పట్టాచేయించుకోవడం గమనార్హం. అప్పటి వీఆర్వో ప్రసన్నకుమార్ ఈ భూమి కార్తీక్ పేరిట చేయించారు. ఈ విషయంలో దాదాపు రూ.5 లక్షలు చేతులు మారినట్టు బాధితురాలు ఆరోపిస్తున్నారు. తమ భూమి కోసం ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని బాధితురాలు లింగమ్మ ఆవేదన వ్యక్తంచేశారు. వీఆర్వో దగ్గరికి వెళ్తే, తాసిల్దార్ వద్దకు.. అక్కడికి వెళ్తే ఆర్డీవో దగ్గరికి ఇలా తిప్పించుకొంటున్నారని వాపోయారు.

### తప్పు ఒప్పుకుని.. పట్టా మార్పిడి

భూమి విషయంలో ఎన్నోసార్లు గొడవలు జరిగాయి. బాధితురాలు లింగమ్మ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు గ్రామానికి వచ్చి గ్రామస్థుల సమక్షంలో విచారించారు. గ్రామస్థులు ముక్తకంఠంతో ఆ భూమి చిన్న లింగయ్యదేనని స్పష్టంచేశారు. వృద్ధురాలైన లింగమ్మను ఇబ్బందులకు గురిచేస్తున్న కార్తీక్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసుల ఎదుట తప్పు ఒప్పుకొన్న కార్తీక్ తాను తప్పుడు పత్రాలు సృష్టించి భూమి తన పేరిట చేయించుకున్నాని గ్రామస్థుల సమక్షంలో చెప్పారు. ఆ సమయంలో లిఖితపూర్వకంగా రాసిచ్చాడు కూడా. అయినా రెవెన్యూ అధికారులు మాత్రం రికార్డులను సరిదిద్దేందుకు ముందుకురావడం లేదు.

### ఏండ్లుగా పోరాటంచేస్తున్నాను



భూమి పట్టామార్చిన వీఆర్వో ప్రసన్నకుమార్‌పై గ్రామస్థులు మూకుమ్మడిగా ఫిర్యాదుచేయడంతో అప్పటి కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అతడిని బదిలీచేశారు. నా భూమి కోసం ఏండ్లుగా పోరాటంచేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. లంచాల రుచిమరిగిన కొందరు రెవెన్యూ అధికారులు న్యాయం చేయడంలేదు. ఇప్పటికీ నేనే సాగులో ఉన్నప్పటికీ నా పేరిట రికార్డులు లేవు. భూమి నా పేరిట పట్టాచేసి పాస్‌పుస్తకం ఇచ్చి న్యాయంచేయాలి. సీఎం కేసీఆర్ రైతుల పక్షాన నిలబడి రైతుబంధు పథకం అందిస్తున్నా.. నాలాంటి వాళ్లకు అందడం లేదు.

-రాంటెంకి లింగమ్మ, బాధిత వృద్ధురాలు

# అసైన్‌మెంట్ పేర అక్రమదందా

- నాలుగెకరాలకు నలభైవేలు
- పాస్‌పుస్తకాలకు ఫిక్స్‌డ్ రేటు
- మైనర్ పేరిట కూడా భూ పట్టా
- జయశంకర్‌జిల్లా పెగడపల్లిలో.. రెవెన్యూ బడా వ్యాపారం

అక్రమ దందాలో రెవెన్యూ అధికారులను మించిన వారు లేరని మరోసారి రుజువైంది. రైతు సంక్షేమం కోసం, వ్యవసాయ వృద్ధికోసం ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు అడ్డగోలుగా దోచేయడంకోసం సూపర్ ఫార్ములా కనుక్కొన్నారు. ప్రభుత్వ భూముల్ని ఇష్టం వచ్చినట్లుగా అమ్మేసుకొంటున్నారు. జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని పెగడపల్లిలో ఒక సర్వే నంబర్‌లో ఉన్న 1509 ఎకరాల ప్రభుత్వభూమికి రెవెన్యూ అధికారులు అక్రమంగా పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీచేశారు. ఒక్కో పాస్‌పుస్తకానికి రేటు ఫిక్స్‌చేసి మరీ దందా నడిపించారు. వన్ బీ ప్రతులను కూడా ఇచ్చేశారు. కోట్ల రూపాయల మేర రైతుబంధు, రుణమాఫీ వర్తించేందుకు దోహదపడ్డారు.

### 1509 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం


పెగడపల్లిలోని ప్రభుత్వ భూమి.. సర్వే నంబర్, ఖాతా నంబర్ ఒకటే వేసి అధికారులు ఇచ్చిన 1-బీ ప్రతి

**జయశంకర్ జిల్లా ప్రతినిధి-నమస్తే తెలంగాణ:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం పెగడపల్లిలోని 108 సర్వే నంబర్‌లో 1509 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. ఇందులో సుమారు 25 శాతం భూమిని అక్కడ సాగుచేసుకొంటున్న రైతులకు ఒక్కో ఎకరం కింద ప్రభుత్వం 2014లో అసైన్‌చేసింది. ఇందుకు సంబంధించిన పాస్‌పుస్తకాలను కూడా అందించింది. కొన్నాళ్ల తర్వాత అసైనీల నుంచి డబ్బులు గుంజడానికి రెవెన్యూ అధికారులు పథకంవేశారు. ఒక్కొక్కరికీ అదనంగా ఐదెకరాలు ఇస్తామంటూ.. ఎకరానికి రూ.రెండు వేల చొప్పున రూ.పదివేలను వసూలుచేసి వాళ్ల పాస్‌పుస్తకాల్లో ఒక ఎకరం ఉన్న చోట ఆరుగా దిద్ది ఇచ్చేశారు. పాస్‌పుస్తకాల్లో మాత్రమే అంకె మారింది తప్ప.. ఆన్‌లైన్ రికార్డుల్లో మారలేదు. ఈ వ్యవహారంతో భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో ఈ అసైనీలకు న్యాయపరమైన చిక్కులు వచ్చిపడ్డాయి. అసైన్‌మెంట్ చట్టం ప్రకారం ఏ ఒక్క రైతుకైనా ఐదెకరాలకు మించి భూమి కేటాయించడానికి వీలు లేదు. కానీ వారి దగ్గరున్న పాత పాస్‌పుస్తకాల్లో ఆరెకరాలని రాసి ఉండటం వల్ల ఏ ఒక్కరికీ కొత్త పాస్‌పుస్తకాలు రాకుండా ఆగిపోయాయి. ముందుగా ఇచ్చినట్లు ఒక ఎకరానికి పాస్‌పుస్తకమిస్తామని ఒకసారి.. ఐదెకరాలకు ఇస్తామని మరోసారి రెవెన్యూ అధికారులు చెప్పడంతో రైతులు తీవ్ర అభ్యంతరపెట్టారు. దీంతో వారంతా ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. ఇదేసమయంలో ఇదే 108 సర్వే నంబర్‌లోని మొత్తం 1509 ఎకరాల ప్రభుత్వ భూమిపై కన్నేసిన అక్రమార్కులు రంగంలోకి దిగారు. రెవెన్యూ అధికారులతో కుమ్మక్కయ్యారు. ఇంకేం రెవెన్యూ సిబ్బంది బేరం మొదలుపెట్టారు. అసైన్‌మెంట్ చట్టం ప్రకారం పరిమితి దాటకుండా ఒక్కొక్కరికి నాలుగెకరాల చొప్పున భూ పంపిణీచేశారు. ఒక్కో పాస్‌పుస్తకంలో నాలుగెకరాలు.. ఆ నాలుగెకరాలకు రూ.నలభై వేల చొప్పున రేటు ఫిక్స్‌చేశారు. రైతుబంధు పథకం ఎకరానికి రూ.పది వేల చొప్పున నాలుగెకరాలకు రూ.40వేలు అవుతుంది కాబట్టి ఒక విడుత వదిలేసుకొంటే.. శాశ్వతంగా ఆ పథకం అందుకోవచ్చు. దీంతోపాటు లక్ష రూపాయల బ్యాంకు రుణం తీసుకొని మాఫీ పొందవచ్చు. ఈ విధంగా లెక్కలు కట్టుకొని అధికారులకు పెద్ద ఎత్తున డబ్బులు ముట్టజెప్పి అక్రమార్కులు పాస్‌పుస్తకాలను ఫలహారంలా పంపిణీచేయించారు. డిజిటల్ సంతకాలు, వన్ బీ పత్రాలతో పక్కాగా కాగితాలు అందించారు. మహాముత్తారం మండలంలోని ప్రేమ్‌నగర్, మీనాజిపేట, బోర్లగూడెం, గండికామారంతో పాటు పక్కనే ఉన్న భూపాలపల్లి మండలంలోని ఆజాంనగర్, గొల్ల బుద్దారం, గుర్రంపేట గ్రామాలు మల్హర్ మండలంలోని తాడిచర్లతో పాటు, పెద్దపల్లి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన అనేకమందికి ఈ 108 సర్వేనంబర్ భూమిలో నాలుగెకరాల చొప్పున పంపిణీచేశారు. వీళ్ల దందా ఎక్కడిదాకా సాగిందంటే.. సర్వే నంబర్‌లో ఉన్న భూమి 1,509 ఎకరాలైతే.. ఇచ్చిన పాస్‌పుస్తకాల్లో పంపిణీచేసిన భూమి 1,755 ఎకరాలు. విచిత్రమేమంటే ఒక్కో కుటుంబంలో ఒకరు కాకుండా ఎందరుంటే అందరికి విచ్చలవిడిగా ఇచ్చేశారు. చివరకు నిబంధనలతో నిమిత్తం లేకుండా 18 ఏండ్ల కంటే తక్కువ వయసున్న మైనర్లకూ భూములు కట్టబెట్టారు. ఆజాంనగర్ గ్రామానికి చెందిన ఓ పదిహేనేండ్ల పిల్లవాడికి 8.10 ఎకరాల భూమి మంజూరైంది.. ఈ పిల్లవాడి తల్లిదండ్రులకూ ఇదే సర్వేనంబర్‌లో భూమిని ఇచ్చారు. అంటే రెవెన్యూ అధికారులు ఏస్థాయిలో రెచ్చిపోయారో అర్థంచేసుకోవచ్చు. అయితే సర్వేనంబర్‌లో ఉన్న విస్తీర్ణం కంటే ఎక్కువ భూమికి పాస్‌పుస్తకాలిచ్చినట్లు తెలుసుకున్న అధికారులు నాలిక కరుచుకొని అదనంగా ఇచ్చిన 245 ఎకరాల మేర పాస్‌పుస్తకాలను రద్దుచేశారు. ఈ మొత్తం వ్యవహారంలో అసలైన అసైనీలకు కొత్త పాస్‌పుస్తకాలు రాక.. ప్రభుత్వ పథకాలు అందక నానా తిప్పలు పడుతుంటే.. అడ్డగోలుగా పాస్‌పుస్తకాలు సంపాదించిన వాళ్లు మాత్రం చక్కగా ప్రభుత్వ పథకాల నుంచి లబ్ధి పొందుతున్నారు.

### 1,509 ఎకరాలు అసైన్ చేశాం

పెగడపల్లిలోని 108 సర్వే నంబర్‌లో ఉన్న 1,509 ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు అసైన్‌చేశాం. అసైన్డ్ రైతులందరికీ పాస్‌పుస్తకాలు అందజేశాం. అదనంగా పాస్‌బుక్కులు అందాయనే సమాచారంతో ఇటీవల 245 ఎకరాలకు సంబంధించి పాస్‌పుస్తకాలను డిలీట్‌చేశాం. 108 సర్వే నంబర్‌లోని మొత్తం 1,509 ఎకరాల భూమి సాగులో ఉంది. ఇక్కడ అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులువస్తే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

-మల్లేశం, తాసిల్దార్, మహాముత్తారం

# పరిష్కారమవుతున్న భూసమస్యలు

- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 33 గ్రామాల్లో పూర్తి
- మరో మూడురోజులు కొనసాగనున్న భూపరిష్కార వేదిక


భూపాలపల్లి మండలం గుడాడ్‌పల్లిలో రైతుకు పాస్‌పుస్తకం ప్రతిని అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తదితరులు

**భూపాలపల్లి టౌన్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఈ నెల 19న ప్రారంభమైన 'భూపరిష్కార వేదిక- రైతుల చెంతకే రెవెన్యూ సిబ్బంది' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నది. రెవెన్యూ సిబ్బంది, అధికారులు గ్రామాల్లోకి వెళ్లి రైతుల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషిచేస్తున్నారు. బుధవారం 11 మండలాల్లోని 11 గ్రామాల్లో భూపరిష్కార వేదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా మండలాల్లో తాసిల్దార్లు, జెడ్పీటీసీలు సభ్యులు, ఎంపీపీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని రైతుల సమస్యలు పరిష్కరిస్తూ పట్టాదారు పాస్‌పుస్తకాలు, 1- బీ ప్రతులను అందజేశారు. గణపురం మండలం చెల్పూర్, చిట్యాల మండలం దూత్‌పల్లి, భూపాలపల్లి మండలం గుడాడ్‌పల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ కల్లెపు శోభ రఘుపతిరావు పాల్గొన్నారు. రేగొండ మండలం కోటంచలో జాయింట్ కలెక్టర్ స్వర్ణలత పాల్గొని పాస్‌పుస్తకాలు అందజేశారు. పలుచోట్ల ఆర్డీవో వెంకటాచారి కూడా పాల్గొన్నారు. జిల్లాలోని 11 మండలాల్లో మూడురోజుల్లో 33 గ్రామాల్లో ఈ కార్యక్రమాలు పూర్తయ్యాయి.

## కాస్తులో ఉన్నాం.. పట్టాలు ఇవ్వండి

- కోదాడ తాసిల్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా



**కోదాడ రూరల్:** తాము 17 ఏండ్లుగా సాగుచేసుకొంటున్నా భూములకు పట్టాలుచేయడం లేదని కొందరు రైతులు సూర్యాపేట జిల్లా కోదాడ తాసిల్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. మండలంలోని కాపుగల్లుకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల్లోని పేద రైతులం ప్రభుత్వ భూమి ఉన్న సర్వే నంబర్లు 101,113, 289, 292, 332, 420 లలోని 70 ఎకరాలను సాగుచేసుకొంటున్నామని తెలిపారు. ఈ భూములపై 106 కుటుంబాలు ఆధారపడి ఉన్నారని, రెవెన్యూ రికార్డుల్లో కూడా నమోదై రుణాలను పొందామని బాధితులు పేర్కొన్నారు. ఈ భూములకు సంబంధించి పట్టాలు ఇప్పించాలని కోరారు. ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని, దీంతో రైతుబంధు, రైతుబీమా పథకాలు పొందలేకపోతున్నామని వాపోయారు. అనంతరం తాసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌కు కూడా వినతిపత్రం అందజేసినట్టు రైతులు తెలిపారు.

### పాస్‌బుక్‌లో ఎకరం తగ్గింది



**హన్వాడ:** 'నా భూమిని సరిచేయండి సార్. రెండేండ్ల నుంచి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోతున్నా. రెండుసార్లు కలెక్టర్‌కు, ఎన్నోసార్లు ఆర్డీవోకు ఫిర్యాదుచేసినా ఫలితం లేదు' అని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన శివయ్య ఆవేదన వ్యక్తంచేశారు. హన్వాడ మండలం టంకర శివారులోని సర్వేనంబర్ 36లో 3.14 ఎకరాల భూమిని సాగుచేసుకొంటు న్నారు. పాత పాస్‌బుక్, 1బీలో కూడా 3.14 ఎకరాల భూమి ఉన్నది. కొత్త పాస్‌బుక్‌లో 2.13 ఎకరాలు మాత్రమే వచ్చింది. మిగతా 1.01 ఎకరాల కోసం రెండేండ్లుగా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని శివయ్య ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రెవెన్యూ అధికారులైనా తనకు న్యాయంచేయాలని వేడుకొంటున్నారు.

# కృష్ణమ్మకు పూర్తిగా తగ్గిన వరద

- నిండుకుండల్లా జలాశయాలు
- గరిష్ఠస్థాయిలో నీటినిల్వలు
- విద్యుత్ ఉత్పత్తి, కాల్వల ద్వారా నీటి విడుదల
- పోతిరెడ్డిపాడు నుంచి 30 వేల క్యూసెక్కులు

జలాభిషేకం

**హైదరాబాద్/ మహబూబ్‌నగర్, నల్లగొండ ప్రధాన ప్రతినిధులు/ జోగుళాంబ గద్వాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కృష్ణానదికి వరదలు పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో దాదాపు అన్ని ప్రాజెక్టుల క్రస్ట్‌గేట్లు మూసివేశారు. దీంతో గత కొన్ని రోజులుగా గర్జించిన డ్యామ్‌లు.. ఇప్పుడు శాంతించాయి. ప్రాజెక్టుల్లో గరిష్ఠస్థాయిలో నీటిని నిల్వ ఉంచుతూ.. విద్యుత్ ఉత్పత్తి, కాల్వల ద్వారా దిగువకు నీటిని విడుదలచేస్తున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటికే జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు 780 టీఎంసీల వరద రావటం గమనార్హం. వరద ప్రవాహాన్ని క్రమపద్ధతిలో నిర్వహిస్తూ.. ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తిస్థాయికి నీటిమట్టాన్ని చేర్చారు. శ్రీశైలం ప్రాజెక్టుకు బుధవారం సాయంత్రం 1.65 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 1.10 లక్షల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. ఉదయం 2 గేట్లు తెరిచి 50 వేల క్యూసెక్కులను వదిలిన అధికారులు సాయంత్రం 5 గంటల తర్వాత గేట్లు మూసేశారు. ఏపీ విద్యుత్‌కేంద్రం ద్వారా 29 వేలు, తెలంగాణ విద్యుత్‌కేంద్రం ద్వారా 42 వేలు, ఎంజీకేఎల్‌ఐకు 2400, హంద్రీనీవాకు 2,026 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఒక్క పోతిరెడ్డిపాడు ద్వారానే 30 వేల క్యూసెక్కుల నీరు వెళుతున్నది. శ్రీశైలం పూర్తి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 884.80 అడుగుల వద్ద ఉన్నది. సాగర్‌కు కేవలం కరంట్ ఉత్పత్తి ద్వారా 72 వేల క్యూసెక్కులు వెళుతున్నాయి. అటు నాగార్జునసాగర్‌లో ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 32,561 క్యూసెక్కులు, కుడికాల్వ ద్వారా 9,443, ఎడమకాల్వ ద్వారా 8,896, ఎస్సెల్బీసీ ద్వారా 2400, వరదకాల్వద్వారా 300, డీటీ గేట్స్ (డైవర్షన్ టన్నెల్) ద్వారా 10 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది.

### వివిధ ప్రాజెక్టుల్లో బుధవారంనాటి నీటిమట్టాల వివరాలు

| రిజర్వాయర్ | ఎఫ్‌ఆర్‌ఎల్ అడుగుల్లో | ప్రస్తుత మట్టం అడుగుల్లో | పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో | ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో | ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో | అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో |
|---|---|---|---|---|---|---|
| ఆల్మట్టి | 1705.00 | 1704.23 | 129.72 | 125.47 | 16,000 | 991 |
| నారాయణపుర | 1615.00 | 1613.39 | 37.64 | 35.64 | 0 | 11,270 |
| ఉజ్జయిని | 1630.00 | 1630.00 | 117.24 | 117.24 | 1,977 | 4,350 |
| జూరాల | 1045.00 | 1044.52 | 9.66 | 9.41 | 35,000 | 31,322 |
| తుంగభద్ర | 1633.00 | 1633.00 | 100.86 | 100.86 | 32,963 | 32,483 |
| శ్రీశైలం | 885.00 | 884.80 | 215.81 | 214.84 | 46,755 | 1,06,543 |
| నాగార్జునసాగర్ | 590.00 | 589.30 | 312.05 | 309.95 | 54,532 | 54,532 |
| పులిచింతల | 175.00 | 169.81 | 45.77 | 38.09 | 36,494 | 11,409 |
| సింగూరు | 1717.93 | 1670.39 | 29.91 | 0.44 | 0 | 20 |
| నిజాంసాగర్ | 1405.00 | 1368.37 | 17.80 | 0.14 | 0 | 10 |
| శ్రీరాంసాగర్ | 1091.00 | 1063.00 | 90.31 | 17.32 | 0 | 400 |
| లోయర్‌మానేరు | 920.00 | 882.00 | 24.07 | 3.56 | 0 | 206 |
| శ్రీరాజరాజేశ్వర | 1043.31 | 1005.25 | 25.87 | 6.71 | 7,361 | 83 |
| కడెం | 700.00 | 696.93 | 7.60 | 6.84 | 518 | 873 |
| ఎల్లంపల్లి | 485.56 | 482.09 | 20.18 | 17.25 | 1,524 | 9,386 |
| మూసీ | 645 | 628.80 | 4.46 | 1.24 | 34 | 0 |


పార్వతి పంప్‌హౌస్‌లోని ఆరో మోటార్ వెట్‌రన్ విజయవంతం కావడంతో డెలివరీ సిస్టర్న్ దగ్గర ఎత్తిపోస్తున్న జలాలు

# కొనసాగుతున్న ఎత్తిపోతలు

నంది, గాయత్రిలో నిరంతరంగా నడుస్తున్న మోటర్లు శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్‌లో 7 టీఎంసీలు

**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

కాళేశ్వరం లింక్-2లో గోదావరి జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ధర్మారం మండలం నందిమేడారంలోని నంది పంప్‌హౌస్‌లో ఈ నెల 15వతేదీ రాత్రి నుంచి 1, 2, 3 మోటర్ల ద్వారా నంది రిజర్వాయర్‌ను నింపుతున్న అధికారులు, 17వతేదీ ఉదయం 10.30 గంటల నుంచి మూడో మోటర్‌ను ఆఫ్‌చేసి, నాలుగో మోటర్‌ను నడిపిస్తున్నారు. అదే రోజు రాత్రి తొమ్మిది గంటలకు ఒకటో మోటర్‌ను ఆఫ్ చేసి, 2, 4 మోటర్లను నడిపిస్తున్నారు. తిరిగి మంగళవారం ఉదయం 10 గంటలకు మూడో మోటర్‌ను ప్రారంభించారు. 2, 3, 4 మోటర్లను నిరంతరంగా నడిపిస్తున్నారు. నంది రిజర్వాయర్ ఆరుగేట్ల ద్వారా శుక్రవారం నుంచి గాయత్రి పంప్‌హౌస్‌కు నీటి విడుదల కొనసాగిస్తున్నారు. మరోవైపు రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌస్‌లో ఈ నెల 11 నుంచి రెండు బాహుబలి మోటర్లను దఫాలవారీగా వెట్ ట్రయల్‌రన్ చేస్తున్న అధికారులు.. 15వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి ఐదో మోటర్‌ను, రాత్రి 7 గంటల నుంచి నాలుగో మోటర్‌ను కంటిన్యూగా నడిపిస్తున్నారు. గాయత్రి పంప్‌హౌస్‌లో మూడు మోటర్లు నడుస్తుండటంతో డెలివరీ సిస్టర్న్ నుంచి ఉప్పొంగుతున్న జలాలు, 5.7 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్‌లో నిండుగా ప్రవహించి, వరదకాల్వకు చేరుతున్నాయి. అక్కడినుంచి శ్రీరాజరాజేశ్వర (మిడ్‌మానేరు) రిజర్వాయర్‌కు చేరుతున్నాయి. ఈ జలాశయం పూర్తిస్థాయి సామర్థ్యం 25.873 టీఎంసీలు కాగా, బుధవారం సాయంత్రం వరకు 7.041 టీఎంసీల నీరు చేరినట్లు ఈఈ అశోక్ తెలిపారు.

### పార్వతి పంప్‌హౌస్‌లో ఆరో మోటర్ వెట్‌రన్ సక్సెస్

పార్వతి (సుందిళ్ల) పంప్‌హౌస్‌లోని ఆరో మోటర్‌కు బుధవారం సాయంత్రం అధికారులు విజయవంతంగా వెట్‌రన్ నిర్వహించారు. ఇక్కడ మొత్తం తొమ్మిది మోటర్లను బిగించగా, ఇప్పటికే ఐదింటికి వెట్‌రన్ చేపట్టారు. కాసిపేటలోని సరస్వతీ పంప్‌హౌస్‌లోని ఆరో మోటర్‌కు గురువారం వెట్‌రన్ చేపట్టనున్నట్లు ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు తెలిపారు.


వెల్దండ తాసిల్‌ను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

## రైతులను ముప్పతిప్పలు పెడుతున్రు

- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- వెల్దండ తాసిల్ ఆఫీస్ ఆకస్మిక తనిఖీ

**వెల్దండ:** రైతుల సమస్యలను తీర్చకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుకొంటూ రెవెన్యూ అధికారులు ముప్పుతిప్పలు పెడుతున్నారని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆవేదన వ్యక్తంచేశారు. రైతుల ఫిర్యాదు మేరకు బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల తాసిల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఉదయం 11 గంటలు దాటినా ఆఫీస్‌లో గ్రామ సేవకులు తప్ప అధికారు లు ఎవరూ రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు రైతులను హింసిస్తున్నారని కలెక్టర్‌తో మాట్లాడి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకొనేలా చూస్తానని చెప్పారు.

తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్య మరియు పురపాలక ఇంజినీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
No.51/SE/TS/TUFIDC/Thorrur/ఫేజ్-II/2019-20/81 తేది: 17-08-2019
తొర్రూరు మునిసిపాలిటి -TUFIDC సహాయంతో ULBలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి-మహబూబాబాద్ జిల్లా యొక్క తొర్రూరు మునిసిపాలిటిలో స్మశాన వాటికల అభివృద్ధి పనులు, డంపింగ్ యార్డ్ అభివృద్ధి, అంతర్గత CC రోడ్లు వేయుట, కాలువలు, భారీ వర్షపునీటి కాలువల నిర్మాణం (ఒకపని). పనుల సంఖ్య: 01సం. పని విలువ: రూ. 1125.00 లక్షలు. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 23-08-2019. బిడ్ డౌన్‌లోడ్ ముగింపు తేది: 12-09-2019. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ అనగా www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (PH) TUFIDC, యూనిట్-I, వరంగల్
DIPR RO. No. 968-DP/CL/Advt/1/2019-20, Dt: 21/08/2019

తెలంగాణ ప్రభుత్వం
నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
టెండర్ ప్రకటన నం. 01/2019-20 తేది: 21.08.2019
పని పేరు : ఖమ్మం జిల్లా ఎర్రగడ్డ తండా (గ్రా), కూసుమంచి (మం) వద్ద గల భక్తరామదాసు పంపు హౌజ్ ద్వారా పాలేరు జలాశయము నుండి 5.50 టి.ఎమ్.సి.ల నీటిని ఎత్తిపోయుటకు 01.10.2019 నుండి 28.02.2021 వరకు ఆపరేషన్ మరియు నిర్వహణ చేయు పని అంచనా కాంట్రాక్టు విలువ రూ. 1,08,61,236/- సుమారుగా, టెండర్ డాక్యుమెంట్లు లభించు తేది: 22.08.2019 ఉదయం 11-00 గంటల నుండి 05.09.2019 ఉదయం 11-00 గంటల వరకు. పూర్తి వివరాలకు మరియు బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు : https://tender.telangana.gov.in/ ని సందర్శించగలరు.
పర్యవేక్షక ఇంజినీరు & ప్రాజెక్టు పాలనాధికారి
సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్-2, ఖమ్మం

రెండేండ్ల వయస్సు నుంచి నడువ లేనిస్థితిలో ఉన్న తమ కొడుకు సాయిరాంకు ఆపరేషన్ చేయించి, జీవితాన్ని ఇచ్చిన మనసున్న మారాజు కేటీఆర్‌కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని రామగుండంకు చెందిన మొగిలి రాజమల్లు, లక్ష్మి పేర్కొన్నారు. బుధవారం వారి ఇంట్లో సీఎం కేసీఆర్, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే చందర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. - గోదావరిఖని, నమస్తే తెలంగాణ



# దసరాకు కరీంనగర్ ఐటీటవర్ ప్రారంభం

- రిబ్బన్ కట్ చేయనున్న సీఎం కేసీఆర్
- ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వెల్లడి

**కరీంనగర్ కార్పొరేషన్, నమస్తే తెలంగాణ:** కరీంనగర్‌లో నిర్మిస్తున్న ఐటీటవర్‌ను అక్టోబర్ 8న దసరారోజు సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. బుధవారం తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీ నర్సింహారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఐటీ టవర్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఈ టవర్‌లో స్థానిక యువతకు మూడు వేల నుంచి 4 వేల ఉద్యోగావకాశాలు రానున్నాయన్నారు. ఇప్పటికే 11 కంపెనీలు ఎంవోయూ కుదుర్చుకున్నాయని చెప్పారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించాలన్న ఆలోచనతో సీఎం కేసీఆర్ ఆలోచన మేరకు అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ కరీంనగర్‌కు ఐటీటవర్ మంజూరు చేశారని గుర్తుచేశారు.



టీఎస్ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డితో కలిసి కరీంనగర్ ఐటీ టవర్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్







కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన లింగయ్య అనే రైతు పొలం పనులకు ఎలక్ట్రిక్ వాహనం వాడుతూ ప్రత్యేకంగా నిలుస్తున్నారు. దానిపై గడ్డిమోపులు, బస్తాలు తీసుకెళ్తుంటే గ్రామస్థులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. సంగారెడ్డిలోని ఐఐటీ శాస్త్రవేత్తగా పనిచేస్తున్న లింగయ్య కొడుకు మోహన్ తన తండ్రి ఇబ్బందులు తొలగించేందుకు ఈ-వాహనాన్ని కొనుగోలు చేశారు. దీనికి ఒక్కసారి చార్జింగ్ పెడితే 45 కిలో మీటర్లు ప్రయాణిస్తుంది. - రామడుగు

# రాష్ట్రంలో తేలికపాటి వానలు

## ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల జిల్లాల్లో భారీగా..

- ఏడు జిల్లాల్లో ఓ మోస్తరు..
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- రాగల 24 గంటల్లో భారీ వర్షాలకు అవకాశం

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:**

బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురుస్తున్నాయి. బుధవారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల జిల్లాల్లో భారీ వర్షం కురవగా, గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుప్రాంతాలతో పాటు వరంగల్ రూరల్, ములుగు, నల్లగొండ, సూర్యాపేట, నిజామాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఓ మోస్తరు వాన పడింది. కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం కారణంగా రాగల 24 గంటల్లో కొన్నిచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

✦ మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు పలు జిల్లాల్లో చిరుజల్లుల నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన వర్షం సాయంత్రం వరకు కురిసింది. కొత్తగూడెం, ఇల్లెందు, బూర్గంపాడు, భద్రాచలం, పాల్వంచ, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు మండలాల్లో భారీ వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం 5 గంటలకే జిల్లాకేంద్రంలో నల్లటి మబ్బులతో కారుచీకటి కమ్ముకున్నది. జిల్లావ్యాప్తంగా 18.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పాల్వంచలో 52.4 మి.మీ., ములకలపల్లిలో 43.6 మి.మీ., నమోదైంది. బుధవారం సాయంత్రం ఖమ్మం నగరంతో పాటు పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. వైరా, మధిర, ఖమ్మం రూరల్, కూసుమంచి, కారేపల్లి, కామేపల్లి, రఘునాథపాలెం, చింతకాని, కొణిజర్ల, బోనకల్ మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. తిరుమలయపాలెం, ఏన్కూరు మండలాల్లో అత్యధికంగా 59.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇప్పటివరకు ఖమ్మం జిల్లావ్యాప్తంగా 1,43,587 హెక్టార్లలో పంటల సాగు పూర్తైంది. జగిత్యాల పట్టణంతోపాటు మల్యాల మండలకేంద్రం, మద్దుట్ల గ్రామంలో బుధవారం భారీ వర్షం కురిసింది. జిల్లాకేంద్రంతోపాటు శంకులపల్లిలో 46 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. దీంతో జిల్లా కేంద్రంలోని మురుగు కాలువలు ఉప్పొంగడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

✦ సూర్యాపేట జిల్లావ్యాప్తంగా బుధవారం ఉదయం నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. హుజూర్‌నగర్, గరిడేపల్లి, నేరేడుచర్ల, మేళ్లచెర్వు, తిరుమలగిరి, తుంగతుర్తి, మద్దిరాల, అనంతగిరి, కోదాడ, నడిగూడెం, మోతె, సూర్యాపేట మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురవగా మఠంపల్లి, పాలకవీడు, చింతలపాలెం, నాగారం మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. నిజామాబాద్ జిల్లాలో మంగళవారం రాత్రి, బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. బుధవారం ఇందల్వాయి, డిచ్‌పల్లి, బోధన్, రెంజల్, భీమ్‌గల్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్ మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 64.9 సెం.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. మంగళవారం వరకు 66.7 సెం.మీ వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. ములుగు జిల్లాలోని ఎనిమిది మండలాల్లో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు జిల్లా వ్యాప్తంగా 6.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా సమ్మక్క-సారలమ్మ తాడ్వాయి మండలంలో 20.4 మి.మీటర్ల వర్షం కురిసినట్లు వాతావరణ అధికారి తెలిపారు. వరంగల్ రూరల్ జిల్లాలో బుధవారం చిరుజల్లులు కురిశాయి. పరకాల, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాల్లో చెరువులు, కుంటల కింద ప్రస్తుతం వరినాట్లు వేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండల కేంద్రంలో బుధవారం భారీ వర్షం కురిసింది. పత్తి, మిర్చి, జొన్న పంటలకు ఈ వర్షంప్రాణం పోసింది.



జగిత్యాల జిల్లాకేంద్రంలో జలమయమైన రహదారి

### రాగల 24గంటల్లో వర్షసూచన

**హైదరాబాద్ సిటీ బ్యూరో, నమస్తే తెలంగాణ:** రాగల 24గంటల్లో గ్రేటర్‌హైదరాబాద్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. బుధవారం గ్రేటర్‌లోని కొన్ని చోట్ల చిరుజల్లులు కురిశాయి. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం సాయంత్రం వరకు రాజేంద్రనగర్‌లో 7.0 మిల్లీమీటర్లు, కొండుర్గులో 5.8 మి.మీ.లు, శంషాబాద్‌లో 3 మి.మీ.లు, శివరాంపల్లిలో 5 మి.మీ.ల చొప్పున వర్షపాతం నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. నగరంలో ఉదయం నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రత 31.9 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 23.2 డిగ్రీలు, గాలిలో తేమ 63శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

### స్థిరంగా అల్పపీడనం

**హైదరాబాద్,నమస్తేతెలంగాణ:** తూర్పు ఉత్తర్‌ప్రదేశ్ దాన్ని ఆనుకొని ఉన్న బీహార్ ప్రాంతాల్లో అల్పపీడనం స్థిరంగా కొనసాగుతున్నది. దీనికి అనుబంధంగా సముద్ర మట్టానికి 7.5 కిలోమీటర్ల ఎత్తువరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నది. ఈ అల్పపీడన ప్రాంతం నుంచి కోస్తాంధ్ర వరకు ఒడిశా మీదుగా ఉత్తర – దక్షిణ ద్రోణి కొనసాగుతున్నది. తూర్పుమధ్య బంగాళాఖాతం దాన్ని ఆనుకొని ఉన్న ఉత్తర అండమాన్‌ప్రాంతంలో సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో మంగళవారంరాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు, కొన్ని చోట్ల భారీ వానలు కురిశాయి. రాగల 24 గంటల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు.



ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో కురుస్తున్న వర్షం



సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో గుంతల్లో నిలిచిన వర్షం నీరు



ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్క నాటుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

# మొక్కలే జీవకోటికి ప్రాణాధారం

## ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు

**ఎర్రుపాలెం:** మొక్కలే జీవకోటికి ప్రాణాధారమని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం ఉన్నత పాఠశాలలో హరితహారంలో భాగంగా ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొక్కలునాటి వాటిని సంరక్షించే బాధ్యతను కూడా చేపట్టాలన్నారు. హరిత తెలంగాణే సీఎం కేసీఆర్ ధ్యేయమని, దాన్ని సాధ్యం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధిసంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమలరాజు, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి తాతా మధు, జిల్లా నాయకులు బొమ్మెర రామ్మూర్తి, మధిర ఏఎంసీ చైర్మన్ చావా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో మాట్లాడుతున్న జూలూరు గౌరీశంకర్

# తెలుగు సాహిత్యానికి ఆదరణ

## రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్

**చౌటుప్పల్, నమస్తే తెలంగాణ:** తెలుగు సాహిత్యానికి దేశవ్యాప్తంగా ఎంతో ఆదరణ ఉన్నదని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట ప్రభుత్వ డిగ్రీకళాశాలలో బుధవారం నిర్వహించిన 'నూతన విద్యార్థులకు దిశానిర్దేశం' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సాహిత్యం చదివితే జీవితంలో ఎంతటి సమస్యనైనా ఎదుర్కొనే శక్తి వస్తుందన్నారు. తెలుగులోని మంచి కథలు, నవలలు, కవిత్వం, ఆత్మకథలు చదవాలని సూచించారు. ఆర్డీవో సూరజ్‌కుమార్, రాష్ట్ర వనరుల సంస్థ డైరెక్టర్ బండి సాయన్న, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి యాదయ్య, ప్రిన్సిపాల్ యాదయ్య పాల్గొన్నారు.

# జలసంరక్షణతోనే మనుగడ

- జలశక్తి అభియాన్ కేంద్ర బృందం

**కోనరావుపేట/గంగాధర/చిగురుమామిడి :** జలసంరక్షణతోనే భవిష్యత్తులో మానవ మనుగడ సాధ్యమవుతుందనీ, ప్రతి నీటి బొట్టు భూమిలోకి ఇంకేలా చూడాలని జలశక్తి అభియాన్ కేంద్రం నోడల్ ఆఫీసర్ సూదంషు శేఖర్‌దాస్, బ్లాక్ నోడల్ అధికారి అనురాగ్ సెహగల్ పేర్కొన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని వటిమల్ల, మల్కపేట గ్రామాల్లో ఉపాధి హామీలో భాగంగా నిర్మించిన ఫాంపాండ్స్, బోర్‌వెల్ రీచార్జి, ఇంకుడు గుంతలు, కాంటూర్ కందకాలు, హరితహారం మొక్కలను పరిశీలించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలంటే హరితహారంలో మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించి వృక్షాలుగా ఎదిగేట్టు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మల్కపేటలోని పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఉపాధి హామీ అధికారుల పని తీరు బాగుందని ప్రశంసించారు. కరీంనగర్ జిల్లా గంగాధర, చిగురుమామిడిలోనూ జలశక్తి అభియాన్ బృందం పర్యటించింది. చిగురుమామిడి మండలంలోని బొమ్మనపల్లి, ఉల్లంపల్లి, గాగిరెడ్డిపల్లి, పీచుపల్లి గ్రామాల్లో ఫాంపాండ్ల నిర్మాణాలు, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జి గుంతలు , హరితహారం నర్సరీల్లో మొక్కలను బుధవారం బృంద సభ్యులు పరిశీలించారు. గాగిరెడ్డిపల్లిలో ఎంపీపీ కొత్త వినీత, జడ్పీటీసీ గీకురు రవీందర్, సర్పంచ్ చన్నీళ్ల వెంకటేశంతో కలిసి మొక్కలు నాటారు. బృందం సభ్యులు సతీంద్రపాల్ సింగ్, ఉమ్రాసింగ్, సౌరభ్‌శరన్ తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో రీచార్జి గుంతను పరిశీలిస్తున్న జలశక్తి అభియాన్ కేంద్ర బృందం సభ్యులు

# జోరుగా వరినాట్లు

- ప్రాజెక్టులు నిండటంతో ఊపందుకున్న నాట్లు
- రాష్ట్రంలో 85 శాతం దాటిన పంటల సాధారణసాగు
- వ్యవసాయశాఖ నివేదిక వెల్లడి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో వరినాట్లు జోరందుకున్నాయి. వారం వ్యవధిలోనే లక్షల ఎకరాల్లో రైతులు వరినాట్లు వేశారు. ఈ వానాకాలంలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 23.83 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 19.47 లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. గతవారంతో పోల్చితే దాదాపు 5 లక్షల ఎకరాల్లో అధికంగా నాట్లు పడినట్టు వ్యవసాయశాఖ బుధవారం విడుదల చేసిన నివేదిక స్పష్టం చేస్తున్నది. వచ్చే 10 రోజుల్లో వందశాతం నాట్లు పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు. అయితే సెప్టెంబర్ తొలివారంలోపే వరినాట్లు ముగించాలని, ఇప్పుడు కొత్తగా నార్లు పోసుకోవద్దని జయశంకర్ వర్సిటీ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. రాష్ట్రంలో ఈ వానకాలంలో సాధారణ సాగు విస్తీర్ణం 1.08 కోట్ల ఎకరాలు కాగా, 85 శాతం సాగయిందని, 91.45 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేసినట్టు వ్యవసాయశాఖ వెల్లడించింది. పత్తిని అత్యధికంగా 102 శాతం 43.53 లక్షల ఎకరాల్లో వేశారు. మొక్కజొన్న 8.94 లక్షలు, కందులు 6.70 లక్షలు, పెసర్లు 1.47 లక్షలు, సోయాబీన్ 4.27 లక్షల ఎకరాల్లో సాగుచేశారు. ఆహార పంటలు 47.69 లక్షల ఎకరాల్లో సాగుకావాల్సి ఉండగా, ఇప్పటివరకు 38.30 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. ఐదు జిల్లాల్లో 100 శాతానికి పైన, 23 జిల్లాల్లో 76 నుంచి 100 శాతం, నాలుగు జిల్లాల్లో 51 నుంచి 75శాతం పంటల సాగు నమోదయింది.



నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లిలో స్థలం మ్యాప్‌ను అధికారులకు వివరిస్తున్న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

# ఎయిర్‌పోర్టుకు జక్రాన్‌పల్లి అనుకూలం

## ఏఏఐ బృందం సభ్యుల వెల్లడి

**ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి/ జక్రాన్‌పల్లి:** నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలంలో విమానాశ్రయం ఏర్పాటుకు అనుకూలమైన స్థలం ఉందని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) బృందం సభ్యులు పేర్కొన్నారు. ఏఏఐ కన్సల్‌టెన్సీ డీజీఎం అమిత్ మిశ్రా, ఏజీఎంలు నీరజ్ గుప్తా, కుమార్‌వైభవ్ బుధవారం జక్రాన్‌పల్లి, ఆదిలాబాద్‌లో విమానాశ్రయ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ల్యాండ్ ఓరియంటేషన్, విండ్ డైరెక్షన్, ల్యాండ్ ఫిజిబిలిటీ వివరాలు సేకరించారు. ఎయిర్‌పోర్టు ఓరియంటేషన్‌ని నిర్ణయించిన అనంతరం సమగ్ర ప్రాజెక్టు నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొన్నారు. ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటుకు అనుకూల వసతులున్నాయని అధికారులకు జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్, రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్ లోక భూమారెడ్డి బుధవారం వినతిపత్రం ఇచ్చారు.

# సీనియర్ జర్నలిస్ట్ హన్మంత్‌రెడ్డి మృతి

## సంతాపం వ్యక్తం చేసిన మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

**మహబూబ్‌నగర్ క్రైం:** పాలమూరుకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ హన్మంత్‌రెడ్డి (64) బుధవారం మృతి చెందారు. దేవరకద్ర మండలం వెంకటయ్యపల్లిలో జన్మించిన ఆయన మూడు దశాబ్దాలుగా వివిధ పత్రికల్లో పనిచేశారు. 25 ఏండ్లు ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షునిగా వ్యవహరించారు. ఈనెల 19న తీవ్ర అనారోగ్యానికి గురైన హన్మంత్‌రెడ్డిని కుటుంబ సభ్యులు ఎస్వీఎస్ దవాఖానలో చేర్చారు. చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. హన్మంత్‌రెడ్డి మృతి పట్ల తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



హన్మంత్ రెడ్డి (ఫైల్)

### డబ్బుల కోసం తల్లిని చంపిన తనయుడు

**సుబేదారి, (వరంగల్):** డబ్బుల కోసం ఓ కొడుకు తల్లిని హతమార్చిన ఘటన వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలో బుధవారం చోటుచేసుకున్నది. హన్మకొండ నక్కలగుట్టకు చెందిన బీబాలమణి (60) రైల్వేలో ఉద్యోగం చేస్తున్నది. త్వరలోనే రిటైర్డ్ కానుండగా ఆమె అనారోగ్యంతో విధులకు వెళ్లడం లేదు. ఆమె కొడుకు రేవంత్‌కుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కాగా రేవంత్‌కుమార్ ఏ పని చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. బాలమణికి వచ్చే వేతనంతో తనతోపాటు కుమారుడి కుటుంబాన్ని పోషించేది. మద్యానికి బానిసైన రేవంత్‌కుమార్ తరుచూ డబ్బులు ఇవ్వాలని వేధించేవాడు. ఈ క్రమంలో అనారోగ్యంతో ఉన్న బాలమణిని డబ్బులు ఇవ్వాలని రేవంత్‌కుమార్ బుధవారం బెదిరించాడు. ఆమె నిరాకరించడంతో గొంతు నులమడంతో ఊపిరాడక ప్రాణాలు వదిలింది. ఘటనాస్థలిని పరిశీలించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొన్నారు.

## ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఎక్సలెన్స్

# అవార్డు స్వీకరించిన జగిత్యాల కలెక్టర్

**నమస్తే తెలంగాణ, జగిత్యాల ప్రతినిధి:** జగిత్యాల కలెక్టర్ డాక్టర్ ఏ శరత్‌కు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఎక్సలెన్స్ ఇన్ గవర్నెన్స్ అవార్డు దక్కింది. బుధవారం ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డును కేంద్రమంత్రి రామ్‌విలాస్ పాశ్వాన్ చేతులమీదుగా అందుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే కలెక్టర్ డాక్టర్ ఎ శరత్ జాతీయస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. మార్చిలో ప్రధాని నరేంద్రమోదీ చేతులమీదుగా అవార్డు అందుకునేందుకు కలెక్టర్ శరత్ ఢిల్లీ చేరుకున్నప్పటికి అనివార్య కారణాల వల్ల ఆ కార్యక్రమం వాయిదాపడింది. కాగా బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ నిర్వహించిన సర్వేలో శరత్ జాతీయస్థాయిలో ఉత్తమ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలు చేయడం, ఉత్తమ పాలన కోసం కృషి చేయడం లాంటి అంశాల్లో ఈ సర్వే నిర్వహించిన ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ దేశంలోనే అన్ని జిల్లాల కలెక్టర్ల పనితీరుపై అధ్యయనం జరిపిన అనంతరం ఒక్కో రంగంలో ఒకరిని ఎంపిక చేసింది. జిల్లాల అభివృద్ధి కోసం వినూత్న రీతిలో కృషి చేస్తున్న టాప్ 15 మంది కలెక్టర్లలో జగిత్యాల కలెక్టర్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కేంద్ర మంత్రులు నితిన్‌గడ్కరీ, పీయుష్ గోయల్, రవిశంకర్ ప్రసా ద్, జితేంద్రసింగ్ తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీలో కేంద్ర మంత్రి రాంవిలాస్ పాశ్వాన్ చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న జగిత్యాల కలెక్టర్ డాక్టర్ శరత్

### అనారోగ్యంతో దంపతుల బలవన్మరణం

**బోథ్, నమస్తే తెలంగాణ/ నేరడిగొండ:** ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండకు చెందిన వ్యాపారవేత్త ముక్క సుదర్శన్(70) అతడి భార్య ప్రమీల(65) బుధవారం బోథ్ మండలంలోని పొచ్చెర జలపాతంలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. బోథ్ ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సుదర్శన్ చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. రెండేండ్ల క్రితం గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స జరిగింది. కాగా బుధవారం సుదర్శన్ అతడి భార్య పొచ్చెర జలపాతానికి చేరుకున్నారు. అక్కడ పార్కింగ్‌లో కారు నిలిపి జలపాతాన్ని చూసేందుకు వచ్చినట్లు సిబ్బందికి చెప్పారు. అయితే కొడుకులు, కూతుళ్లకు మాత్రం తల్లి ప్రమీల ఫోన్‌చేసి తాము చనిపోతున్నట్టు చెప్పడంతో హుటా హుటిన పెద్ద కొడుకు శ్రీనివాస్ జలపాతానికి చేరుకున్నాడు. అప్పటికే వారు జలపాతంలోకి దూకి ప్రాణాలు తీసుకున్నారు. పోలీసులు మృతదేహాలను వెలికితీసి పంచనామా నిర్వహించారు.

# సింధు, సైనా శుభారంభం



రెండో రౌండ్‌లో విజయం
ప్రిక్వార్టర్స్‌కు శ్రీకాంత్
బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్

**బాసెల్(స్విట్జర్లాండ్) :** భారత స్వర్ణ పతక స్వప్నాన్ని మోస్తున్న స్టార్‌షట్లర్లు పీవీ సింధు, సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్ బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ముందడుగేశారు. తొలి రౌండ్‌లో బై లభించగా... బుధవారమిక్కడ జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో బరిలోకి దిగిన ఇద్దరు సింధు, సైనా ప్రత్యర్థులను చిత్తుచేసి ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. ఐదో సీడ్ పీవీ సింధు 21-14, 21-15 తేడాతో పై యూ పో(చైనీస్ తైపీ)పై విజయం సాధించింది. 43 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్ మొదటి గేమ్‌లో సింధు తొలి నుంచి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. రెండో రౌండ్‌లోనూ ఓ దశలో 6-1 ఆధిక్యంలో నిలిచినా ఆ తర్వాత వరుస తప్పిదాలు చేసి బ్రేక్ సమయానికి 10-11తో వెనుకంజ వేసింది. విరామం తర్వాత విజృంభించిన సింధు.. ప్రత్యర్థికి మూడు పాయింట్లు మాత్రమే ఇచ్చి తదుపరి 10పాయింట్లను సాధించి, రెండో గేమ్‌ను గెలిచింది. ప్రిక్వార్టర్స్‌లో బీవెన్ జంగ్(అమెరికా)తో సింధు తలపడనుంది. సైనా నెహ్వాల్ 21-10, 21-11 తేడాతో డీ విచ్ ఎజ్బెర్జెన్(నెదర్లాండ్స్)పై సునాయాసంగా గెలుపొందింది. ప్రిక్వార్టర్స్‌లో మియా బిచ్‌ఫెల్ట్(డెన్మార్క్)తో తలపడనుంది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో తెలుగు షట్లర్ కిడాంబి శ్రీకాంత్ 13-21, 21-13, 21-16 తేడాతో జిల్బెర్‌మ్యాన్(ఇజ్రాయెల్)పై విజయం సాధించి, ముందడుగేశాడు. ప్రిక్వార్టర్స్‌లో శ్రీకాంత్.. వాంగ్చోరియాన్(థాయ్‌లాండ్)తో పోటీ పడతాడు.

**డబుల్స్‌లో ఎదురుదెబ్బ**

మహిళల డబుల్స్‌లో రెండో రౌండ్‌లో అశ్వినీ పొన్నప్ప-సిక్కిరెడ్డి జోడీ 20-22,16-21 తేడాతో ఏడో సీడ్ చైనీస్ ద్వయం డూ యూయి, లిన్ యిన్ హూ చేతిలో... మేఘనా జక్కంపూడి-పూర్విషా రామ్ జోడీ 8-21, 18-21 తేడాతో ఎనిమిదో సీడ్ షిహో తనక-కొహారు యొనెమోటో(జపాన్)పై పరాజయం పాలైంది. పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో మను అత్రి-సుమీత్ రెడ్డి ఓడిపోయి, టోర్నీ నుంచి నిష్క్రమించారు.

# సవాల్‌కు సిద్ధం

## టెస్టు చాంపియన్‌షిప్‌లో భారత్ ప్రస్థానం మొదలు

### విండీస్‌తో నేటి నుంచి తొలి టెస్టు.. జట్టు కూర్పుపై సర్వత్రా ఆసక్తి

రాత్రి 7 నుంచి సోనీ టెన్-1, టెన్-3లో







**టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన కొనసాగుతున్న టీమ్‌ఇండియా.. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ప్రస్థానాన్ని నేడు ప్రారంభించనుంది. విండీస్ గడ్డపై టీ20.. వన్డే సిరీస్‌ల్లో ఏకచ్ఛత్రాధిపత్యం కనబరిచిన విధంగానే సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ సత్తా చాటి ప్రపంచపోరులో ఘనమైన బోణీ కొట్టాలని పట్టుదలగా ఉన్నది. పేస్, బౌన్స్‌తో కూడిన పిచ్‌పై ఆతిథ్య విండీస్ ప్రమాదకారే అయినా.. పటిష్ఠంగా ఎదుర్కొనేందుకు ప్రణాళికలు రచిస్తున్నది. అన్ని విభాగాల్లో రాణించి 17 ఏండ్లుగా సిరీస్ అజేయ రికార్డును పదిలం చేయాలని ఆశిస్తున్నది. అయితే, టీమ్‌ఇండియా తుదిజట్టు కూర్పు ఆసక్తి రేపుతున్నది. ముఖ్యంగా ముంబైకర్లు రోహిత్- రహానే.. స్పిన్నర్లు అశ్విన్-కుల్‌దీప్ మధ్య పోటీ తీవ్రంగా ఉన్నది. ఈ నేపథ్యంలో కెప్టెన్, మేనేజ్‌మెంట్ ఎవరివైపు మొగ్గు చూపుతుందనేది ఉత్కంఠగా మారింది.**

**నార్త్‌సౌండ్(ఆంటిగ్వా) :** టెస్టు క్రికెట్‌కు మరింత వన్నె తెచ్చేందుకు.. క్రికెట్ ప్రేమికుల్లో ఆసక్తి పెంచేందుకు ఐసీసీ ప్రవేశపెట్టిన ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో ప్రస్థానాన్ని మొదలుపెట్టేందుకు టీమ్‌ఇండియా సిద్ధమైంది. రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా గురువారమిక్కడి సర్ వివ్ రిచర్డ్స్ మైదానంలో భారత్-విండీస్ మధ్య తొలి టెస్టు ప్రారంభం కానుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో కరీబియన్ జట్టు కంటే బలంగా ఉన్న కోహ్లీసేనకు తుది జట్టు కూర్పే పెద్ద సవాల్‌గా మారింది. మరోవైపు పిచ్ పేస్‌కు అనుకూలించేలా ఉన్న తరుణంలో రోచ్, గాబ్రియేల్‌తో కూడిన విండీస్ బౌలింగ్ భీకరంగా ఉంది. ఈ ఏడాది మొదట్లో ఇంగ్లండ్‌పై టెస్టు సిరీస్ గెలిచి షాకిచ్చిన హోల్డర్ సేన... సొంతగడ్డపై ఎదురైన టీ20, వన్డే సిరీస్‌ల పరాభవంతో కసిగానే ఉంది. ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్ తర్వాత దాదాపు ఎనిమిది నెలల పాటు సుదీర్ఘ ఫార్మాట్‌కు దూరంగా ఉన్న టీమ్‌ఇండియా సత్తా చాటేందుకు అన్ని ప్రణాళికలు సిద్ధం చేసుకుంది.

**ఐదుపై ఆసక్తి**

ఇంతకాలం వన్డేల్లో నాలుగో స్థానంపై చర్చ నడువగా.. ప్రస్తుతం టెస్టుల్లో ఐదులో ఎవరొస్తారన్నది ఆసక్తికరంగా మారింది. తొలి టెస్టులో మయాంక్ అగర్వాల్, కేఎల్ రాహుల్ ఓపెనర్లుగా రావడం దాదాపు ఖాయమే. అయితే, తెలుగు ప్లేయర్ విహారీ కూడా పోటీలో ఉన్నాడు. ఆ తర్వాత మూడో స్థానంలో మిస్టర్ డిపెండబుల్ చతేశ్వర్ పుజారా, నాలుగో స్థానంలో కెప్టెన్ కోహ్లీ రంగ ప్రవేశం చేస్తారు. ఇక ఐదో స్థానం కోసం ఎవరిని తీసుకోవాలనే విషయంపైనే చర్చంతా నడుస్తున్నది. ఐదుగురు బౌలర్లతో బరిలోకి దిగాల్సి వస్తే సూపర్ ఫామ్‌లో ఉన్న రోహిత్ శర్మ... వైస్ కెప్టెన్, నమ్మదగిన ఆటగాడిగా పేరున్న అంజిక్య రహానేల్లో ఒకరిని బెంచ్‌కు పరిమితం చేయాల్సి వస్తుంది. నలుగురు బౌలర్లతో బరిలోకి దిగితే ఇద్దరికీ చోటుంటుంది. ఒకవేళ హార్దిక్ పాండ్యా అందుబాటులో ఉన్నా.. అదనపు స్పిన్నర్ కోసం జడేజాను ఆడించినా ఇద్దరు ముంబైకర్లలో ఒకరే ఉంటారు. తెలుగు ఆటగాడు విహారీ సాధారణంగా అతడు ఓపెనర్ అయినా.. మిడిల్‌ఆర్డర్‌లోనూ సత్తా చాటగలిగే సామర్థ్యముంది. దీంతో అతడూ పోటీలో ఉన్నట్టే.

**కీపర్ ఎవరు..**

వికెట్ కీపర్ స్థానానికి సీనియర్ ప్లేయర్ వృద్ధిమాన్ సాహా, యువ ఆటగాడు రిషబ్ పంత్ మధ్య పోటీ ఉంది. విండీస్ గడ్డపై టీ20, వన్డేల్లో అనుకున్న స్థాయిలో రాణించకున్నా.. అంతకు ముందు ఇంగ్లండ్, ఆస్ట్రేలియాల్లో పంత్ శతకాలు సాధించి ఆకట్టుకున్నాడు. మరోవైపు గాయం కారణంగా 18 నెలల పాటు టెస్టు క్రికెట్ దూరమై.. విండీస్ పర్యటనకు సాహా ఎంపికయ్యాడు. సన్నాహక మ్యాచ్‌లో విండీస్-ఏపై రెండు అర్ధశతకాలతో రాణించాడు. ఈ నేపథ్యంలో యువకుడైన పంత్‌కు చోటు ఉంటుందా.. సీనియర్ అయినా సాహాపైపే మేనేజ్‌మెంట్ మొగ్గుచూపుతుందా అన్నది చూడాలి.

**19** ఈ మ్యాచ్‌లో సెంచరీ చేస్తే కెప్టెన్‌గా ఎక్కువ శతకాలు చేసిన వారి జాబితాలో రెండో స్థానంలో ఉన్న పాటింగ్(19)ను కోహ్లీ(18) చేరుకుంటాడు. తొలి స్థానంలో గ్రేమ్ స్మిత్(25) ఉన్నాడు.

**27** ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా విజయం సాధిస్తే.. విదేశాల్లో అత్యధిక టెస్టుల్లో విజయం సాధించిన కెప్టెన్‌గా ధోనీ(27 విజయాలు) పేరిట ఉన్న రికార్డును విరాట్ కోహ్లీ సమం చేస్తాడు.

**17** 2002 తర్వాత విండీస్‌పై టీమ్‌ఇండియా ఒక్క టెస్టు సిరీస్‌ను కూడా కోల్పోలేదు. ఈ సిరీస్ భారత్ గెలిస్తే 17ఏళ్ల రికార్డు పదిలంగా ఉంటుంది.

**తొలిసారి పేర్లతో..**

టెస్టు క్రికెట్‌లో తొలిసారిగా జెర్సీలపై పేర్లు, నంబర్లతో బరిలోకి టీమ్‌ఇండియా ఆటగాళ్లు బరిలోకి దిగనున్నారు. ఆటగాళ్లు కొత్త జెర్సీలతో దిగిన ఫొటోలను ఇండియన్ క్రికెట్ టీం అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసింది. ఎప్పటిలాగే 18 నంబర్‌తో సారథి కోహ్లీ బరిలోకి దిగనున్నాడు. యాషెస్ సిరీస్‌తో ప్రారంభమైన టెస్టు చాంపియన్‌షిప్‌తో సుదీర్ఘ ఫార్మాట్‌లో జెర్సీలపై పేర్లు, నంబర్ల సంప్రదాయం మొదలైన విషయం తెలిసిందే.

**జట్ల అంచనా**

**భారత్:** కోహ్లీ(కెప్టెన్), రాహుల్, మయాంక్, పుజార, రహానే, రోహిత్/విహారి/జడేజా, రిషబ్ పంత్, అశ్విన్, ఇషాంత్, షమీ, బుమ్రా.
**వెస్టిండీస్:** హోల్డర్(కెప్టెన్), బ్రాత్‌వైట్, క్యాంప్‌బెల్, షాయి హోప్, బ్రావో, హిట్మెయర్, రోస్టన్ చేజ్, డౌరిచ్, కార్న్‌వాల్ /కీమో పాల్, కీమర్ రోచ్, గాబ్రియెల్

**అశ్విన్ X కుల్‌దీప్**

పేసర్లకు అనుకూలించే పిచ్‌పై ముగ్గురు ఫాస్ట్ బౌలర్లతో టీమ్‌ఇండియా బరిలోకి దిగడం ఖాయంగా కనిపిస్తున్నది. జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ షమీ బౌలింగ్‌ను నడిపించనున్నారు. మూడో పేసర్‌గా ఇషాంత్‌కే ఎక్కువ అవకాశాలుండగా.. ఉమేశ్ బెంచ్‌కు పరిమితమవ్వొచ్చు. ఇక స్పిన్ విభాగంలో సీనియర్ రవిచంద్రన్ అశ్విన్, స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ ఒకరే ఉండే చాన్స్ ఉంది. బ్యాటింగ్ ఆడగలడం అశ్విన్‌కు అదనపు బలం. సొంతగడ్డపై విండీస్‌ను నిలువరించాలంటే భారత బౌలర్లు సమిష్టిగా రాణించాల్సిన అవసరం ఉంది.

**యువకులపైనే విండీస్ ఆశలు**

విండీస్ జట్టును టీమ్‌ఇండియా తక్కువ అంచనా వేయడానికి లేదు. బ్యాటింగ్‌లో విండీస్‌కు శాయ్ హోప్, క్యాంప్‌బెల్, హెట్‌మైర్ వంటి యువ ప్రతిభావంతులైన ఆటగాళ్లున్నారు. డారెన్ బ్రావో రూపంలో సీనియర్ ఉన్నాడు. అయితే ఈ మ్యాచ్‌లో అందరి దృష్టి భారీకాయుడైన రహ్‌కీమ్ కార్న్‌వాల్‌పైనే ఉంది. ఆరున్నర అడుగుల ఎత్తు, 140 కిలోల ఈ ఆటగాడికి స్పిన్‌తో పాటు లోయర్ ఆర్డర్‌లో బ్యాట్ ఝులిపించే సామర్థ్యముంది. ఈ మ్యాచ్‌లో చోటు దక్కించుకుంటే అతడే హైలైట్‌గా నిలవనున్నాడు.

**పిచ్, వాతావరణం**

మ్యాచ్‌కు వేదికైన అంటిగ్వాలో వాతావరణం సాధారణంగా మేఘావృతమై ఉండే అవకాశముంది. ఆట మూడో రోజు వర్షం పడే సూచనలు కనిపిస్తున్నాయి.

# చీఫ్ సెలెక్టర్‌గా కుంబ్లేనే బెస్ట్

## సెమీస్‌లో ధోనీని ముందుగా పంపాల్సింది



వీరేంద్ర సెహ్వాగ్

**న్యూఢిల్లీ :** టీమ్‌ఇండియా మాజీ కోచ్, లెజెండరీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే... జాతీయ జట్టు సెలెక్షన్ కమిటీ చైర్మన్ పదవికి సరైన వ్యక్తి అని మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని పెంచే సామర్థ్యం అతడికి ఉందని చెప్పాడు. అంతర్జాతీయ అనుభవంపై ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలోని ప్రస్తుత సెలెక్షన్ కమిటీ విమర్శలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో వీరూ ఈ వ్యాఖ్యలు చేయడం ఆసక్తికరంగా మారింది. బుధవారం ఓ యాప్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సెహ్వాగ్ అనేక అంశాలపై తన అభిప్రాయాలను తెలిపాడు. 'సెలెక్షన్ కమిటీ చైర్మన్ పదవికి అనిల్ కుంబ్లే సరైన అభ్యర్థి. తాను ఆడుతున్నప్పుడు సహచరులైన సచిన్, గంగూలీ, ద్రవిడ్‌లతో అతడు మాట్లాడగలడు... అలాగే కోచ్‌గా పని చేసిన అనుభవముండడంతో యువ ఆటగాళ్లతో మంచి సంబంధాలు ఉంటాయి. 2007-08లో ఆస్ట్రేలియాతో సిరీస్‌లో నేను పునరాగమనం చేసినప్పుడు కెప్టెన్‌గా ఉన్న అనిల్ డ్రెస్సింగ్ రూంకి వచ్చి.. తదుపరి రెండు సిరీస్‌లకు నిన్ను జట్టులో నుంచి తీసేయను అని చెప్పాడు. అలాంటి నమ్మకమే ఆటగాళ్లకు కావాల్సింది' అని సెహ్వాగ్ చెప్పాడు. అయితే ప్రస్తుతం ఇస్తున్న వేతనానికి కుంబ్లే ఈ పదవిలోకి వస్తాడని తాను అనుకోవడం లేదని వెల్లడించాడు. చీఫ్ సెలెక్టర్‌కు ఇచ్చే వేతనాన్ని పెంచితే ఎక్కువ మంది ఆ పదవిపై ఆసక్తి చూపే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డాడు. సెలెక్టర్‌గా ఉంటే ఎన్నో ఆంక్షలు ఉంటాయని, అందుకే తాను మాత్రం ఆ స్థానంపై ఆసక్తిగా లేనని చెప్పేశాడు. 2017లో కోచ్ పదవికి తనను దరఖాస్తు చేసుకోవాల్సిందిగా అప్పటి బీసీసీఐ సెక్రటరీ దివంగత ఎమ్‌వీ శ్రీధర్ కోరారని.. అందుకే అప్పుడు పోటీకి వచ్చానని సెహ్వాగ్ చెప్పాడు. ప్రస్తుతం ఎవరూ తనను సంప్రదించలేదని అందుకే కోచ్ స్థానానికి దరఖాస్తు చేసుకోలేదని వెల్లడించాడు. అలాగే ప్రపంచకప్ సెమీఫైనల్లో ధోనీని ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు పంపి ఉంటే బాగుండేదని వీరూ అభిప్రాయపడ్డాడు. ఐదుగురు బౌలర్లతో బరిలోకి దిగితే విండీస్‌తో గురువారం ప్రారంభమయ్యే టెస్టులో రోహిత్‌ను కాకుండా రహానేను తుది జట్టులోకి తీసుకోవాలని సూచించాడు. శ్రీశాంత్‌పై నిషేధం తొలగించడంపై హర్షం వ్యక్తం చేసిన సెహ్వాగ్.. అతడు దేశవాళీ క్రికెట్ ఆడాలని సూచించాడు. నాడా విధించిన వేర్‌అబౌట్స్ నిబంధన క్రికెటర్లకు ఇబ్బందికరమని, ఏ రోజు ఏ సమయంలో ఎక్కడుంటామో కచ్చితంగా చెప్పడం కష్టమని సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. నాడా పరిధిలోకి వచ్చేందుకు ఎన్నో ఏండ్లుగా తిరస్కరణ తెలిపిన బీసీసీఐ.. ఇటీవలే అంగీకరించిన విషయం తెలిసిందే.

## రాష్ట్ర స్థాయి టీ-10 బాలికల క్రికెట్ పోటీలు ప్రారంభం

**వనపర్తి రూరల్ :** వనపర్తి మండలంలోని మర్రికుంట ఎస్టీ బాలిక గురుకుల పాఠశాలలో రాష్ట్ర స్థాయి బాలికల టీ-10 క్రికెట్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. పోటీలను బాలికల క్రికెట్ అకాడమీ డైరెక్టర్ ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎనిమిది రీజినల్ కోఆర్డినేటర్ స్థాయి గురుకుల పాఠశాలల నుంచి ఎనిమిది జట్లు వచ్చాయని, అందరికీ అన్ని వసతులు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ మన్నన్, ఝాన్సీ, శివ, రాధిక, శివానీ తదితరులు పాల్గొన్నారు. తొలి రోజు మ్యాచ్‌ల్లో ఆదిలాబాద్‌పై మహబూబ్‌నగర్ 41 పరుగులతో, రంగారెడ్డి 10 పరుగులతో జయశంకర్ భూపలపల్లిపై, కరీంనగర్ 1 పరుగుతో మెదక్‌పై, ఖమ్మం 14 పరుగులతో నల్లగొండపై గెలిచాయి.

## ఫిజియో పోస్టుకు 16మంది

### నేడు సహాయక సిబ్బంది పేర్ల ప్రకటన!

**ముంబై :** టీమ్‌ఇండియా సహాయక సిబ్బంది నియామకం కోసం ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలు గురువారంతో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్ సహా జట్టు మేనేజర్ పోస్టుకు ఎంపికైన వారి పేర్లు వెలువడే అవకాశముంది. భారత జట్టు ఫిజియో స్థానం కోసం దరఖాస్తు చేసుకున్న 16 మంది బుధవారం ఇంటర్వ్యూలకు హాజరు కాగా.. ఫిట్‌నెస్ ట్రైనర్ పదవి కోసం 12 మంది వచ్చారు. ప్రస్తుతం ఆ స్థానాల్లో ఉన్న పాట్రిక్ ఫార్హాత్, శంకర్ బసు కొనసాగేందుకు ఆసక్తి చూపలేదు. సోమవారం ఎంపిక ప్రక్రియ ప్రారంభం కాగా బ్యాటింగ్ కోచ్ స్థానం కోసం ప్రస్తుత కోచ్ సంజయ్ బంగర్ సహా 14 మంది, బౌలింగ్ కోచ్ పదవి కోసం భరత్ అరుణ్ సహా 12 మంది ఇంటర్వ్యూలకు హాజరైన విషయం తెలిసిందే. అలాగే ఫీల్డింగ్ కోచ్ పదవి కోసం ప్రస్తుతమున్న ఆర్.శ్రీధర్, దక్షిణాఫ్రికా ఆల్‌టైం గ్రేట్ ఫీల్డర్ జాంటీ రోడ్స్‌తో పాటు మరో ఏడుగురు ఇంటర్వ్యూలకు వచ్చారు. జట్టు మేనేజర్ పదవి కోసం దరఖాస్తు చేసుకున్న 25మందిని ఎమ్మెస్కే బృందం గురువారం ఇంటర్వ్యూ చేశాక, ప్రక్రియ ముగియనుంది.

## రసవత్తరంగా చెస్ పోటీలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** టెట్రాసాఫ్ట్ మారియట్ గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నీ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. పోటీలకు తొలి రోజైన బుధవారం జరిగిన వేర్వేరు గేముల్లో ఆర్యమన్ సైన్(భారత్)..సిమ్రనోవ్ పావెల్(రష్యా) చేతిలో ఓడిపోయాడు. రాష్ట్రానికి చెందిన ఆదిత్య వరుణ్..అలెగ్జాండర్(రష్యా)పై పరాజయం ఎదుర్కొన్నాడు. మిగతా గేముల్లో అజయ్, ప్రళయ్ సాహు, సామల్ అన్షుమన్ ప్రత్యర్థుల చేతుల్లో ఓడిపోయారు. లక్ష్మణ్, కార్తికేయన్, రాజా రిత్విక్, రత్నాకరన్ విజయాలతో ముందంజ వేశారు.

## పేటీఎమ్‌కు మరో ఐదేండ్లు పొడిగింపు

**న్యూఢిల్లీ:** దేశవాళీ, అంతర్జాతీయ మ్యాచ్‌ల టైటిల్ స్పాన్సర్‌షిప్ హక్కులను బీసీసీఐ పునరుద్ధరించింది. ప్రస్తుత స్పాన్సర్‌గా కొనసాగుతున్న పేటీఎమ్ కంపెనీకి మరో ఐదేండ్లు పొడిగింపునిస్తూ బీసీసీఐ బుధవారం నిర్ణయం తీసుకుంది. బోర్డుతో కుదిరిన కొత్త ఒప్పందం ప్రకారం పేటీఎమ్ ఒక్కో మ్యాచ్‌కు రూ.3.80 కోట్లు చెల్లించనుంది. 2019-2023 సీజన్‌కు గాను పేటీఎమ్ కంపెనీ రూ.326.80 కోట్ల బిడ్ దాఖలు చేసిందని బీసీసీఐ ఒక ప్రకటనలో పేర్కొంది..

# భారత జట్ల జయభేరీ

## ఒలింపిక్ టెస్ట్ ఈవెంట్ ఫైనల్లో ఘన విజయం



**టోక్యో :** భారత హాకీ జట్లు అంతర్జాతీయ వేదికపై మరోసారి సత్తా చాటాయి. బుధవారమిక్కడ జరిగిన ఒలింపిక్స్ టెస్ట్ ఈవెంట్ ఫైనల్ మ్యాచ్‌ల్లో భారత పురుషుల, మహిళల జట్లు విజయం సాధించి, విజేతలుగా నిలిచాయి. న్యూజిలాండ్‌తో జరిగిన తుదిపోరులో పురుషుల జట్టు 5-0తో పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తే.. 2-1తో తేడాతో ఆతిథ్య జపాన్‌ను మహిళల టీం చిత్తుచేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్(7ని.), షంషేర్ సింగ్(18ని.), నీలకంఠ శర్మ(22ని.), గుర్‌సాహిబ్‌జీత్ సింగ్(26ని.), మన్‌దీప్ సింగ్(27ని.) చెరో గోల్ చేయడంతో మ్యాచ్ మొత్తం ఆధిపత్యం ప్రదర్శించిన భారత పురుషుల జట్టు న్యూజిలాండ్‌ను మట్టికరిపించి, గ్రూప్ దశలో పరాభవానికి ప్రతీకారం తీర్చుకుంది. ఇక మహిళల మ్యాచ్‌లో నవ్‌జోత్ కౌర్(11ని.) గోల్ చేసి భారత్ ఖాతా తెరిస్తే... ఆ తర్వాతి నిమిషానికే జపాన్ క్రీడాకారిణి నిమామీ షిమిజు గోల్ కొట్టి స్కోరును సమం చేసింది. ఆ తర్వాత మ్యాచ్ హోరాహోరీగా సాగగా.. 33వ నిమిషంలో లాల్రెమ్‌సియామీ అద్భుత షాట్‌తో బంతిని గోల్‌కోర్టులోకి తరలించి భారత్‌ను ముందంజలో నిలిపింది. చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకున్న టీమ్‌ఇండియా విజేతగా నిలిచింది.

## పాంథర్స్ అదుర్స్

**చెన్నై:** ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్) ఏడో సీజన్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ జట్టు అదరగొడుతున్నది. ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేస్తూ పాయింట్ల పట్టికలో టాప్‌లో ఉన్నది. బుధవారం ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో జైపూర్ 28-26 తేడాతో తమిళ్ తలైవాస్‌పై విజయం సాధించింది. పాయింట్, పాయింట్‌కు నువ్వానేనా అన్నట్లు సాగిన సమరంలో ఆఖరికి జైపూర్‌నే విజయం వరించింది. పాంథర్స్ తరపున రైడింగ్‌లో నీలేశ్ సాలుంకే(7), డిఫెన్స్‌లో విశాల్(4) రాణించారు. తలైవాస్ జట్టులో రాహుల్ చౌదరీ(6), వినీత్ శర్మ(3) ఆకట్టుకున్నారు. మరో మ్యాచ్‌లో పుణేరి పల్టాన్ 31-23తో డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరు బుల్స్‌పై గెలిచింది.



# బౌన్సర్ల యుద్ధమేనా

## నేటి నుంచి యాషెస్ మూడో టెస్టు



పైన్



ఆర్చర్

**లీడ్స్:** ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య పోరు తారా స్థాయికి చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఐదు టెస్టుల సిరీస్‌లో ఇప్పటికే 1-0 ఆధిక్యంలో ఉన్న ఆసీస్..ఇంగ్లండ్‌కు దీటైన పోటీనిస్తూ 18 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నది. గురువారం నుంచి ఇరు జట్ల మధ్య మూడో టెస్ట్‌కు తెరలేవబోతున్నది. గత టెస్ట్‌లో గాయపడ్డ స్టార్ బ్యాట్స్‌మన్ స్టీవ్ స్మిత్ లేకుండానే ఆసీస్ బరిలోకి దిగుతుండగా, ఆల్‌రౌండర్ జోఫ్రా ఆర్చర్‌పై ఇంగ్లండ్ భారీ ఆశలు పెట్టుకుంది. జట్టు బ్యాటింగ్‌కు ఆయువుపట్టులాంటి స్మిత్ దూరం కావడం ఆసీస్‌కు ఒక రకంగా దెబ్బే అయినా..తమ పదునైన పేస్ బలగంతో ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్ పనిపట్టాలని చూస్తున్నది. దీంతో ఇరు జట్ల మధ్య ఒక రకంగా బౌన్సర్ల యుద్ధం జరిగే అవకాశం కనిపిస్తున్నది. అయితే యాషెస్ సిరీస్ గెలుపే తమ ఏకైక లక్ష్యమని మిగతావన్నీ తదుపరి ఆసీస్ కోచ్ జస్టిన్ లాంగర్ అన్నాడు. అలాగనీ సిరీస్ సాధించేందుకు బౌన్సర్లు ఒక అస్త్రంగా పనికొస్తాయంటే దీటుగా సంధించేందుకు వెనుకాడబోమని, లేకపోతే తమ ప్రణాళికలకు అనుగుణంగా ముందుకెళ్తామని లాంగర్ అన్నాడు. మరోవైపు తమ స్ట్రైక్ బౌలర్ జేమ్స్ అండర్సన్ గైర్హాజరీలో ఇంగ్లండ్ బౌలింగ్ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్నది. సీనియర్ స్టూవర్ట్ బ్రాడ్ అంతోఇంతో రాణిస్తున్నా..అతనికి మిగతా బౌలర్ల నుంచి సరైన సహకారం కరువైంది. అరంగేట్రం టెస్ట్‌లో ఐదు వికెట్లతో అదరగొట్టిన ఆర్చర్‌పై ఇంగ్లండ్ భారీ ఆశలు పెట్టుకుంది. పదునైన పేస్‌కు స్వింగ్ జోడిస్తూ ఆర్చర్ వేస్తున్న బంతులు ఆసీస్ బ్యాట్స్‌మెన్ వెన్నుల్లో వణుకు పుట్టిస్తున్నాయి. హోరాహోరీగా సాగే మూడో టెస్ట్‌లో ఎవరిది పైచేయి అవుతుందో చూడాలి.

## 'ఆలోచన ధోరణి మారాలి'

**ముంబై, ఆగస్టు 21:** దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం నెలకొన్న విపత్కర పరిస్థితులపై సర్వత్రా వ్యక్తమవుతున్న విమర్శలపట్ల ముఖ్య ఆర్థిక సలహాదారు కే సుబ్రమణియన్ స్పందించారు. వృద్ధిరేటు పుంజుకోవాలంటే పెట్టుబడులు ఒక్కటే మార్గమన్నారు. ఈ విషయాన్ని కార్పొరేట్ ప్రపంచం, నిపుణులు, ఆర్థికవేత్తలు గుర్తిస్తే బాగుంటుందన్నారు. ముఖ్యంగా ప్రైవేట్ రంగంలో ఆలోచనా ధోరణి మారాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.





## రూ.39 వేల దిశగా పసిడి

- రూ.50 పెరిగి రూ.38,820కి తులం
- రూ.1,140 ఎగబాకిన కిలో వెండి

**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** పసిడి పరుగు ఇప్పట్లో ఆగేటట్లు కనిపించడం లేదు. రోజుకొక చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకుంటున్న అతి విలువైన లోహాలు బుధవారం మరో శిఖరాగ్రానికి చేరుకున్నాయి. ఆభరణాల వర్తకుల నుంచి వచ్చిన కొనుగోళ్ల మద్దతుతో ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర మరో రూ.50 అందుకొని రూ.38,820కి చేరుకున్నది. త్వరలో రూ.39 వేల మార్క్‌కు చేరుకునే అవకాశాలున్నాయని బులియన్ వర్తకులు వెల్లడించారు. వెండి ఏకంగా రూ.1,140 ఎగబాకి రూ.45,040 వద్ద ముగిసింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారులు కొనుగోళ్లకు మద్దతు చూపడంతో భారీగా పడిపోయిన మరుసటి రోజే ఎగబాకడం విశేషం. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ దేశీయంగా పెరుగడం విశేషం. మరోవైపు ఈక్విటీ మార్కెట్లు తగ్గుముఖం పట్టడం కూడా పసిడి ధరలు పెరుగడానికి పరోక్షంగా దోహదం చేసినట్లు బులియన్ వర్గాలు వెల్లడించాయి. న్యూయార్క్ బులియన్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 1,499.20 డాలర్లకు చేరుకోగా, వెండి 17.08 డాలర్లు పలికింది.

## భారత్ వృద్ధి అంచనాలో కోత

### ఏప్రిల్-జూన్‌లో 5.7 శాతానికి కుదించిన నోమురా

**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** భారత వృద్ధిరేటు అంచనాను 5.7 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రపంచ ఆర్థిక సేవల సంస్థ నోమురా వెల్లడించింది. వినిమయంలో నెలకొన్న మందకొడి, పెట్టుబడులు బలహీనంగా ఉండటం, సేవల రంగం నిరాశాజనక పనితీరు కారణంగా ఏప్రిల్-జూన్ మధ్యకాలంలో వృద్ధిలో కోత విధించినట్లు పేర్కొంది. జూలై-సెప్టెంబర్ మధ్యకాలంలో దేశ ఆర్థిక పరిస్థితులు కొద్దిగా మెరుగుపడే అవకాశాలు కనిపిస్తున్నాయని బుధవారం విడుదల చేసిన నివేదికలో తెలిపింది. కుటుంబాలు ఖర్చులను తగ్గించుకోవడానికి అధిక ప్రాధాన్యతనివ్వడంతో వినిమయం భారీగా పడిపోయిందని, దీనికి తోడు పెట్టుబడులు బలహీనంగా ఉండటం, సేవల రంగం కూడా నిరాశావాదంగా ఉండటం వృద్ధికి బ్రేకులు వేస్తున్నాయని నోమురా తన రీసర్చ్ నోట్‌లో పేర్కొంది. నోమురా కంపొజిట్ లీడింగ్ ఇండెక్స్(సీఎల్ఐ).. జూలై-సెప్టెంబర్ మధ్యకాలానికి 99.8 నుంచి 99.9కి పెరిగినట్లు తెలిపింది. పారిశ్రామిక పనితీరు ఆశాజనకంగా ఉండటం, ఈక్విటీ మార్కెట్లు కోలుకుంటుండటం, వడ్డీరేట్లు తగ్గుముఖం పట్టడం వృద్ధికి ఊతమివ్వనున్నాయని పేర్కొంది. దేశ ఆర్థిక వ్యవస్థపై ఆందోళన వ్యక్తంచేసిన నోమురా.. మందకొడి పరిస్థితుల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకునే అవకాశాలు లేవని స్పష్టంచేసింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ 6.8 శాతంగా నమోదైంది. 2014-15 తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి వృద్ధి. వినియోగదారుల్లో నమ్మకం సడలుతుండటం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు అస్థిరంగా ఉండటం, అంతర్జాతీయ వాణిజ్యంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, కరెన్సీ యుద్ధం కొనసాగుతుండటం వృద్ధిపై ప్రభావం చూపుతున్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో వృద్ధికి ఊతమివ్వడానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్..ఇండస్ట్రీ వర్గాలు, పలువురు ఉన్నతాధికారులతో పలుమార్లు సమావేశమయ్యారు. వినియోగదారుల డిమాండ్, ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించాలంటే ఉద్దీపనలు ప్రకటించాల్సిన అవసరం ఉన్నదని వారు అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది తొలి మూడు నెలల్లో నమోదైన 5.8 శాతం వృద్ధి కంటే రెండో త్రైమాసికంలో 5.7 శాతానికి తగ్గించినట్లు పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం(ఏప్రిల్-జూన్) మధ్యకాలానికి జీడీపీ గణాంకాలను కేంద్ర గణాంకాల శాఖ ఈ నెల 30న విడుదల చేయబోతున్నది. తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన ఆటోమొబైల్ రంగం, వేలాది మంది తమ ఉద్యోగాలు కోల్పోయారు.




# పార్లేకు మాంద్యం సెగ

## 10 వేల మంది సిబ్బందిపై వేటు!

### ఉత్పత్తిని ప్రభావితం చేస్తున్న అమ్మకాల లేమి

**బెంగళూరు, ఆగస్టు 21:**

మాయదారి మాంద్యం దేశ ఆర్థిక వ్యవస్థ ఉసురు తీస్తున్నది. మార్కెట్‌లో చోటు చేసుకుంటున్న మందగమనం ప్రభావం.. లక్షలాది మంది ఉపాధిని బలి తీసుకుంటున్నది. అమ్మకాలు లేక ఆటో రంగంలో 10 లక్షల ఉద్యోగాలు ప్రమాదంలో పడిన విషయం తెలిసిందే. ఇప్పటికే 2 లక్షలకుపైగా ఉద్యోగాలు పోయిన సంగతీ విదితమే. ఆసియా దేశాల్లో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా విరాజిల్లుతున్న భారత్‌లో మాంద్యం దెబ్బకు అన్ని రంగాలు విలవిలలాడిపోతున్నాయి మరి. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఇతర రంగాలనూ మాంద్యం సెగలు తాకుతున్నాయి. ప్రముఖ బిస్కెట్ల తయారీదారైన పార్లే ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్.. వచ్చే ఏడాది కాలంలో 10 వేల మందిని పనుల్లో నుంచి తొలగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. పార్లే వ్యాపారానికి ప్రధాన కేంద్రం గ్రామాలే. అయితే అక్కడ ప్రస్తుతం అమ్మకాలు అంతంతమాత్రంగానే నమోదవుతున్నాయి. ఈ డిమాండ్ లేమి సంస్థ ఉత్పత్తిని సహజంగానే ప్రభావితం చేస్తున్నది. బ్రిటానియా ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎండీ వరుణ్ బెర్రీ సైతం ప్రస్తుత మార్కెట్ పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




**ఉత్పత్తి తగ్గొచ్చు.. ఉద్యోగాలు పోవచ్చు**

గణనీయంగా పడిపోయిన బిస్కట్ల అమ్మకాలతో ఉత్పత్తి తగ్గి.. ఉద్యోగాలు పోవచ్చని పార్లే విభాగాధిపతి మయాంక్ షా అన్నారు. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఉత్పత్తిని తగ్గించే వీలుందన్న ఆయన 8 వేల నుంచి 10 వేల ఉద్యోగాలు పోయే అవకాశాలు లేకపోలేదని ముంబై నుంచి టెలిఫోన్‌లో మాట్లాడుతూ అన్నారు. 'పరిస్థితులు చాలా భయంకరంగా ఉన్నాయి. ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే మొత్తం వ్యాపార, పారిశ్రామిక రంగాలకే ముప్పు. ప్రధానంగా ఆర్థిక వ్యవస్థకు ఉద్దీపనలు అందకపోతే ఉద్యోగాలు దూరం కాక తప్పదు. 90 ఏండ్ల క్రితం 1929లో పార్లేను స్థాపించగా, దేశవ్యాప్తంగా సంస్థకు 10 సొంత ఉత్పాదక కేంద్రాలు, 125 కాంట్రాక్టు తయారీ ప్లాంట్లున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు లక్ష మందికి ఉపాధి లభిస్తున్నది. కాగా, 'పార్లే-జీ'తోపాటు మరికొన్ని రకాల బిస్కట్ల అమ్మకాలు దారుణంగా దిగజారాయని, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) ప్రభావం కూడా ఉందని షా చెప్పారు. దీనివల్ల గ్రామాల్లోని అల్పాదాయ వర్గాలు తమకు దూరమయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లే వార్షిక ఆదాయం 1.4 బిలియన్ డాలర్లకుపైగా ఉన్నది. ఇందులో సగానికిపైగా గ్రామీణ ప్రాంతాల నుంచే వస్తున్నదని షా చెప్పారు. 'జీఎస్టీతో పెరిగిన బిస్కట్ ప్యాకెట్ ధర.. మా మెజారిటీ కస్టమర్లను నొప్పించింది' అన్నారు. ప్రపంచంలోనే పార్లే-జీ అత్యంత ఎక్కువగా అమ్ముడయ్యే బిస్కట్ల బ్రాండ్‌గా ఉన్నది.

### ఉద్దీపనల్ని ప్రకటించాలి

మాంద్యం ప్రభావం ఉక్కు నుంచి ఉల్లిగడ్డదాకా కనిపిస్తుండటంతో ఉద్దీపనలు కావాలంటూ కేంద్రాన్ని పరిశ్రమ కోరుతున్నది. నానాటికీ బలహీనపడుతున్న వృద్ధిరేటును బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు ఎంతో అవసరమని వ్యాపార, పారిశ్రామిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఏ రంగంలో చూసినా అమ్మకాలు లేక దిగాలు పడిన వాతావరణమే దర్శనమిస్తున్నదని, ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే మొత్తం దేశ ఆర్థిక వ్యవస్థకే ప్రమాదం అని పలువురు నిపుణులూ హెచ్చరిస్తున్నారు. పన్నుల మినహాయింపు, ఇతరత్రా ప్రోత్సాహకాలు మార్కెట్‌ను తిరిగి ఉత్సాహవంతంగా చేయగలవని సూచిస్తున్నారు. అదేవిధంగా వినియోగదారుల కొనుగోళ్ల శక్తి పెరిగేలా నిర్ణయాలు తీసుకోవాలని సలహా ఇస్తున్నారు. ఉద్దీపనలు ఆలస్యమయ్యేకొద్దీ అనర్థాలు తప్పవని అంటున్నారు. మొత్తానికి వచ్చే ఐదేండ్లలో దేశ ఆర్థిక వ్యవస్థను 5 లక్షల కోట్ల డాలర్లకు చేర్చాలన్న లక్ష్యంతో మోదీ సర్కారు ముందుకెళ్తున్న క్రమంలో నిరుద్యోగ సమస్య తీవ్రమైతే కష్టాలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

# ఉద్యోగులకు నిరాశ

- 2018-19లో వేతనాల పెంపు అత్యల్పం
- గత దశాబ్ద కాలంలో ఇదే తక్కువ
- ప్రైవేట్ రంగంలో జాబ్ మార్కెట్ ఆందోళనకరం
- స్పష్టం చేస్తున్న సీఎంఐఈ గణాంకాలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** జీతాలు పెరుగుతాయని సంబురపడిన సగటు ఉద్యోగులను ఆర్థిక మాంద్యం కాటేసింది. ఆ రంగం.. ఈ రంగం.. అనే తేడా లేకుండా అన్ని రంగాల్లోనూ అమ్మకాలు దెబ్బ తినడంతో గత ఆర్థిక సంవత్సరం (2018-19) జీతాల పెంపును పక్కన పెట్టేశాయి మెజారిటీ సంస్థలు. ముఖ్యంగా ప్రైవేట్ రంగ కంపెనీలు.. వేతనాల విషయంలో ఎంతో వ్యూహాత్మకంగా వ్యవహరించాయి. దీంతో గడిచిన పదేండ్లలోనే నిరుడు ఉద్యోగులకు అత్యంత గడ్డు సంవత్సరంగా గడిచిపోయింది. 2009-10 ఆర్థిక సంవత్సరం తర్వాత మళ్లీ 2018-19 ఆర్థిక సంవత్సరమే వేతనాల్లో వృద్ధి దారుణంగా నమోదైందని హిందుస్థాన్ టైమ్స్ విశ్లేషించింది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) ఆధ్వర్యంలోని సమాచారం ద్వారా ఈ మేరకు తెలియజేసింది. దేశీయ కంపెనీల ఆర్థిక పరిస్థితులపై సీఎంఐఈ డేటా ఆధారంగా హిందుస్థాన్ టైమ్స్ ఈ విశ్లేషణను అందించింది.

**ఉద్యోగ ముఖచిత్రం ఆందోళనకరం**

వ్యాపారం మందగించిన నేపథ్యంలో వేలాది మందికి ఉద్యోగాలు దూరమవుతుంటే.. లక్షలాది మంది జీతాల్లో వృద్ధి కానరావడం లేదు. 2017-18 ఆర్థిక సంవత్సరానికిగాను వచ్చిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్).. దేశంలో నిరుద్యోగ రేటు 6.1 శాతంగా ఉన్నట్లు గుర్తించింది. ఇది ఆల్‌టైమ్ హై కావడం గమనార్హం. ఇక స్త్రీ, పురుష క్రమానుసారం చూస్తే 1977-78 నుంచి పురుష ఉద్యోగుల్లో, 1983 నుంచి స్త్రీ ఉద్యోగుల్లో గరిష్ఠం. మొత్తం నిరుద్యోగుల సంఖ్య 2.85 కోట్లుగా ఉండగా, 2011-12తో పోల్చితే ఇది రెట్టింపు అవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. నాడు 1.8 కోట్లుగానే ఉన్నారు మరి. కేవలం ఆరేండ్లలో 1.8 కోట్ల మంది నిరుద్యోగులు దేశంలో పెరిగిపోయారు. మరోవైపు నియామకాలూ దారుణంగా పడిపోయాయి. బ్యాంకింగ్, బీమా, ఆటో, లాజిస్టిక్స్, ఇన్‌ఫ్రా రంగాల్లో కొత్త కొలువులు చాలావరకు క్షీణించాయని కేర్ రేటింగ్స్ తెలిపింది.

**మార్కెట్‌లో నిస్తేజం**

మార్కెట్‌లో నెలకొన్న నిస్తేజకర పరిస్థితే.. ఉద్యోగుల వేతనాల పెంపునకు ప్రధాన అవరోధంగా నిలిచిందని సీఎంఐఈ అభిప్రాయపడింది. గత ఆర్థిక సంవత్సరం 4,953 సంస్థల ఆర్థిక స్థితిగతులను సీఎంఐఈ పరిశీలించింది. ఈ సంస్థల అమ్మకాలు వరుసగా నాలుగేండ్లు పడిపోయినట్లు గుర్తించింది. 2012-13 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ క్షీణత ప్రారంభమైంది. అయితే 2016-17 ఆర్థిక సంవత్సరంలో అమ్మకాలు కాస్త పెరుగగా, 2017-18లోనూ ఆ ఉత్సాహం కొనసాగింది. కానీ ఆ తర్వాత మళ్లీ మందగమనం తలెత్తగా, అమ్మకాల్లో వృద్ధి తాత్కాలికమేనని తేలిపోయింది. ఈ క్రమంలోనే 2018-19లో మొత్తం అమ్మకాల ఆదాయంలో వేతనాల వాటా శాతం ఏడేండ్లలో తొలిసారి పతనాన్ని చవిచూసింది.




## కాఫీ డేపై ఐటీసీ దృష్టి!

- వాటాను కొనుగోలు చేయడానికి ప్రయత్నాలు ముమ్మరం

**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** ఆసియాలో అతిపెద్ద సిగరెట్ల తయారీ సంస్థ ఐటీసీ లిమిటెడ్..కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్‌లో వాటా కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తున్నది. ఐటీసీకి చెందిన క్లాసిక్, గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్లను కాఫీ డే ద్వారా యాక్సెస్ కల్పించుకోవాలనే ఉద్దేశంతో ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన కాఫీ డేలో కొంత మేర వాటా కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపినట్లు వార్తలు గుప్పుమన్నాయి. రుణాలు ఎక్కువకావడంతో కాఫీ డే వ్యవస్థాపకుడు వీజీ సిద్దార్థ ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. కాఫీ డేలో వాటా కొనుగోలు చేయడానికి ఐటీసీ ఆసక్తి చూపిన మాట వాస్తవమేనని, కానీ దీంట్లో ఎలాంటి పురోగతి లేదని బ్లూంబర్గ్‌కు కంపెనీ ప్రతినిధి ఒకరు తెలిపారు. దీనిపై కాఫీ డే ప్రతినిధి స్పందించడానికి నిరాకరించారు. మరోవైపు కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్‌లో వాటా కొనుగోలు చేయనున్నట్లు వచ్చిన వార్తలను ఐటీసీ ప్రతినిధి కొట్టిపారేశారు. ప్రస్తుతం కాఫీ డేకు రూ.4,970 కోట్ల స్థాయిలో అప్పు ఉన్నది. గతవారంలో బెంగళూరులో ఉన్న గ్లోబల్ విలేజ్ టెక్ పార్క్‌ను బ్లాక్‌స్టోన్‌కు విక్రయించడంతో రూ.3 వేల కోట్లకు పైగా నిధులు సమకూరాయి.

**మార్కెట్లోకి 3డీ నోట్‌బుక్స్..**

క్లాస్‌మేట్ పేరుతో నోట్‌బుక్స్‌లను విక్రయిస్తున్న ఐటీసీ..తాజా ఆవిష్కరణలో భాగంగా మార్కెట్లోకి సరికొత్త 3డీ నోట్స్‌బుక్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. యువతను లక్ష్యంగా చేసుకొని రూపొందించిన ఈ నోట్‌బుక్స్‌ను అందరిని ఆకట్టుకోనున్నాయని కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ శైలేంద్ర త్యాగి తెలిపారు. ప్రస్తుతం రూ.6 వేల కోట్ల స్థాయిలో ఉన్న నోట్‌బుక్స్ మార్కెట్లో సంస్థకు 25 శాతం(రూ. 1.500 కోట్లు) వాటా ఉండగా, ఈ నూతన ఆవిష్కరణలతో మరింత పెరిగే అవకాశం ఉన్నదన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఇండస్ట్రీ వృద్ధి 4-5 శాతానికి పరిమితమవగా, సంస్థ రెండంకెల పనితీరు కనబరిచిందని, ఈయేడు కూడా మరింత పెరిగేదానిపై ఆయన గట్టి నమ్మకాన్ని వ్యక్తంచేశారు. ఈ 3డీ నోట్‌బుక్స్ దేశవ్యాప్తంగా అతిపెద్ద స్టేషనరీ అవుట్‌లెట్లతోపాటు ఆన్‌లైన్ సంస్థలైన అమెజాన్, బిగ్ బాస్కెట్లలో కూడా లభించనున్నాయి.

## పవర్‌గ్రిడ్ సీఎండీగా శ్రీకాంత్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పవర్‌గ్రిడ్) సీఎండీగా కే శ్రీకాంత్ బుధవారం ఢిల్లీలో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు పవర్‌గ్రిడ్‌లో ఫైనాన్స్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. విద్యుత్ రంగంలో 30 సంవత్సరాలకుపైగా వివిధస్థాయిల్లో పనిచేశారు.

## ఓఎఫ్‌బీ సిబ్బంది సమ్మె

- కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా..

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశ రక్షణరంగ అవసరాలు, ఇతర అంశాలపై నిపుణుల కమిటీల సూచనల మేరకు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డును (ఓఎఫ్‌బీ) కార్పొరేటీకరిస్తూ రక్షణశాఖ నిర్ణయం తీసుకున్నది. బోర్డును ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ కార్పొరేషన్ లిమిటెడ్‌గా మార్చాలని నిర్ణయించినట్టు రక్షణశాఖ వెల్లడించింది. ఓఎఫ్‌బీ పరిధిలో దేశవ్యాప్తంగా ఉన్న 41 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, తొమ్మిది శిక్షణ కేంద్రాలు, మూడు రీజినల్ మార్కెటింగ్ సెంటర్లు, నాలుగు రీజినల్ కంట్రోలర్లు కలిపి ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌కు అవసరమైన యుద్ధట్యాంకులు, ఆర్టిలరీ గన్స్, సాధారణ తుపాకులు, ఇతర యుద్ధ సామగ్రిని తయారుచేస్తున్నాయి. దీనిని వ్యతిరేకిస్తూ గుర్తింపు పొందిన మూడు ఫెడరేషన్లు ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం నుంచి నెలరోజుల పాటు సమ్మెకు దిగుతున్నట్టు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల బోర్డు చైర్మన్ సౌరభ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.



హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన షోరూంను ప్రారంభించిన అనంతరం కార్లను పరిశీలిస్తున్న కియా మోటర్స్ ఎండీ కూఖియన్ శిమ్, ఎస్బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ ఓపీ మిశ్రా. ఇటీవల మార్కెట్లోకి విడుదల చేసిన సెల్టాస్ కారు ఈ షోరూంలో అందుబాటులోకి ఉంచింది. ఇప్పటి వరకు ఈ కారుకోసం ఆరు వేలకు పైగా బుకింగ్‌లు వచ్చాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

## మారుతి సరికొత్త ఎక్స్‌ఎల్6

- ప్రారంభ ధర రూ.9.79 లక్షలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** కార్ల తయారీలో అగ్రగామి సంస్థ మారుతి సుజుకీ..ప్రీమియం సెగ్మెంట్‌లో వాటాను మరింత పెంచుకోవడానికి సరికొత్త మల్టీ-పర్పస్ వాహనమైన ఎక్స్‌ఎల్6ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రూ.9.79 లక్షల నుంచి రూ.11.46 లక్షల మధ్యలో ఈ కారు ధరను నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంకు సంబంధించినవి. 1.5 లీటర్ల పెట్రోల్ ఇంజిన్ కలిగిన ఈ కారులో లిథియం అయాన్ బ్యాటరీ హైబ్రిడ్ సిస్టమ్ కూడా ఉన్నది. ఐదు స్పీడ్ మాన్యువల్, 4 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌ను ఎంపిక చేసుకునే అవకాశం కొనుగోలుదారులకు కంపెనీ కల్పించింది. వీటిలో మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ కలిగిన కారు రూ.9.79 లక్షల నుంచి రూ.10.36 లక్షల లోపు లభించనుండగా, ఆటోమేటిక్ వెర్షన్ రూ.10.89 లక్షల నుంచి రూ.11.46 లక్షల లోపు నిర్ణయించింది. అరుగురు కూర్చోవడానికి వీలుండే ఈ కారు దేశవ్యాప్తంగా 200 నగరాల్లో ఉన్న 364 నెక్సా షోరూంలలో బుధవారం నుంచి లభించనున్నదని మారుతి సుజుకీ ఇండియా ఎండీ, సీఈవో కెనిచి అయుకవా తెలిపారు. ప్రీమియం మల్టీ పర్పస్ వాహన( ఎంపీవీఎస్) పరిధిని పెంచుకోవాలనే ఉద్దేశంతో ఈ కారును విడుదల చేసినట్లు, ముఖ్యంగా వినియోగదారులు కోరుకుంటున్న విధంగా ఈ వాహనాన్ని రూపొందించినట్లు చెప్పారు. బీఎస్-6 ప్రమాణాలకు తగ్గట్టుగా రూపొందించిన ఏడో మోడల్ ఈ కారు కావడం విశేషం. దేశీయ ఆటోమొబైల్ రంగం ఇప్పుడిప్పుడే రూపాంతరం చెందుతున్నదని, ముఖ్యంగా నూతన టెక్నాలజీ, పాలసీ, మార్గదర్శకాలకు తగ్గట్టుగా వాహనాలను రూపొందించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఆటోమొబైల్ రంగం నిలకడైన వృద్ధిని సాధించాలంటే జీఎస్టీ రేటును తగ్గించాలని ఆయన సూచించారు.




## రూ.కోటి నజరానా

- ఇన్‌సైడర్ ట్రేడింగ్ సమాచారమిచ్చేవారికి ప్రకటించిన సెబీ
- మున్సిపల్ బాండ్ల జారీకి స్మార్ట్ సిటీలకు అనుమతి

**ముంబై, ఆగస్టు 21:** ఇన్‌సైడర్ ట్రేడింగ్ సమాచారం ఇచ్చినవారికి కోటి రూపాయల వరకు నజరానా ఇస్తామని స్టాక్ మార్కెట్ రెగ్యులేటర్ సెబీ బుధవారం ప్రకటించింది. విశ్వసనీయ సమాచారమిచ్చే ఇన్ఫార్మర్లకు ఈ నజరానా ఉంటుందని స్పష్టం చేసింది. ఇన్ఫార్మర్ల కోసం ప్రత్యేకంగా ఓ హాట్‌లైన్‌నూ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇక్కడ సెబీ బోర్డు సమావేశం జరుగగా, ఇందులో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరుల (ఎఫ్‌పీఐ) కోసం కేవైసీ నిబంధనలను సరళతరం చేసిన సెబీ.. 'మున్సిపల్ బాండ్ల' జారీ ద్వారా స్మార్ట్ సిటీలు నిధులను సమీకరించేందుకు నిబంధనలను సడలించింది. లిస్టింగ్ సంస్థల బైబ్యాక్ షేర్ల నిబంధనలనూ సులభతరం చేసింది. హౌజింగ్ ఫైనాన్స్, ఎన్‌బీఎఫ్‌సీల రంగాల్లో అనుబంధ సంస్థలున్న కంపెనీలకు ఈ నిర్ణయం కలిసిరానున్నది. అలాగే ఈమధ్య భారీ సంస్థలు ఒక్కసారిగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్న నేపథ్యంలో పూర్తి రుణ వివరాలను రేటింగ్ ఏజెన్సీలతో తప్పక పంచుకునేలా నిబంధనలను సెబీ కఠినతరం చేసింది. అంతేగాక మ్యూచువల్ ఫండ్ మేనేజర్లు లిస్టెడ్ సెక్యూరిటీల్లో మాత్రమే పెట్టుబడి పెట్టాలని సెబీ సూచించింది. ఏడాది తర్వాత ప్రధాన స్టాక్ ఎక్స్ఛేంజ్ బోర్డుకు మారేందుకు స్టార్టప్ నిబంధనలను సడలించింది.

## భారీగా తగ్గిన మొబైల్ డాటా చార్జీలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** గడిచిన ఐదేండ్లకాలంలో దేశీయంగా మొబైల్ డాటా చార్జీలు 95 శాతం తగ్గి గిగాబైట్ ధర రూ.11.78కి పడిపోయినట్లు టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ తాజాగా వెల్లడించింది. అయినప్పటికీ కంపెనీల ఆదాయం రెండున్నరెట్లు పెరిగి రూ.54,671 కోట్లకు చేరుకున్నాయి. ఈ సమయంలో డాటా వినిమయం 56 రెట్లు పెరిగి 46,404 మిలియన్ల జీబీలకు చేరుకున్నట్లు తెలిపింది. 2014లో ఇది 828 మిలియన్ల జీబీగా ఉన్నది. సరాసరిగా ఒక్కొక్కరి డాటా వినిమయం భారీగా పెరిగి 7.6 జీబీలకు చేరింది. ఐదేండ్లక్రితం ఇది 0.27 జీబీలుగా ఉన్నది. 2017లో 20,092 మిలియన్ల జీబీల వైర్‌లెస్ డాటా వినిమయం ఉండగా, ఆ మరుసటి ఏడాదికి రెండు రెట్లు కంటే అధికంగా పెరిగి 46,404 మిలియన్ల జీబీలకు చేరింది. 2014లో ఇది 828 మిలియన్ల జీబీలుగా ఉన్నది. 2014లో ఒక్కో వినియోగదారుడి నుంచి రూ.71.25 ఆదాయం సమకూరగా, 2018 నాటికి ఇది రూ.90.02కి పెరిగింది. వైర్‌లెస్ టాడా వినిమయం ద్వారా టెలికం సంస్థలకు రూ.38,882 కోట్ల ఆదాయం లభించగా, 2018 నాటికి ఇది రూ.54,671 కోట్లకు చేరింది. 2014లో ఒక్క జీబీ డాటాకు అయ్యే ఖర్చు రూ.269 కాగా, 2015లో ఇది రూ.226కి తగ్గింది. ఆ తర్వాతి క్రమంలో 4జీ రంగ ప్రవేశం చేయడంతో జీబీ డాటా రూ.75.57కి తగ్గింది.



బుధవారం తన పుట్టినరోజు సందర్భంగా ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకుంటున్న టీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్

## హైదరాబాదీల ఆతిథ్యం బాగుంది

**బాధ్యతల స్వీకరణలో అమెరికా కాన్సులేట్ జనరల్ జోయల్ రీఫ్‌మన్ ప్రశంస**



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** యూఎస్ కాన్సులేట్ జనరల్‌గా హైదరాబాద్‌కు రావడం ఎంతో ఆనందంగా ఉన్నదని, ఇక్కడి ప్రజల ఆతిథ్యం బాగుందని హైదరాబాద్‌లో అమెరికా కాన్సులేట్ జనరల్ జోయ ల్ రీఫ్‌మన్ ప్రశంసించారు. బుధవారం ఆ యన హైదరాబాద్‌లో అమెరికా కాన్సులేట్ జనరల్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. అమెరికా, భారత్ భాగస్వామ్యం దృఢం గా ఉన్నదని, రక్షణ, పారిశ్రామిక వ్యవహారాల్లో చక్కటి సంబంధాలు నెలకొన్నాయన్నారు. ఇరుదేశాలు మహిళా సాధికారత కోసం పనిచేస్తున్నాయని కొనియాడారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా ప్రజలతో కలిసి పనిచేయడం గర్వంగా ఉన్నదని సంతోషం వ్యక్తంచేశారు.

## డిజిటల్ తెలంగాణే లక్ష్యం

- గూగుల్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'డిజిటల్ తెలంగాణ' లక్ష్యంగా ముందుకుసాగుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించేందుకు గూగుల్ సంస్థ ముందుకొచ్చింది. ఆన్‌లైన్‌లో స్థానిక భాషలోనే విషయాలను పొందడానికి, రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ పరివర్తనకు మద్దతు ఇవ్వడానికి తెలంగాణ ప్రభుత్వంతో బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నది. స్థానిక భాషలోనే సమాచారాన్ని పొందేందుకు నవ్‌లేఖ అనే కొత్త టూల్‌ను ప్రవేశపెడుతున్నది. గూగుల్ సంస్థ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నది. ఈ సందర్భంగా తెలంగాణ ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ మాట్లాడుతూ.. గూగుల్ ఇప్పటికే తమ కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించి తెలంగాణకు విశ్వసనీయ భాగస్వామిగా ఉన్నదని తెలిపారు. త్వరలో రెండో అతిపెద్ద క్యాంపస్‌ను ఏర్పాటుచేసే పనిలో ఉన్నదని చెప్పారు. రాష్ట్ర ప్రజలు ఇంటర్నెట్ ద్వారా స్థానిక భాషలో సమాచారం పొందడానికి ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గూగుల్ ఇండియా అండ్ సౌత్ ఏషియా డైరెక్టర్ చేతన్ కృష్ణస్వామి పాల్గొని ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

## వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం అధ్యక్షుడిగా విద్యాసాగర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ బీ విద్యాసాగర్ మళ్లీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలిగా కే ఝాన్సీరాణి, ప్రధాన కార్యదర్శిగా పీ రంజిత్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా పవన్ చంద్రారెడ్డి, కోశాధికారిగా మాధవీలత, సభ్యులుగా అంజయ్య, బీవీ వరప్రసాద్, సుజాత, ఎండీ అలీబాబా, మురళీ ఎన్నికయ్యారు.



# మరోసారి సత్తాచాటిన ఎస్టీపీపీ

- 91.74 శాతం పీఎల్‌ఎఫ్‌తో జాతీయస్థాయిలో 5వ స్థానం
- రెండోసారి ఘనత సాధించిన సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం
- ఉద్యోగులు, అధికారులకు సింగరేణి సీఎండీ శ్రీధర్ అభినందనలు



మంచిర్యాల జిల్లా జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం

**హైదరాబాద్, మంచిర్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** మంచిర్యాల జిల్లా జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎస్టీపీపీ) మరోసారి జాతీయస్థాయిలో తనసత్తా చాటింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు నాలుగు నెలల కాలంలో 91.74 శాతం పీఎల్‌ఎఫ్ (ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్) సాధించి దేశంలోని అత్యధిక పీఎల్‌ఎఫ్ సాధించిన 25 థర్మల్ విద్యుత్‌కేంద్రాల్లో ఐదో స్థానంలో నిలిచింది. ఎస్టీపీపీ జాతీయస్థాయిలో ఐదోస్థానం సాధించడం ఇది రెండోసారి. 2017-18లో 91.09 పీఎల్‌ఎఫ్ సాధించి ఐదోస్థానం నిలిచింది. 2017న ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు 9 నెలల కాలంలో 90.18 పీఎల్‌ఎఫ్‌తో జాతీయస్థాయిలో నాలుగోస్థానం సాధించింది. ఈ ఏడాది నాలుగునెలల కాలంలో ఎస్టీపీసీ 3,223 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి 3,038 మిలియన్ యూనిట్లను తెలంగాణ రాష్ట్ర అవసరాల కోసం గజ్వేల్‌లోని పవర్‌గ్రిడ్‌కు సరఫరా చేసింది. 96.46 శాతం పీఎల్‌ఎఫ్‌తో బుడ్గె థర్మల్ విద్యుత్ కేంద్రం (పశ్చిమ బెంగాల్) జాతీయస్థాయిలో మొదటిస్థానం సాధించగా, 96.30 శాతంతో తాల్చేరు థర్మల్ విద్యుత్ కేంద్రం (ఒడిశా) ద్వితీయ, 94.34శాతంతో సాంతాల్దీహ్ థర్మల్ విద్యుత్ కేంద్రం (పశ్చిమబెంగాల్) మూడు, 93.87శాతంతో ససాన్ థర్మల్ విద్యుత్ కేంద్రం (రిలయన్స్-మధ్యప్రదేశ్) నాలుగో స్థానంలో నిలిచాయి. ఎస్టీపీసీ ప్రారంభం నుంచి చక్కని పనితీరుతో ఆదర్శవంతంగా నిలుస్తోంది. ప్లాంటు నిర్మాణాన్ని అత్యంత వేగంగా పూర్తి చేయించిన సీఎండీ శ్రీధర్ ప్లాంటు ప్రారంభమైన తర్వాత నెలవారీ సమీక్షలు జరుపుతూ స్టేషన్ సజావుగా నడిచేందుకు కృషి చేస్తున్నారు. 2018, ఫిబ్రవరి వందశాతం పైబడి పీఎల్‌ఎఫ్ సాధించింది. రెండుయూనిట్లలో యూనిట్-2 ఇప్పటికే ఎనిమిదిసార్లు, యూనిట్ 1 ఐదుసార్లు వందశాతం పీఎల్‌ఎఫ్ సాధించాయి. 2017 ప్రారంభమైన ఈ ప్లాంటులో ఈ ఏడాది ఆగస్టు 20 వరకు 26,266 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి తెలంగాణ అవసరాల నిమిత్తం 24,688 మిలియన్ యూనిట్లను గ్రిడ్‌కు సరఫరాచేశారు.

**నంబర్‌వన్ స్థానానికి ఎదగాలి: సీఎండీ ఎన్ శ్రీధర్**

తెలంగాణ రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడంలో భాగంగా సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం అత్యధిక పీఎల్‌ఎఫ్‌తో విద్యుత్‌ను అందిస్తూ పురోగమించాలి. ప్లాంటులోని ఉద్యోగులు, అధికారులకు నా అభినందనలు. ఇదే ఒరవడితో మంచి ఉత్పాదకతతో పని చేస్తూ జాతీయ స్థాయిలో నంబర్‌వన్‌గా నిలవడానికి కృషిచేయాలి.




హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఐహెచ్‌ఎస్ ప్రధాన పరిశోధకుడు ఉపేంద్రకౌల్

## చాపకింద నీరులా హై బీపీ

- గుండె, కిడ్నీ సంబంధ వ్యాధులకు ప్రధానకారణం
- డయాలసిస్‌పైనే 2.5 లక్షల మంది
- ఇండియా హార్ట్ స్టడీ అధ్యయనంలో వెల్లడి

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** అధిక రక్తపోటు చాపకిందనీరులా వ్యాపిస్తున్నది.. గుండె, మూత్రపిండాల సంబంధిత వ్యాధులకు ప్రధాన కారణమవుతున్నది.. మధుమేహం మాదిరిగానే అధిక రక్తపోటు కూడా సాధారణమైపోయిందని, అయితే చాలామందిలో తమకు అధిక రక్తపోటు ఉన్న విషయం తెలియడం లేదని 'ఇండియా హార్ట్ స్టడీ'(ఐహెచ్‌ఎస్) నిర్వహించిన అధ్యయనాల్లో వెల్లడయింది. బుధవారం హోటల్ తాజ్‌కృష్ణాలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఐహెచ్‌ఎస్ ప్రధాన పరిశోధకుడు, అకాడమిక్స్ అండ్ రీసెర్చ్-బీహెచ్‌ఎంఆర్‌సీ చైర్మన్ డాక్టర్ ఉపేంద్రకౌల్, డచ్‌లోని మాస్ట్రిచ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కార్డియోవాస్క్యులర్ డాక్టర్ విల్లెం వెర్బెక్, మెడికల్ ఎరిస్ లైఫ్‌సైన్సెస్ అధ్యక్షుడు డాక్టర్ విరాజ్ సువర్ణ, అపోలో దవాఖాన కార్డియాలజిస్టు డాక్టర్ సునీల్‌కపూర్, ఉస్మానియా నెఫ్రాలజీ విభాగం అధిపతి డాక్టర్ మనీషాసాహె ఐహెచ్‌ఎస్ జరిపిన అధ్యయనం వివరాలను వెల్లడించారు. దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో 18వేల మందిపై 1,233 మంది వైద్యులు తొమ్మిది నెలల పాటు అధిక రక్తపోటుపై అధ్యయనం చేసినట్టు తెలిపారు. ఒక్కొక్కరిపై రోజుకు నాలుగు పర్యాయాల చొప్పున ఏడురోజుల పాటు అధ్యయనం చేసినట్టు వివరించారు. ఈ అధ్యయనంలో దేశవ్యాప్తంగా 42 శాతం మందిలో తొలిసారి వైద్యుడిని సంప్రదించినప్పుడు మాస్క్డ్ హైపర్ టెన్షన్, వైట్-కోట్ హైపర్‌టెన్షన్ ఏర్పడినట్టు తేలిందని చెప్పారు. ఉదయం కంటే సాయంత్రం వేళలో ఎక్కువగా అత్యధిక రక్తపోటు ఏర్పడుతున్నట్టు వెల్లడైందన్నారు. జీవన విధానం, ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిళ్లు, తీరికలేని జీవనం తదితరాలు అధిక రక్తపోటుకు కారణాలని వివరించారు. దేశంలో 2.5 లక్షలమంది డయాలసిస్‌పై జీవిస్తున్నారని ఉస్మానియా నెఫ్రాలజీ విభాగం అధిపతి డాక్టర్ మనీషా సాహెల్ తెలిపారు. మధుమేహం ఉన్నవారు ఎక్కువగా జాగ్రత్తలు తీసుకుంటుండగా బీపీ బాధితులే నిర్లక్ష్యంగా ఉంటున్నారని వాపోయారు. మధుమేహంపై చాలా అధ్యయనాలు జరిగినా.. హైపర్‌టెన్షన్‌పై ప్రపంచవ్యాప్తంగా ఒక్క అధ్యయనమూ జరుగలేదని డాక్టర్ విరాజ్ సువర్ణ, డాక్టర్ ఉపేంద్ర తెలిపారు. ఈ అధ్యయనాలను అంతర్జాతీయ జనరల్స్‌లో పొందుపర్చనున్నట్టు వారు వెల్లడించారు.

**తెలంగాణలో 38 ఏండ్ల వయస్సు వారిలోనే..**

దేశంలోని ఇతరరాష్ట్రాల్లో 40 ఏండ్ల వయస్సు వారిలో ఎక్కువగా అధిక రక్తపోటు సమస్య ఉండగా.. తెలంగాణలో 36-38 ఏండ్ల వయస్సువారిలోనే సమస్య మొదలైనట్టు వైద్యనిపుణులు వెల్లడించారు. రాష్ట్రంలో 36 శాతం మందికి వైట్-కోటెడ్ హైపర్ టెన్షన్, 14.30 శాతంమందికి మాస్క్‌డ్ హైపర్‌టెన్షన్ ఉన్నట్టు తేలగా, 20-22 శాతం మందికి తమకు రక్తపోటు ఉన్నవిషయమే తెలియదన్నారు.

## టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్లో డెయిరీ పోస్టుల ఎంపిక జాబితా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్‌లోని వివిధ పోస్టుల ఎంపిక జాబితాను వెబ్‌సైట్లో పొందుపరిచినట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఫీల్డ్ అసిస్టెంట్, అసిస్టెంట్ డెయిరీ మేనేజర్/ మేనేజర్ గ్రేడ్2, అసిస్టెంట్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్, ఫీల్డ్ సూపర్‌వైజర్, ప్రాసెసింగ్ సూపర్‌వైజర్, ల్యాబ్ అసిస్టెంట్, బాయిలర్ ఆపరేటర్, మార్కెటింగ్ అసిస్టెంట్, సూపర్‌వైజర్ పోస్టుల జాబితా అందుబాటులో ఉందని వివరించింది.

**టీఆర్టీ అంధ అభ్యర్థులకు వైద్యపరీక్ష**

టీఆర్టీ నియామకాల్లో భాగంగా దివ్యాంగుల విభాగంలోని అంధత్వ క్యాటగిరీవారికి వైద్యపరీక్ష చేపట్టనున్నట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఈ నెల 26 నుంచి 31 వరకు హైదరాబాద్ మెహదీపట్నంలోని సరోజినిదేవి దవాఖానలో ఉదయం 9 గంటలనుంచి పరీక్షించనున్నట్టు తెలిపింది. సదరం గుర్తింపుపత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, హాల్ టికెట్, నియమిత మొత్తంలో ఫీజును వెంటతెచ్చుకోవాలని సూచించింది.

## రైతునేస్తం అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రైతునేస్తం 15వ వార్షికోత్సవం సందర్భంగా సుప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్త దివంగత పద్మశ్రీ డాక్టర్ ఐవీ సుబ్బారావు పేరిట వ్యవసాయ, అనుబంధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు, ప్రింట్-ఎలక్ట్రానిక్ మీడియా వ్యవసాయ జర్నలిస్టులతోపాటు విస్తరణ అధికారులను రైతునేస్తం-2019 అవార్డులతో ఘనంగా సత్కరించనున్నట్టు రైతునేస్తం ఎడిటర్ పద్మశ్రీ డాక్టర్ యడ్లపల్లి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. పూర్తి వివరాలకు 9849312629 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

# అన్ని జిల్లాల్లో ఈఎస్‌ఐ దవాఖానలు

**దేశవ్యాప్తంగా ఏర్పాటుకు కేంద్రం ప్రణాళికలు.. కేంద్ర కార్మికమంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్**

**సనత్‌నగర్ ఈఎస్‌ఐసీ ప్రాంగణంలో ఓపీ డీబ్లాక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన**



బుధవారం సనత్ నగర్‌లోని ఈఎస్‌ఐసీ మెడికల్ కాలేజీ, దవాఖాన ప్రాంగణంలో ఓపీ డీ బ్లాకు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న కేంద్ర మంత్రులు సంతోష్‌కుమార్ గంగ్వార్, కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి తదితరులు

**అమీర్‌పేట్, నమస్తే తెలంగాణ:** దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈఎస్‌ఐ దవాఖానలు ఏర్పాటుచేస్తామని, ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తున్నదని కేంద్ర కార్మికమంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్ చెప్పారు. దేశంలోని 700 పైచిలుకు జిల్లాలకుగాను 400 జిల్లాల్లోనే ప్రస్తుతం ఈ దవాఖానలు ఉన్నాయని తెలిపారు. సనత్‌నగర్ ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్‌ఐసీ) మెడికల్ కాలేజీ, దవాఖాన ప్రాంగణంలో రూ.124 కోట్లతో చేపట్టనున్న ఓపీడీ బ్లాకు నిర్మాణ పనులకు బుధవారం కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బీ కిషన్‌రెడ్డి, రాష్ట్ర కార్మికమంత్రి మల్లారెడ్డిలతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈఎస్‌ఐసీ మెడికల్ కళాశాలకు అనుబంధంగా పనిచేసే ఈ ఓపీడీ బ్లాక్‌ను బహుళ అంతస్తుల్లో నిర్మించనున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో గంగ్వార్ మాట్లాడుతూ ఈఎస్‌ఐ సదుపాయంలేని నిరుపేదలకు ఈఎస్‌ఐసీ ద్వారా నామమాత్రపు చార్జీలతో వైద్యసేవలు అందించాలనే అంశం కేంద్రం పరిశీలనలో ఉన్నదన్నారు. ఈఎస్‌ఐసీ కార్పొరేషన్‌కు నిధుల లోటులేదని, తెలంగాణ నుంచి తమకు అందే సిఫారసులను నెరవేరుస్తామని చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓపీడీ బ్లాక్ ద్వారా 200 పడకలతో కూడిన ఈఎన్టీ, ఆడియో స్పీచ్ థెరపీ, అనస్థీషియా, రేడియాలజీ వంటి ఆధునిక విభాగాలు అందుబాటులోకి వస్తాయన్నారు.

**ఈఎస్‌ఐ దవాఖానల్లో పడకల సంఖ్య పెంచాలి**

పెరుగుతున్న బీమాదారులను దృష్టిలో పెట్టుకుని ఈఎస్‌ఐ దవాఖానల్లో పడకల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉన్నదని రాష్ట్ర కార్మికమంత్రి మల్లారెడ్డి చెప్పారు. మేడ్చల్‌లో 800 పడకల వైద్యశాలను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర కార్మికమంత్రిని కోరారు. ఈఎస్‌ఐ దవాఖానకు అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తుందని, నాచారం, ఆర్సీపురం ఈఎస్‌ఐలలో వైద్యసేవలను విస్తరించేందుకు కేంద్రం చొరవ చూపాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో కేంద్ర మాజీమంత్రి బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ రామచంద్రరావు, సనత్‌నగర్ కార్పొరేటర్ లక్ష్మిరెడ్డి, కేం ద్ర కార్మికశాఖ కార్యదర్శి హీరాలాల్ సమారియా, ఈఎస్‌ఐసీ డీజీ రాజ్‌కుమార్, శశాంక్‌గోయెల్, ఆర్కే కటారియా, ఈఎస్‌ఐ ఎంఎస్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ దేవికారాణి, ఎస్‌ఐసీ వైద్యకళాశాల డీన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అమెరికాలో 7 నుంచి మనబడి తరగతులు

- సిలికానాంధ్ర మనబడి అధ్యక్షుడు రాజు చమర్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అమెరికాలోని ప్రవాస బాలలకు తెలుగు నేర్పిస్తున్న సిలికానాంధ్ర తరగతులు సెప్టెంబర్ 7న ప్రారంభమవుతాయని సిలికానాంధ్ర మనబడి అధ్యక్షుడు రాజు చమర్తి తెలిపారు. అమెరికావ్యాప్తంగా 250కిపైగా కేంద్రాల్లో తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. 2019-20 విద్యాసంవత్సరానికి అడ్మిషన్ల నమోదు జరుగుతున్నదని, ఆగస్టు 31లోగా పేర్లను నమోదు చేసుకోవాలని ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు manabadi.siliconandhra.org వెబ్‌సైట్‌ను చూడాలని, లేదా 1 844 626 (BADI) 2234 నంబర్‌ను సంప్రదించాలన్నారు. మనబడి ఎందరో ప్రముఖుల ప్రశంసలు పొందిందని మనబడి ప్రచారం, అభివృద్ధి విభాగం ఉపాధ్యక్షుడు శరత్ తెలిపారు.






# ఒకే తరహా పోలీస్ సేవలే లక్ష్యం

- పోలీస్ అధికారులతో సమీక్షలో డీజీపీ



బుధవారం డీజీపీ కార్యాలయంలో పెట్రో కార్, బ్లూ కోల్ట్స్ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లలో ఒకేతరహా పోలీస్ సేవలు లక్ష్యంగా తీసుకువచ్చిన సంస్కరణల అమలుతీరు, టెక్నాలజీ వినియోగం, ఇప్పటివరకు అమలుచేస్తున్న తీరుతెన్నులపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ అధికారులతో డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని అధికారులతో సమీక్ష నిర్వహించిన డీజీపీ మంగళ, బుధవారాల్లోనూ జిల్లాల పోలీస్ ఉన్నతాధికారులతో డీజీపీ కార్యాలయంలోని సమావేశమందిరంలో సమీక్ష నిర్వహించారు. అన్ని పోలీస్‌స్టేషన్లలో ఒకే తరహా సేవలందించేందుకు సాంకేతికత వినియోగం, అనుసరించాల్సిన విధానాలు, తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. సమావేశంలో శాంతిభద్రతల అదనపు డీజీ జితేందర్ సీనియర్ ఐపీఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

## వర్సిటీ ఉద్యోగాల భర్తీలో రిజర్వేషన్లు తప్పనిసరి

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ, బ్యాక్‌లాగ్ పోస్టులు, బోధన, బోధనేతర సిబ్బంది నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను తప్పనిసరిగా అమలుచేయాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ సూచించారు. బుధవారం బషీర్‌బాగ్‌లోని కమిషన్ కార్యాలయంలో విశ్వవిద్యాలయాల నియమాకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ల అమలుపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాల్లో ఉన్న పలు రకాల సమస్యలు, ఉద్యోగుల ఇబ్బందులను పరిష్కరించడానికి కమిషన్ చొరువ చూపుతున్నదని చెప్పారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం పలు రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచినట్టుగానే విశ్వవిద్యాలయాల ఉద్యోగాల భర్తీలో రిజర్వేషన్ అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచేలా చూడాలన్నారు. ఈ క్రమంలో రిజిస్ట్రార్లు తగిన చొరువ చూపాలని కోరారు. సమీక్షలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు నీలాదేవి పెందూర్, రాంబాల్‌నాయక్, దేవయ్య, విద్యాసాగర్, నర్సింహ, కమిషన్ కార్యదర్శి కరుణాకర్ పాల్గొన్నారు.

## రిజర్వేషన్ల జోలికొస్తే ప్రతిఘటనే

- బీజేపీ పప్పులు తెలంగాణలో ఉడకవు
- మాదిగ జేఏసీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి



**ఖైరతాబాద్:** రిజర్వేషన్ల జోలికొస్తే బడుగు, బలహీనవర్గాల నుంచి బీజేపీకి ప్రతిఘటన తప్పదని మాదిగ జేఏసీ చైర్మన్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి హెచ్చరించారు. రిజర్వేషన్లను ముట్టుకుంటే తెలంగాణలో బీజేపీని అడ్డుకుంటామని, వారి పప్పులు తెలంగాణలో ఉడకవని పేర్కొన్నారు. రిజర్వేషన్లపై చర్చ జరుగాలన్న ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యలను ఖండించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ, ఆరెస్సెస్ దేశంలో ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వంపై కుట్రలు పన్నేందుకు జేపీ నడ్డా, అమిత్ షా హైదరాబాద్‌కు రావడం విడ్డూరంగా ఉన్నదన్నారు. తెలంగాణ బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాంయాదవ్ మాట్లాడుతూ.. బీజేపీ దళిత, గిరిజన, బడుగు, బలహీన, మైనార్టీవర్గాలను అణచివేసే కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. ఈ సమావేశంలో సీపీఐఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి బీ సుభాష్, కందుల మధు, దాసరి రవిప్రసాద్, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.




కరీంనగర్

నమస్తే తెలంగాణ

# జిందగీ

గురువారం 22 ఆగస్టు 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

## సాధించింది.. ఆదర్శమైంది!





**అరుదైన వ్యాధి కారణంగా ఆమె కాళ్లు, చేతులు స్పర్శ కోల్పోయాయి. వైద్యం కోసం చాలా ఆస్పత్రులు తిరిగింది. కానీ, మెరుగైన వైద్యం అందలేదు. వైద్యులు చేతులెత్తేశారు. ఆ యువతి ఏమాత్రం దిగులు పడకుండా ఆత్మస్థైర్యంతో అడుగులు ముందుకేసింది.**

**కాలిఫోర్నియాకు** చెందిన గ్రేస్‌ఫిషర్ అనే 21 ఏండ్ల యువతి జీవితంలో ఎన్నో సాధించాలని కలలు కన్నది. అరుదైన వ్యాధి సోకడం వల్ల మెడ నుంచి కింది అవయవాలు పనిచేయకుండా పోయాయి. గ్రేస్ వీల్ చైర్‌కు పరిమితం కావాల్సి వచ్చినా, ఏమాత్రం కుంగిపోలేదు. తన గమ్యం వైపు అడుగులు వేసింది. కుటుంబ సభ్యులు,స్నేహితులు ఆమెలో ధైర్యాన్ని నింపారు. వారిచ్చిన ప్రోత్సాహంతో గ్రేస్ విజయవంతంగా మ్యూజిక్, పెయింటింగ్ కోర్సులను పూర్తి చేసింది. నోటి ద్వారా బొమ్మలు గీయడంతోపాటు, పియానో, గిటార్ వంటి సంగీత వాయిద్యాలు వాయిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నది. తనలాంటి దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపి.. వారి కలలను నిజం చేసేందుకు 'గ్రేస్ ఫిషర్' ఫౌండేషన్‌ను ప్రారంభించింది. సామాజిక మాధ్యమాల ద్వారా అటువంటి వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచుతూ ప్రయోజకులుగా తీర్చి దిద్దుతున్నది. సైకాలజిస్టు, ఇద్దరు ఫిజియోథెరపిస్టులు, కళల్లో నిష్ణాతులైన వారిని ఏర్పాటు చేసింది. వారితో దివ్యాంగులకు శిక్షణ ఇప్పించి తీర్చి దిద్దుతున్నది. గ్రేస్‌ఫిషర్ తల్లిదండ్రులు కూడా ఆమె స్థాపించిన స్వచ్ఛంద సంస్థలో సేవలందిస్తున్నారు. ఆమె చేస్తున్న మంచి పనికి తమ వంతు సహకారాన్ని అందిస్తూ గ్రేస్‌ను ప్రోత్సహిస్తున్నారు. ఫిషర్ జీవిత గాథ విన్న వారందరూ ఆమెనే ఆదర్శంగా తీసుకుంటున్నారు.

## వానాకాలంలో ఇంటి జాగ్రత్తలు!



**వానాకాలం మొదలైదంటే ఇంటి గోడలు, ఫర్నీచర్ దెబ్బ తినే ప్రమాదం ఉంటుంది. కిచెన్‌లో కూరగాయలు పాడవుతాయి. టెర్రస్ మీద ఫంగస్ పెరిగే అవకావమెక్కువ. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే వీటిని అధిగమించవచ్చు.**

- వర్షం పడుతుందంటే ముందుగా టెర్రస్ మీద నీళ్లు నిలుస్తాయి. దీంతో రూఫ్ నుంచి నీళ్లు కారుతుంటాయి. దీన్ని ఆపాలంటే ఒకటే పరిష్కారం. టెర్రస్‌పై వాటర్‌ప్రూఫ్ పెయింట్ వేస్తే నీళ్లు కారడం తగ్గుతుంది.
- వార్షాకాలంలో తేమ ఎక్కువగా ఉంటుంది. దీంతో లోహంతో తయారు చేసిన తలుపులు, కిటికీలు తుప్పు పడుతుంటాయి. చెక్క తలుపులకు తేమ తగలడం వల్ల అవి చెదులుపట్టే అవకాశం ఉన్నది. కాబట్టి వీటికి మెటల్ పెయింట్ సెకండ్ కోటింగ్ వేస్తే సరిపోతుంది.
- తేమ ఉన్న చోట చెక్కతో చేసిన ఫర్నీచర్ తొందరగా పాడవుతుంది. బాత్రూమ్‌కు కచ్చితంగా ప్లాస్టిక్, రేకు డోర్ బిగిస్తే సరి. లేదంటే తొందరగా పాడవుతుంది. తేమను తక్కువగా పీల్చుకునే వెదురు ఫర్నీచర్ ఎంచుకోవాలి.
- వేసవిలో కూరగాయలు ఎంత వేగంగా అయితే ఎండిపోతాయో, వర్షాకాలంలో కూరగాయలు అంతే తొందరగా కుళ్లిపోతాయి. కాబట్టి వాటిని కాగితంలో చుట్టి, ఫ్రిజ్‌లో పెడితే తొందరగా పాడవకుండా ఉంటాయి.
- మసాలా దినుసులు కూడా చల్లదనానికి మెత్తగా అవుతాయి. అలాంటప్పుడు వాటిని వేయించి, బిగుతైన డబ్బాలో ఉంచాలి. ఇలా చేయడం వల్ల వాటి ఘాటు, వాసన అలానే ఉంటుంది.
- ఈ సీజన్‌లో లైజాల్ వేసి మాప్ వేస్తున్నారా? మాప్ వేసిన తర్వాత నేలపై నడుస్తుంటే కాళ్లు అంటుకున్నట్టు ఉన్నాయా? అయితే లేజాల్‌కు బదులుగా బట్టల సబ్బుని నీటిలో కరిగించి ఆ నీటితో మాప్ వేస్తే నేల శుభ్రంగా ఉంటుంది.

### వంటింటి చిట్కాలు



- ఆలుగడ్డ ముక్కలు త్వరగా వేగాలంటే వాటిని ముందుగా మజ్జిగలో కాసేపు ఉంచితే సరి.
- అల్లం, వెల్లుల్లిని కాగితంలో కట్టి ఫ్రిజ్‌లో ఉంచుకుంటే ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి.
- శుభ్రం చేసిన చేప ముక్కలకు కొద్దిగా ఉప్పు కలిపి డీప్ ఫ్రీజర్‌లో పెడితే ముక్కలు అంటుకోకుండా ఉంటాయి. ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి.
- ఫ్రిజ్‌లో నిమ్మకాయలు ఎక్కువ రోజులు పెట్టడంతో గట్టి పడుతాయి. అలాంటప్పుడు 10 నిమిషాల ముందు నిమ్మకాయను తీసి వేడి నీటిలో ఉంచితే ఫలితం ఉంటుంది.
- వంకాయలు కట్ చేసిన వెంటనే నలుపు రంగులోకి మారుతున్నాయా? అయితే ముక్కలు కడిగే నీటిలో కొద్దిగా పాలు వేస్తే సరిపోతుంది.
- కూరల్లో కారం ఎక్కువ పడితే.. కొద్దిగా టమాటా రసాన్ని అందులో కలుపుకుంటే సరిపోతుంది.

## లడఖ్ వాసుల కోసం.. ఉద్యోగం వదిలింది!

**ఒక వృత్తిలో సంతృప్తి దొరుకకపోతే మరో వృత్తి వెతుకునే పరిస్థితి. వివిధ రంగాల్లో ప్రావీణ్యం కలిగిన ఓ మహిళ నిస్వార్థంగా లడఖ్ ప్రజల స్థితిగతులను మార్చేందుకు సిద్ధమయింది. వారికి విద్యావేత్తగా సేవలందించడానికి జీవితాన్నే అంకితం చేసింది.**



ఒడిశాలో బాలాసోర్‌లోని పంజాబీ జైన్ వ్యాపార కుటుంబంలో పుట్టింది 46 యేండ్ల గీతాంజలి. తాతల హయాంలోనే లాహోరు నుంచి బాలాసోర్‌కు వలస వచ్చారు. గీతాంజలిని తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచి ఎంతో స్వేచ్ఛగా పెంచారు. దీంతో చదువులోనే కాకుండా డ్యాన్స్, పెయింటింగ్, కరాటేలో ప్రావీణ్యం సంపాదించింది. గీతాంజలి కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగాన్ని వదిలేసి, లడఖ్ పౌరులను తీర్చిదిద్దేందుకు ప్రముఖ ఇంజినీర్ సోనమ్ వాంగ్‌చుక్‌తో కలిసి పనిచేయడానికి ముందుకొచ్చింది. సంస్థను ఏర్పాటు చేయడానికి అవసరమైన నిధులను సమీకరించేందుకు శ్రీకారం చుట్టింది. ఓ బృందంతో కలిసి వివిధ ప్రాంతాలు తిరిగి బోల్షోయ్ బ్యాలెట్ రష్యన్ డ్యాన్స్ ప్రదర్శించి నిధులు సేకరించింది. లడఖ్ వాసులను విద్యా కుసుమాలుగా తీర్చిదిద్దేందుకు గీతాంజలి హైయిల్( హిమాలయన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్స్) పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేసింది. అక్కడి పర్వత ప్రాంతంలో ఉండే ప్రజలకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి అవసరమైన శిక్షణ ఇస్తున్నది. గీతాంజలికి వివిధ కళల్లో పట్టుండడంతో తన సంస్థలోని విద్యార్థులకు పెయింటింగ్, కరాటే, నృత్యం వంటివి నేర్పిస్తున్నది. లడఖ్ ప్రజల బాగు కోసం తన జీవితాన్నే అంకితం చేసిన గీతాంజలిని అందరూ ప్రశంసిస్తున్నారు.

# మస్త్.. మస్త్.. మష్రూమ్స్!



వర్షాకాలంలో చెట్ల వెంట.. పుట్ల వెంట.. విరివిగా కనిపించేవి పుట్టగొడుగులు (మష్రూమ్స్)..
ఇప్పుడు వీటిని ప్రత్యేకంగా పండిస్తున్నారనుకోండి..
శాకాహార ప్రియులకు ఇవి చాలా ప్రత్యేకం.
వివిధ ఆకారాల్లో, రంగుల్లోనే కాదు.. పోషకాలు కూడా మెండుగా ఉంటాయి.
వీటి రుచి కూడా అమోఘంగానే ఉంటుంది.
అందుకే మష్రూమ్స్‌తో చేసిన స్పెషల్ వంటకాలు మీకోసం..

### మష్రూమ్ మేతీచమన్



**కావాల్సినవి :**

**మష్రూమ్స్ :** 200 గ్రా.
**ఉల్లిపాయ ముక్కలు :** ఒక కప్పు
**వెల్లుల్లి పాయలు :** 4
**బటర్ :** 2 టేబుల్‌స్పూన్స్
**బియ్యంపిండి :** 2 టేబుల్‌స్పూన్స్
**గరంమసాలా :** అర టీస్పూన్
**పాలు :** అర కప్పు
**పాలకూర :** 5 కట్టలు
**మెంతికూర :** 2 కట్టలు
**నట్‌మెగ్ పొడి :** ఒక టీస్పూన్
**పచ్చిమిర్చి :** 2
**మీగడ :** 2 టేబుల్‌స్పూన్స్
**ధనియాల పొడి :** ఒక టీస్పూన్
**జీలకర్ర పొడి :** ఒక టీస్పూన్ ,
**చక్కెర :** చిటికెడు, **ఉప్పు :** తగినంత

**తయారీ :**

**స్టెప్ 1 :** కడాయిలో ఉల్లిపాయ ముక్కలు, వెల్లుల్లిపాయలు వేసి వేయించాలి. దీంట్లోనే బటర్, పచ్చిమిర్చి వేసి ఒక నిమిషం పాటు వేగనివ్వాలి.
**స్టెప్ 2 :** దీంట్లో బియ్యంపిండి, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరం మసాలా, మష్రూమ్ ముక్కలను వేసి కలుపాలి.
**స్టెప్ 3 :** ఆ తర్వాత పాలు పోసి సన్నని మంట మీద ఐదు నిమిషాలు ఉంచాలి. ఇది ఉడుకుతుండగా మెంతికూర, పాలకూర వేసి మరో నాలుగు నిమిషాలు ఉంచాలి.
**స్టెప్ 4 :** ఇందులో నట్‌మెగ్ పొడి, ఉప్పు, చక్కెర వేసి బాగా కలుపాలి. రెండు నిమిషాల తర్వాత ఫ్రెష్‌క్రీమ్ వేసి గ్రేవీ చిక్కబడేంత వరకు ఉంచి, దించేయాలి. టేస్టీ మష్రూమ్ మేతీ చమన్ రెడీ!

### మష్రూమ్ పచ్చడి



**కావాల్సినవి :**

**మష్రూమ్స్ :** 10, **నూనె :** అర కప్పు, **పసుపు :** పావు టీస్పూన్, **నువ్వుల పొడి :** ఒక టీస్పూన్, **ఆవ పొడి :** ఒక టీస్పూన్, **కారం :** ఒక టేబుల్‌స్పూన్, **నిమ్మరసం :** రెండు టేబుల్‌స్పూన్స్, **ఉప్పు :** తగినంత.

**తయారీ :**

**స్టెప్ 1 :** మష్రూమ్స్‌ని రెండు ముక్కలుగా కట్ చేసి పెట్టుకోవాలి. కడాయిలో నూనె పోసి కొద్దిగా వేడయ్యాక మష్రూమ్స్ వేసి ఒక నిమిషం ఉంచి దించేయాలి.
**స్టెప్ 2 :** దీంట్లో పసుపు, నువ్వుల పొడి, ఆవ పొడి, కారం, ఉప్పు వేసి కలుపాలి.
**స్టెప్ 3 :** బాగా కలిశాక నిమ్మరసం పోసి, మరోకసారి కలిపి, గాలి చొరబడని డబ్బాలో వేసి మూత పెట్టేయాలి. సూపర్ పచ్చడి మీ నోరూరించకమానదు.

### క్రీమీ మష్రూమ్ టోస్ట్



**కావాల్సినవి :**

**బ్రెడ్ ముక్కలు :** 4
**మష్రూమ్ ముక్కలు :** ఒక కప్పు
**బటర్ :** ఒక టీస్పూన్
**వెల్లుల్లిపాయ ముక్కలు :** ఒక టీస్పూన్
**తెల్ల మిరియాల పొడి :** ఒక టీస్పూన్, **ఫ్రెష్ క్రీమ్ :** 2 టేబుల్‌స్పూన్స్, **కొత్తిమీర :** అర కట్ట, **బటర్ :** ఒక టీస్పూన్, **ఉప్పు :** తగినంత.

**తయారీ ::** **స్టెప్ 1 :** బ్రెడ్‌ని టోస్టర్‌లో పెట్టి టోస్ట్ చేసుకోవాలి. కడాయిలో బటర్ వేసి వెల్లుల్లి పాయలను వేయించాలి.
**స్టెప్ 2 :** ఇందులో మష్రూమ్స్, తెల్ల మిరియాల పొడి, ఉప్పు వేసి సన్నని మంట మీద రెండు నిమిషాలు ఉంచాలి.
**స్టెప్ 3 :** చివరగా ఫ్రెష్ క్రీమ్ వేసి కలిపి ఒక నిమిషం ఉంచి దించేయాలి. ఇప్పుడు ఈ క్రీమీ మష్రూమ్‌ని టోస్ట్ మధ్యలో వేసి తింటే ఆ టేస్టే వేరు.

### మష్రూమ్ బజ్జీల్



**కావాల్సినవి :**

**మష్రూమ్స్ :** ఒక కప్పు, **కార్న్‌ఫ్లోర్ :** 2 టీస్పూన్స్, **బియ్యం పిండి :** 2 టీస్పూన్స్ , **పచ్చిమిర్చి :** 2, **గరం మసాలా :** పావు టీస్పూన్, **మిరియాల పొడి :** పావు టీస్పూన్, **అల్లం, వెల్లుల్లి పేస్ట్ :** అర టీస్పూన్, **వెల్లుల్లి పాయ ముక్కలు :** పావు టీస్పూన్, **కరివేపాకు :** ఒక రెమ్మ, **కారం :** అర టేబుల్ స్పూన్, **ధనియాలు :** అర టీస్పూన్, **నిమ్మరసం :** అర టేబుల్‌స్పూన్, **ఉప్పు, నూనె :** తగినంత.

**తయారీ :**

**స్టెప్ 1 :** ధనియాలను పొడిలా కాకుండా దంచుకోవాలి. వెల్లుల్లిపాయలను చిన్నచిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. మష్రూమ్స్‌ని రెండు ముక్కలుగా కట్ చేసి పెట్టుకోవాలి.
**స్టెప్ 2 :** ఒక గిన్నెలో కార్న్‌ఫ్లోర్, బియ్యం పిండి, పచ్చిమిర్చి, గరం మసాలా, మిరియాల పొడి, అల్లం, వెల్లుల్లి పేస్ట్, వెల్లుల్లిపాయలు, కరివేపాకు, కారం, ధనియాలు, నిమ్మరసం, ఉప్పు వేసి బాగా కలుపాలి.
**స్టెప్ 3 :** ఇందులో నీళ్లు పోసి బజ్జీ మిశ్రమంలా చేసుకోవాలి. ఇప్పుడు కడాయిలో బాగా నూనె పోసి వేడి చేయాలి. మష్రూమ్ ఒక్కో ముక్కని బజ్జీలాంటి మిశ్రమంలో ముంచి నూనెలో గోల్డెన్ కలర్ వచ్చేవరకూ వేయించాలి. వేడి వేడిగా తింటే ఇవి మరింత టేస్టీగా ఉంటాయి.



**సంజయ్ తుమ్మ**
సెలబ్రిటీ చెఫ్

## క్రిమిసంహారక మందు ప్రమాదమా?

అడుగండి చెబుతా



**మా అబ్బాయి వయసు 35 సంవత్సరాలు. నెల రోజుల క్రితం క్రిమిసంహారక మందు తాగాడు. ఆ విషయం మాకు కొద్ది గంటలు ఆలస్యంగా తెలిసింది. తర్వాత హాస్పిటల్‌కు తీసుకెళ్లాం. ఐసీయూలో వెంటిలేషన్‌పై చికిత్స చేశారు. చాలా రోజుల తర్వాత డిశ్చార్జి చేశారు. మాకు తెలిసిన వాళ్లొకరు ఇలాగే క్రిమి సంహారక మందు తాగితే రెండ్రోజులకే డిశ్చార్జి చేశారు. మరి మా అబ్బాయిని ఎందుకు ఇన్ని రోజులు ఐసీయూలో పెట్టారు? పరిస్థితి తీవ్రంగా ఉన్నట్టా? భవిష్యత్‌లో ఏమైనా ప్రమాదాలు ఉండొచ్చా? దయచేసి తెలుపగలరు.**

**- ఎన్. వరదరాజులు,** కొన్నాగుల

మీ అబ్బాయి క్రిమిసంహారక మందు మాత్రమే తాగాడని మీరు గుర్తించారు. కానీ ఎంత మోతాదులో తీసుకున్నాడో.. అదెంత తీవ్రత కలిగి ఉన్నదో మీకు తెలియదు. విషం తీవ్రతను బట్టి దుష్ప్రభావాలు ఉంటాయి. వెంటనే హాస్పిటల్‌కు తీసుకెళ్లినా కూడా అప్పటికే అది శరీరమంతా పాకిపోతుంది. శ్వాసకోశాల మీద ప్రభావం చూపిస్తుంది. ఆ ప్రభావం గుండెమీద పడి గుండె స్పందన వేగం తగ్గిపోతుంది. జీర్ణకోశంపై పడితే విరేచనాలు అవుతాయి. కండరాల మీద పడితే శరీరమంతా వణికిపోతుంది. మెదడుకు పాకితే కోమాలోకి వెళ్తారు. ఇలాంటివన్నీ నిరోధించాలంటే ఐసీయూలో చికిత్స చేయాల్సిందే. మీ అబ్బాయి విషయంలో ఇదే జరిగింది. తీవ్రత ఎక్కువగా ఉన్న క్రిమి సంహారక మందు తీసుకున్నాడు కాబట్టి దాని ప్రభావం కూడా తీవ్రంగానే పడింది. మీకు తెలిసినవాళ్లొకరు కూడా క్రిమి సంహారక మందు తాగి కొద్ది రోజులకే కోలుకున్నారని చెప్పారు కదా? అయితే ఆ మందు తీవ్రత.. మోతాదు తక్కువగా ఉండొచ్చు. ఐసీయూలో అన్ని రోజులు ఉంచి చికిత్స చేశారు అంటే.. మాగ్జిమమ్ అన్ని విధాల సెట్ చేసి.. భవిష్యత్‌లో ఎలాంటి హాని జరగకుండా ట్రీట్‌మెంట్ అందించారు కావచ్చు. కాబట్టి భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదం ఉండదు. భయపడకండి. ముందు మీ అబ్బాయి ఆలోచనా విధానంలో మార్పులు తీసుకువచ్చేందుకు ప్రయత్నించండి. 35 ఏండ్ల అబ్బాయి క్రిమి సంహారక మందు తాగే రీతిలో ఆలోచిస్తున్నాడు అంటే అతనికి మానసిక కౌన్సెలింగ్ కూడా అవసరం. లోపం మీలో ఉందేమో చెక్ చేసుకోండి.



**డాక్టర్ మధుసూదన్ జాజు**
కన్సల్టెంట్ క్రిటికల్ కేర్ మెడిసిన్,
కేర్ హాస్పిటల్స్, నాంపల్లి

పోషకాల గని మునగ. అందుకే ఈ పంటకు వాణిజ్యంగా మంచి ఆదరణ ఉన్నది. ఈ పంట ఆకులు, పూల కోసం ప్రధానంగా సాగు చేయబడుతున్నది. ఈ పంట విత్తన జిగురు, నూనె విత్తనాలు వివిధ ఔషధ పరిశ్రమలలో ఇప్పటికే వాడుతున్నారు. మానవ శరీరానికి కావాల్సిన ఖనిజ లవణాలు, విటమిన్లు మునగ నుంచి అందుతాయి. 100 గ్రాముల ఉడకబెట్టిన మునగ ఆకులతో వ్యక్తికి రోజూ కావలసిన కాల్షియం, 75 శాతం ఇనుము, సగం ప్రోటీన్, ఇతర అమైనో ఆమ్లాలతో పాటు ఏ, సీ విటమిన్లు కూడా అందుతాయి.అందుకే కాయగూర పంటగా దీనికి డిమాండు ఉన్నది. అయితే బహువార్షిక రకాల పూత, కాతకు ఎక్కువ సమయం తీసుకోవడంతో దిగుబడులు తక్కువ. ఇటీవల కాలంలో పరిశోధనలతో ఏకవార్షిక రకాలు అంటే ఆరు నెలల్లోపే పూతకు, కాతకు వచ్చే రకాలు అభివృద్ధి చేయబడినాయి. వాటి నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. మునగలో నాణ్యమైన దిగుబడులు, మంచి ఆదాయం పొందడానికి సాగులో కిటుకులు పాటించాలి.





# నికర ఆదాయానికి మునగ సాగు మేలు

### నేలలు
మునగ అన్నిరకాల నేలల్లో వచ్చే పంట. 6.5-8 మధ్య ఉదజని సూచిక కలిగిన ఇసుక, రేగడి నేలలు చాలా అనుకూలంగా ఉంటాయి.

### పంట సీజన్
ఆగస్టు మొదలుకొని అక్టోబర్ వరకు విత్తుకోవచ్చు. అయితే ఏడాదిలో ఏ సమయంలో విత్తినా ఎండాకాలంలోనే అంటే జనవరి-ఏప్రిల్ మధ్య పూతకు వస్తుంది. ఫిబ్రవరిలో ఎక్కువ పూత, కాత ఉంటుంది.

### విత్తన మోతాదు
ఎకరాకు 200 గ్రాముల విత్తనం అవసరం. ఒక గుంతకు రెండు విత్తనాల చొప్పున 2.5-3 సెం.మీ లోతులో వేయాలి. లేదంటే ముందుగా పాలీ బ్యాగులలో పెంచి, 35-40 రోజుల సమయంలో గుంతలలో నాటాలి. గుంతలను 2-2.5 మీటర్ల దూరంలో 45 సెం.మీ పొడవు, 45 సెం.మీ వెడల్పు, 45 సెం.మీ లోతులో తవ్వాలి. ఒక్కో గుంతకు 15 కిలోల చొప్పున కంపోస్టు లేదా బాగా చివికిన పశువుల ఎరువు వేయాలి.

### సస్యరక్షణ
**పండు ఈగ యాజమాన్యం:** మునగలో ప్రధానంగా ఆశించి నష్టపరిచే ఈగ పండు ఈగ. ఇది నాటిన 150,180, 210 రోజుల్లో పంటను ఆశిస్తుంది. దీని నివారణకు ఎకరాకు 80 గ్రాముల 'థయోమిథాక్సేమ్ 25 డబ్ల్యూజీ'ని నేలలో వేయాలి. ఎకరాకు 10 కుళ్లిన టమాటాతో కూడిన ఫ్రూట్ టాప్ 500 లీటర్ల నీటిలో కలిపివేయాలి. ఎకరాకు స్పైనోశాడ్ 45 ఎస్‌సీని 22 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలి. మరోదఫా ఎకరాకు 500 లీటర్ల నీటిలో 100 గ్రాముల ప్రొఫెనోఫాస్ కలిపి పిచికారీ చేయాలి.

**బొంత పురుగు యాజమాన్యం :**
బొంత పురుగులు మునగ కాండంపై గుంపులుగా చేరి, బెరడును తొలిచి తింటాయి. ఆకులను తొలిచి వేస్తాయి. దీనివల్ల ఆకులు విపరీతంగా రాలిపోతాయి. దీని సమర్థ నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలి. పురుగు గుడ్లను, లార్వాలను సేకరించి ఏరివేయాలి. వర్షాల తర్వాత పెద్ద పురుగులను నివారించడానికి హెక్టారుకు ఒక దీపపు ఎరను ఉంచాలి. లార్వాలను చంపే 'బర్నింగ్ టార్చి' వాడాలి. లీటరుకు రెండు గ్రాముల చొప్పున లేదా ఎకరాకు 10 కిలోల చొప్పున కార్బరిల్ పౌడర్‌ను వాడి నివారించవచ్చు.

### అధిక సాంద్రపద్ధతిలో సాగు
మొక్కల సంఖ్య పెంచటం ద్వారా అధిక దిగుబడిని పొందే అధునాతన పద్ధతి 'అధిక సాంద్ర పద్ధతిలో సాగు'. సాధారణ పద్ధతికి బదులుగా గుంతలు 1.5 మీటర్ల వరుసలు, ఒక మీటరు దూరంలో వరుసలో మొక్కలు నాటేలా తీసుకోవాలి. దీంతో హెక్టారుకు 13,333 మొక్కలు ఉంటాయి. మొక్కల సాంద్రత పెరుగుతుంది. దీంతోపాటు బిందు సేద్యం పాటించి, ఒక మొక్కకు ఫెర్టిగేషన్ ద్వారా 135:23:45 గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్‌లను అందిస్తే దిగుబడులు పెరుగుతాయి. నత్రజని, పొటాష్ ఎరువులను యూరియా, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో డ్రిప్ ద్వారా అందించాలి.



### అంతర సేద్యం
ఒక నెల వ్యవధిలో మొలకలు పరిశీలించి, మొలకలులేని గుంతల్లో మళ్లీ విత్తనాలు నాటాలి. మొక్కలు 75 సెం.మీ ఎత్తు పెరిగినప్పుడు మొదలు పైచివర్లను తుంచితే, పక్క కొమ్మలు ఎక్కువ సంఖ్యలో వస్తాయి. టమాటా, మిరప, బెండ, బొబ్బర్ల పంటలను అంతర పంటలుగా సాగు చేసుకోవచ్చు. అయితే మక్కజొన్నను ఎట్టి పరిస్థితుల్లోనూ వేయరాదు.

### ఎరువులు
విత్తిన 3 నెలల్లో గుంతకు 45:15:30 గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్‌లను ఇచ్చే ఎరువులు వేయాలి. ఆరు నెలలకు పంట పూతకు వస్తుంది. ఆ సమయంలో మరో దఫాగా 45 గ్రాముల నత్రజని ఎరువులను ఒక్కో గుంతలో వేయాలి. విత్తిన మూడోరోజు మొదటి తడిని, ఆ తర్వాత 10-15 రోజుల వ్యవధిలో నీటి తడులివ్వాలి.

**దిగుబడి:** హెక్టారుకు 50-55 టన్నుల కాయలు. సాలీనా సరాసరి చెట్టుకు 220 మునగ కాయల దిగుబడి వస్తుంది.

### కార్శి పంట
మునగలో కార్శి పంటగా కూడాసాగు చేసుకోవచ్చు. మొదటి కాయ కోత తర్వాత భూమట్టం నుంచి 90 సెం.మీ ఎత్తులో కత్తిరించాలి. 4,5 నెలల్లో చెట్టు కాపునకొస్తుంది. మూడేండ్ల వరకు కార్శి పంట తీసుకోవచ్చు. కత్తిరించిన వెంటనే మొక్కకు 45,15,30 గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వేయాలి. 30 గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వేయాలి. ప్రతి సంవత్సరం 25 కిలోల చొప్పున బాగా చివికిన పశువుల ఎరువు వేయాలి.

### ఏక వార్షిక మునగ రకాలు
**కేఎం-1**: విత్తనాలతో సాగు చేయాలి. సాలీనా ఒక చెట్టుకు సరాసరిన 400-500 కాయలు వస్తాయి. నాటిన ఆరు నెలలకే కాపునకొస్తుంది. కాయలు 25-30 సెం.మీ పొడవు ఉంటాయి. మొక్కలు పొదలుగా ఉంటాయి. కాబట్టి కాయ కోత చాలా సులభం. మొదటి కోత తర్వాత భూ మట్టానికి ఒక మీటరు మందం కాండం వదిలి మిగతా భాగం కత్తిరించాలి. కార్శి పంటగా 2-3 ఏండ్లు దిగుబడిని ఇస్తుంది.

**పీకేఎం-1:** రకం విత్తిన 5-6 నెలలకు పూతకు వస్తుంది. 7-8 నెలల్లో కోతకు వస్తుంది. మార్చి-ఆగస్టు మధ్యలో దిగుబడి ఎక్కువ. ఒక ఏడాదిలో 4-6 మీటర్ల పొడవు పెరుగుతుంది. 6-12 కొమ్మలు వస్తాయి. కాయలు 75 సెం.మీ పొడవు, 6.3 సెం.మీ వ్యాసార్థంతో ఉండి, 150 గ్రాముల బరువు తూగుతాయి. సాలీనా మొక్కకు 220 కాయలు వస్తాయి. హెక్టారుకు 52 టన్నుల కాయల దిగుబడి ఉంటుంది. తోటలలో అంతర పంటగా, ఈ రకం మునగలో మిరప, వేరుశనగ, ఉల్లి పంటలను అంతరపంటగా పండించవచ్చు.

**పీకేఎం-2:** ఇది సంకర రకం. విత్తనాల ద్వారా సాగు చేసుకోవాలి. నాటిన ఆరు నెలల్లో కాతకు వస్తుంది. వివిధ పంటల సరళిలో సాగుకు అనుకూలం. కాయలు 120 సెం.మీ పొడవు, 8.3 సెం.మీ వ్యాసార్థంతో ఉండి 70 శాతం కండతో 280 గ్రాముల బరువు తూగుతుంది. కాయలలో విత్తనాలు తక్కువ. కండ ఎక్కువగా ఉంటుంది. సాలీనా చెట్టుకు సరాసరిన 220 కాయలు వస్తాయి. హెక్టారుకు 98 టన్నుల దిగుబడి వస్తుంది. కార్శి పంటను మూడేండ్ల వరకు సాగు చేయవచ్చు.

### చిన్న, సన్నకారు రైతులకు లాభం
- ఏకవార్షిక మునగ సాగుకు తక్కువ మొత్తంలో నీరు అవసరం.
- ఎక్కువమంది కూలీల అవసరం లేదు. కుటుంబసభ్యులే వివిధ పనులు పూర్తి చేసుకోవచ్చు.
- ఎరువులు, పురుగు మందులు తక్కువే.
- ఒక హెక్టారు కంటే తక్కువే సాగు విస్తీర్ణం. కాబట్టి మునగ కాయలను సులభంగా, తక్కువ కాలంలోనే స్థానిక మార్కెట్లకు తరలించవచ్చు.
- మునగ చెట్టు వ్యర్థాలు, కత్తిరించిన కొమ్మలు, ఇతరాల గుజ్జులను వాణిజ్యంగా పేపర్ తయారీలో వాడుతున్నారు. కాబట్టి వీటి ద్వారా అదనపు ఆదాయం రైతులకు లభిస్తుంది.

డాక్టర్ కె. రవీందర్‌రెడ్డి
8333981352
రిజిస్ట్రార్,రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం





# మక్కజొన్నలో చీడపీడల యాజమాన్యం

రాష్ట్రంలో ప్రస్తుతం మక్కజొన్న సాగులో అవలంబించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి గడ్డిపల్లి కేవీకే విశ్రాంత శాస్త్రవేత్త టి.యాదగిరిరెడ్డి వివరించారు. ఈ పంట సాగులో అదనపు సమాచారం కోసం 9440481279 నెంబర్‌ను సంప్రదించవచ్చు. ఈ పంట సాగు గురించి ఆయన అందించిన వివరాలు..

- వానకాలం పంటగా జూన్15 నుంచి జూలై 15 వరకు విత్తిన మక్కజొన్న పంట పూతకు వచ్చే దశలో ఉన్నది. ఈ దశలో సిఫారసు చేసిన నత్రజని మోతాదు 24-32 కిలోలు ఎకరాకు పంటకు వేయాలి.
- వానకాలం పంటను వర్షాధారంగా సాగు చేసిన మక్కజొన్నకు నీరు ఉన్నచోట బెట్ట పరిస్థితులను బట్టి నీటితడులు ఇవ్వాలి.
- మోకాలి ఎత్తు దశ, పూతకు వచ్చే సమయం, గింజ నిండుకునే సమయంలో బెట్ట పరిస్థితులకు గురికాకుంటే వర్షాధారంగా కూడా మంచి దిగుబడులు పొందవచ్చు.
- పూతదశలో నీటి ఎద్దడి లేకుండా ఉన్నట్లైతే కాండం కుళ్ళును నియంత్రించవచ్చు.
- ఆకు ఎండు తెగులును అదుపు చేయడానికి 2.5 గ్రాములు మాంకోజెబ్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పాముపొడ తెగులును నియంత్రించడానికి ప్రాపికొనజోల్ 1 గ్రాము లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి
- భూసారపరీక్షలకు అనుగుణంగా ఎరువులు వేయాలి. ఎరువులు వేసేటప్పుడు భూమిలో తగిన తేమ ఉండాలి.
- మక్కజొన్నలో పోషక సమస్యలు పూత దశలో, పిందె దశలో ఏర్పడితే దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి.
- మక్కజొన్నలో జింక్, ఇనుము, మాంగనీస్, బోరాన్ లోపం బాగా కనిపిస్తాయి. ఈ లోపాల నివారణకు సిఫారసు చేసిన మోతాదులో సూక్ష్మ పోషకాలు పూతకు పది రోజల ముందు నుంచి మొదలుకుని 20-25 రోజుల వరకు వాడి నివారించి అధిక దిగుబడులను పొందవచ్చు.
- ఈ మధ్యకాలంలో మక్కజొన్నలో లద్దె పురుగు జాతికి చెందినది పంటను ఆశించి నష్టపరుస్తున్నది. దీని నివారణకు సిఫారసు చేసిన సమగ్ర సస్యరక్షణ పద్ధతులు, రసాయన పురుగుమందు అయిన క్లోరోనైట్రిపోల్ 0.3 మి.లీ.లు లీటర్ నీటికి ఫ్లూ బెండిమైడ్ 0.3 మి.లీ.లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నోవాల్యూరాన్ 0.75 మి.లీ.లు లీటర్ నీటికి+ డైక్లోరోవాస్ 1.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి ఈ పురుగును సమర్థవంతంగా నివారించవచ్చు

నట్టె కోటేశ్వర్‌రావు, 9989944945
గరిడేపల్లి, సూర్యాపేట జిల్లా

# వరిలో చేపట్టాల్సిన చర్యలు

రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో వరి పైర్లు పిలకల దశ నుంచి చిరుపొట్ట దశలో ఉన్నాయి. ఈ వానకాలంలో సన్నగింజ రకాలైన తెలంగాణ సోన, బీపీటీ 5204, జైశ్రీరామ్, హెచ్‌ఎంటీ సోన తదితర రకాలను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు కొంత ఆలస్యం అయ్యాయి. దీనివల్ల రైతులు వరి నాట్లను జూలై, ఆగస్టు మాసం చివరివరకు కొనసాగించే అవకాశాలు కన్పిస్తున్నాయి. బోరుబావులు, నీటి వసతి ఉన్న కొన్ని ప్రాంతాలలో జూన్, జూలై మాసంలోనే వరి నాట్లు వేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో వరి పైర్లు వివిధ దశల్లో ఉన్నాయి. కాబట్టి ప్రస్తుత పరిస్థితులలో వరి సాగు చేసే రైతులు కింది సూచనలను పాటించాలి.



- రాష్ట్రంలో సెప్టెంబర్ మాసంలో వరి నార్లు ఎట్టి పరిస్థితులలో పోయడానికి అనుకూలం కాదు. ముఖ్యంగా సెప్టెంబర్ మాసంలో నార్లు పోసి నాటుకొన్నట్లయితే పంట పూత సమయంలో చలి వాతావరణం ఎక్కువగా ఉండి, గింజ పాలు పట్టక తాలు గింజలు ఏర్పడి దిగుబడి రాదు.
- ముఖ్యంగా కృష్ణా ఆయకట్టు ప్రాంతాలైన ఉమ్మడి ఖమ్మం, నల్గొండ జిల్లాలలో, ప్రస్తుతం నీటి విడుదల అవ్వడం వలన రైతులు వరి పంటను ఆలస్యంగా వేయడానికి సిద్ధపడుతున్నారు. ఒకవేళ ఇలాంటి ప్రత్యామ్నాయ పరిస్థితులలో వరి సాగు చేయాలంటే స్వల్పకాలిక రకాల నార్లు అందుబాటులో ఉంటే సెప్టెంబర్ మొదటివారంలో వరి నాట్లు పూర్తి చేయాలి. ప్రస్తుత పరిస్థితులలో వరి నారు పోసి నాట్లు వేయడం సాధ్యం కాదు. కాబట్టి వెదజల్లే పద్ధతి లేదా డ్రమ్ సీడర్ పద్ధతిలో విత్తుకోవాలి.
- రైతులు ముదురు నారును నాటాల్సి వస్తే మొక్కల మధ్య దూరం తగ్గించి దగ్గర దగ్గరగా (కుదురుకు 4-5 మొక్కలతో) నాట్లు వేసుకుంటే దిగుబడి తగ్గకుండా ఉంటుంది. ముదురు నారుకు సిఫారసు చేసిన యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటించాలి.
- పిలకల దశలో ఉన్న వరి పైర్లకు ఎకరానికి 30-35 కిలోల యూరియాను బురద పదునులో చల్లుకోవాలి. అంకురం దశలో ఉన్న పొలాలకు ఎకరానికి 30-35 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువును వేసుకోవాలి. ఈ దశలో ఎలాంటి కాంప్లెక్స్ ఎరువులను వేయరాదు.
- వరి నాట్లు ఆలస్యంగా వేసిన ప్రాంతాలలో ఉల్లికోడు ఉధృతి ఈ ఏడాది అధికంగా ఉండే అవకాశం ఉన్నది. దీని నివారణకు నాటిన 15-20 రోజుల దశలో ఎకరానికి 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను పొలంలో పలుచగా నీరుంచి చల్లుకోవాలి.
- నారుమడి, ప్రధాన పొలంలో హిస్పా (తాటాకు తెగులు) ఆశిస్తే ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి నివారించుకోవాలి.
- ముందుగా దీర్ఘకాలిక రకాలు నాట్లు వేసిన జిల్లాలలో, అంటే వరి పైరు చిరుపొట్ట దశలో ఉన్న ప్రాంతాలలో సుడిదోమ ఆశించే అవకాశం ఉన్నది. పొలంలో దోమ ఉధృతి ఎప్పటికప్పుడు గమనించాలి. పొలంలో నీరు తగ్గించి పొలాన్ని అడపాదడపా ఆరబెట్టాలి. నత్రజని వినియోగం తగ్గించాలి. దోమ ఉధృతికి దోహదపడే క్లోరోపైరిఫాస్, ప్రొఫెనోఫాస్, సింథటిక్ పైరిథ్రాయిడ్‌ను లేదా సిఫారసు చేయని బయో మందులను వాడరాదు. దోమ ఉధృతిని బట్టి లీటరు నీటికి 1.5 గ్రా. ఎసిఫేట్ లేదా 1.6 మి.లీ. బుప్రోఫెజిన్ లేదా 0.4 గ్రా. డైనోటెప్యూరాన్ లేదా 0.6 గ్రా. పైమెట్రోజైన్ వంటి మందులను మొక్కల మొదళ్ళు తడిచేలా పిచికారీ చేయాలి.
- వరిలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు ముఖ్యంగా సన్నగింజ రకాల్లో ఆగస్టు-సెప్టెంబర్ మాసంలో ఆశించే అవకాశం ఉన్నది. ఈ తెగులు ఆశించడానికి అధిక వేగంతో కూడిన గాలులు, ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు పడటం (2-4 రోజుల సగటు ఉష్ణోగ్రతలు (22-26 డిగ్రీల సెల్సియస్), అధిక మోతాదులో నత్రజని వాడటం లాంటి పరిస్థితులు అనుకూలం. ఈ తెగులు లక్షణాలు గమనించినట్లయితే నత్రజని ఎరువును తాత్కాలికంగా నిలిపివేయాలి. తొలిదశలో వ్యాప్తిని నివారించడానికి ప్లాంటామైసిన్ లేదా అగ్రిమైసిన్ 80 గ్రా/ ఎకరానికి లేదా స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ 40 గ్రా. ఎకరానికి పిచికారీ చేయాలి.
- సల్ఫైడ్ విష ప్రభావం వలన మొక్కల వేర్లు నల్లబడటం వలన వేసిన వారు తొలిదశలోనే చనిపోవడం గమనించిన చోట్ల పొలంలో మురుగు నీరు తీసి వెంట్రుక వాసి పగుళ్ళు వచ్చే వరకు ఆరగట్టాలి. తర్వాత నీరు పెట్టి 25 కిలోల యూరియాకు 50-80 గ్రా. కార్బండిజిమ్ 25శాతం+ మాంకోజెబ్ 50 శాతం గల మిశ్రమ మందును కలిపి పొలమంతా సమానంగా చల్లాలి. పొలాన్ని చేతితో కలియబెట్టాలి.

డాక్టర్
యం. వెంకటరమణ
7337399470
ప్రధాన శాస్త్రవేత్త (వరి), హెడ్





# నిమ్మలో నల్లదోమ నివారణ

నిమ్మ తోటలో ఆగస్టు నుంచి మార్చి వరకు అంటే చిగుర్లు వస్తాయి. ఈ దశలో నల్లదోమ ఎక్కువగా ఆశించి నష్టాన్ని కలుగజేస్తుంది.

**లక్షణాలు:** నల్లరంగులో ఉన్న పిల్ల పురుగులు ఆకుల నుంచి రసాన్ని పీలుస్తాయి. దీనివల్ల ఆకులు ముడుచుకునిపోతాయి. నల్లదోమ విసర్జన నుంచి వచ్చే తేనె లాంటి పదార్థం ఆకులపై పడి శిలీంద్రాలు పెరుగుతాయి. దీనివల్ల నల్లటి బూజు ఏర్పడి, కిరణజన్య సంయోగక్రియ జరుగక చెట్లు క్షీణిస్తాయి. ఆకులు ముదరకముందే రాలిపోతాయి. నల్లదోమ ఆశించిన చెట్లలో పూత, కాయల పరిమాణం, నాణ్యత తగ్గిపోయి కాయలకు మార్కెట్లో ధర ఉండదు.

**నివారణ:** చెట్లలోని ఎండు కొమ్మలను, నీటి కొమ్మలను కత్తిరించి మొక్కలకు బాగా గాలి తగిలేటట్లు చేయాలి. ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి ఆకుల అడుగుభాగం, పైభాగం బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి.

## రైతుబడికి ఆహ్వానం

రైతు పంట పొలాలే జీవితంగా వ్యవసాయంలో రేయింబవళ్లు పనిచేస్తాడు. తమవైన అనుభవాలు, గుణపాఠాలతో మెరుగైన, మేలైన పంట విధానాల కు జీవం పోస్తాడు. ఇలాంటి అనుభవాలు పదిమందితో పంచుకుంటే రైతులకు మరింత మేలు జరుగుతుంది. కాబట్టి రైతులు తమవైన అనుభవాలు, గుణపాఠాలతో పాటు, తమ సృజనాత్మక పనిలో భాగంగా కొత్తగా ఆవిష్కరించిన పనిముట్ల గురించి రైతుబడికి రాసి పంపించగలరు.



రచనలు పంపవలసిన చిరునామా
8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. raithubadi@ntdaily.news,
Fax-040-23291118

# కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

## లష్కరే ఉగ్రవాది హతం.. పోలీస్ అధికారి మృతి



ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన ఎస్పీవో బిలాల్ అహ్మద్ అంతిమయాత్ర దృశ్యం

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లోని బారాముల్లాలో బుధవారం జరిగిన ఎదురు కాల్పుల్లో లష్కరేతాయిబా ఉగ్రవాది హతమయ్యాడు. ప్రత్యేక పోలీస్ అధికారి ఒకరు చనిపోయారు, మరో సబ్‌ఇన్‌స్పెక్టర్ గాయపడ్డారు. జమ్ముకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత తొలి ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ చేపట్టామని, మంగళవారం ప్రారంభమైన ఎన్‌కౌంటర్ బుధవారం ముగిసిందని ఓ పోలీస్ అధికారి తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన ఉగ్రవాది మోమిన్‌గోజ్రీ బారాముల్లాకే చెందినవాడని, లష్కరేతాయిబా సంస్థలో పనిచేస్తున్నాడని, పలు ఉగ్రవాద నేరాల్లోనూ పాలుపంచుకున్నాడని పోలీసులు పేర్కొన్నారు. ఘటనా స్థలం నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఉగ్రవాదుల కాల్పుల్లో ఎస్పీవో బిలాల్ అహ్మద్ వీర మరణం పొందారని, గాయపడిన సబ్‌ఇన్‌స్పెక్టర్ అమర్‌దీప్ పరిహార్ బదామీబాగ్ కంటోన్మెంట్‌లోని ఆర్మీబేస్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారని చెప్పారు.

# కరెంటు తీగ తగిలి కూలిన హెలికాప్టర్

## పైలట్, కో పైలట్ సహా ముగ్గురు దుర్మరణం

## వరద బాధితులకు సామగ్రి అందించి వస్తుండగా దుర్ఘటన



**డెహ్రాడూన్, ఆగస్టు 21:** వరద సహాయ చర్యల్లో పాల్గొంటున్న ఓ హెలికాప్టర్ ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలో బుధవారం విద్యుత్ తీగలు తగిలి కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో హెలికాప్టర్‌లో ఉన్న పైలట్ రాజ్‌పాల్, కో పైలట్ కప్తల్‌లాల్, రమేశ్ సవార్ అనే స్థానికుడు మరణించినట్టు అధికారులు తెలిపారు. హెరిటేజ్ ఏవియేషన్‌కు చెందిన ఈ హెలికాప్టర్‌కు కరెంటు వైర్లు తగలడంతో ఉత్తరకాశీ సమీపంలోని మోల్డి గ్రామం వద్ద కుప్పకూలింది. వరదలో చిక్కుకున్న ప్రాంతాల్లో నిర్వాసితులకు సహాయ సామగ్రిని సరఫరాచేసి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాద ఘటనపై పౌరవిమానయాన సంస్థకు చెందిన డైరెక్టర్ జనరల్ ప్రాథమిక విచారణకు ఆదేశించారు. ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ఈ ఘటనపై దర్యాప్తు జరుపనున్నది. హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెందినవారి కుటుంబాలకు ఉత్తరాఖండ్ సీఎం త్రివేంద్ర సింగ్ రావత్ రూ.15 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించారు. భారీ వర్షాలకు ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలోని గ్రామాలు అతలాకుతలమయ్యాయి. గతవారం కురిసిన వానలకు 16 మంది చనిపోయారు. వర్షాల ధాటికి 70 ఇండ్లు నేలమట్టమయ్యాయి. 115 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. నాలుగు వంతెనలు ధ్వంసమయ్యాయి.



# ద్వైపాక్షికంగా పరిష్కరించుకోవాలి

- కశ్మీర్ అంశంపై భారత్-పాక్‌లకు బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్ స్పష్టీకరణ
- సీమాంతర ఉగ్రవాదాన్ని నిరోధించాల్సిన బాధ్యత పాక్‌దే: అమెరికా
- చర్చలతోనే శాంతి సుస్థిరత సాధ్యమన్న ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి
- లండన్‌లోని భారత హైకమిషనరేట్ వద్ద విధ్వంసంపై బ్రిటన్ ప్రధాని విచారం



శ్రీనగర్‌లోని లాల్‌చౌక్‌లో పహారా కాస్తున్న సైన్యం



బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్

**వాషింగ్టన్, పారిస్, లండన్, న్యూఢిల్లీ, ఆగస్టు 21:** జమ్ముకశ్మీర్ అంశం భారత్, పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షికమేనని ఐక్యరాజ్యసమితి (ఐరాస) భద్రతామండలిలో శాశ్వత సభ్యదేశాలు అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ తేల్చి చెప్పాయి. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని భారత్ రద్దుచేసిన నేపథ్యంలో ఇరు దేశాలు చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించాయి. ఉద్రిక్తతల నివారణకు కృషి చేయాలని పేర్కొన్నాయి. జమ్ముకశ్మీర్ వివాదం భారత్, పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక అంశమని బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ పేర్కొన్నారు. కశ్మీర్‌పై భారత ప్రధాని మోదీతో బోరిస్ జాన్సన్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా లండన్‌లోని భారత్ హైకమిషనరేట్ వద్ద పాక్ మద్దతుదారుల విధ్వంసకాండపై బోరిస్ జాన్సన్ విచారం వ్యక్తంచేశారు. పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సన్నిహితుడు జుల్ఫీ బుఖారీ సారథ్యంలో ఆయన మిత్రులు లండన్‌కు వెళ్లి భారత హైకమిషనరేట్ వద్ద చేపట్టిన నిరసన హింసాత్మకంగా మారింది. మోదీ, జాన్సన్ మధ్య కశ్మీర్‌లో ప్రస్తుత పరిస్థితులతోపాటు భారత్-బ్రిటన్ భాగస్వామ్య సంబంధాలపై చర్చ సాగిందని బ్రిటన్ ప్రధానమంత్రి కార్యాలయం అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. మరోవైపు భారత్, పాకిస్థాన్ తమ మధ్యగల విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని తనకు ఫోన్ చేసిన పాక్ విదేశాంగమంత్రి షా మహమ్మద్ ఖురేషికి ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జీన్ య్వెస్ లీ డ్రయాన్ తేల్చి చెప్పారు. కశ్మీర్ వివాదం భారత్, పాక్ ద్వైపాక్షిక అంశమని స్పష్టంచేశారు. ఇరు దేశాల అధినేతలు నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ఈ ప్రాంతంలో శాంతి సుస్థిరతలను సాధించేందుకు చర్యలు తీసుకోవాలని డ్రయాన్ కోరారని ఫ్రాన్స్ విదేశాంగశాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

### కశ్మీర్‌పై ప్రత్యక్ష చర్చలకు మద్దతునిస్తాం: అమెరికా

కశ్మీర్‌పై నేరుగా ప్రత్యక్ష చర్చలు జరిపేందుకు భారత్, పాకిస్థాన్ చేపట్టే చర్యలకు మద్దతునిస్తామని అమెరికా సీనియర్ దౌత్యవేత్త ఒకరు పేర్కొన్నారు. ఈ క్రమంలో పాకిస్థాన్ తన భూభాగం నుంచి సీమాంతర ఉగ్రవాదాన్ని నిలిపివేసేందుకు తీసుకున్న చర్యలను రుజువు చేసుకోవడం చాలా ముఖ్యమని నొక్కి చెప్పారు. ఇటీవల కశ్మీర్‌లో నెలకొన్న పరిణామాలను సాకుగా చూపి పాక్ సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడాన్ని అనుమతించబోమని అమెరికా దౌత్యవేత్త సంకేతాలిచ్చారు. 'కశ్మీర్‌లో పరిస్థితులను సునిశితంగా గమనిస్తున్నాం. ప్రశాంత వాతావరణాన్ని కొనసాగిస్తూ, ఉద్రిక్తతల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. జమ్ముకశ్మీర్‌లో తాజా పరిణామాల వల్ల ఈ ప్రాంతంలో అస్థిరత పెరిగేందుకు అవకాశం ఉంది' అని చెప్పారు. కశ్మీర్‌లో ప్రజలపై ఆంక్షలు, నిర్బంధం కొనసాగుతున్నాయని వస్తున్న వార్తలపై అమెరికా తీవ్ర ఆందోళన చెందుతున్నదన్నారు. వ్యక్తిగత హక్కులను గౌరవించాలని అన్నారు.

## మధ్యవర్తిత్వానికి సిద్ధం!



- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పునరుద్ఘాటన
- జీ7 సదస్సు సందర్భంగా మోదీతో కశ్మీర్ గురించి చర్చిస్తానని వెల్లడి

**వాషింగ్టన్, ఆగస్టు 21:** భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతకు దారితీసిన కశ్మీర్ అంశాన్ని పరిష్కరించడానికి మధ్యవర్తిత్వం వహిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి చెప్పారు. ఆర్టికల్ 370ను భారత ప్రభుత్వం రద్దు చేసిన తర్వాత జమ్ముకశ్మీర్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నదని, ఆ రాష్ట్రంలో శాంతి నెలకొల్పేందుకు తాను కృషి చేయడాన్ని సంతోషంగా భావిస్తానన్నారు. ఈ వారాంతంలో ఫ్రాన్స్‌లో జరుగనున్న జీ7 సదస్సు సందర్భంగా ప్రధాని మోదీతో భేటీ కానున్నానని, ఈ సందర్భంగా జమ్ముకశ్మీర్ గురించి ఆయనతో చర్చిస్తానని పేర్కొన్నారు. మంగళవారం ఆయన వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ 'కశ్మీర్‌లో ఉద్రిక్త పరిస్థితులు ఇటు భారత్, అటు పాకిస్థాన్ మధ్య మరింత వైరాన్ని పెంచుతున్నాయి. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతకు దారితీసిన కశ్మీర్ అంశం గురించి మోదీతో చర్చించి పరిస్థితులు సాధారణస్థితి వచ్చేలా కృషి చేస్తా' అని తెలిపారు. కశ్మీర్ అనేది ఒక సంక్లిష్ట అంశమని, ఇది ఎన్నో ఏండ్ల నుంచి కొనసాగుతున్నదని చెప్పారు. కానీ ఇప్పటికీ ఈ సమస్యకు పరిష్కారం లభించలేదన్నారు. అందుకే తాను చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలనుకుంటున్నానని పేర్కొన్నారు. 'ఇటీవల పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అమెరికాకు వచ్చి నాతో సమావేశమయ్యారు. మరోవైపు ఈ వారాంతంలో ఫ్రాన్స్‌లో జరుగనున్న జీ7 సదస్సు సందర్భంగా ప్రధాని మోదీతో భేటీ అవుతా. కశ్మీర్ గురించి చర్చిస్తా' అని ట్రంప్ వివరించారు. 'కశ్మీర్ చాలా సంక్లిష్టమైన ప్రాంతం. అక్కడ హిందువులు, ముస్లింలు ఉన్నారు. వారి మధ్య అంత సామరస్యత కనిపించడంలేదు. ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతున్నది' అని పేర్కొన్నారు. 'వాస్తవంగా చెప్పాలంటే కశ్మీర్‌లో భీకర పరిస్థితి ఉన్నది. సోమవారం మోదీతోనూ, ఇమ్రాన్‌ఖాన్‌తోనూ మాట్లాడాను. వారిద్దరూ నాకు మంచి మిత్రులు. గొప్ప వ్యక్తులు కూడా. వారు తమ దేశాన్ని ప్రేమిస్తారు. కానీ కశ్మీర్ విషయంలో వీరిద్దరు క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారు' అని ట్రంప్ తెలిపారు.



సంత్ రవిదాస్ మందిర్ కూల్చివేతకు నిరసనగా ఢిల్లీలో బుధవారం ర్యాలీ నిర్వహిస్తున్న దళిత సంఘాలు

# ఢిల్లీలో దళితుల ఆందోళన

- సంత్ రవిదాస్ మందిర్ కూల్చివేతపై భారీ ఎత్తున నిరసన
- మందిరాన్ని పునర్ నిర్మించాలని డిమాండ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం దళిత సంఘాలు భారీ ఆందోళన చేపట్టాయి. సంత్ రవిదాస్ మందిర్ కూల్చివేతపై నిరసన వ్యక్తం చేశాయి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఢిల్లీ అభివృద్ధి సంస్థ ఆగస్టు 10న తుగ్లకాబాద్ అటవీ ప్రాంతంలోని సంత్ రవిదాస్ మందిరాన్ని కూల్చివేసింది. దీనిని నిరసిస్తూ ఆగస్టు 13న పంజాబ్‌లో దళిత సంఘాలు ఆందోళనకు దిగాయి. దేశవ్యాప్తంగా ఉన్న దళిత సంఘాలు కలిసి 'అఖిల భారతీయ సంత్ శిరోమణి గురు రవిదాస్ మందిర్ సంయుక్త సంరక్షణ సమితి'గా ఏర్పడి చలో ఢిల్లీకి పిలుపునిచ్చాయి. దీంతో బుధవారం పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్‌తోపాటు దేశంలోని ఇతర ప్రాంతాలకు చెందిన దళితులు పెద్ద సంఖ్యలో ఢిల్లీకి తరలివచ్చారు. నీలి రంగు టోపీలు, జెండాలతో జండేవాలన్ ప్రాంతంలోని అంబేద్కర్ భవన్ నుంచి రామ్‌లీలా మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. దీంతో ట్రాఫిక్‌కు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. రామ్‌లీలా మైదానానికి చేరిన దళితులు అక్కడ భారీ సభ నిర్వహించారు. ఢిల్లీ సామాజిక న్యాయ మంత్రి రాజేంద్రపాల్ గౌతమ్, భీమ్ ఆర్మీ అధినేత చంద్రశేఖర్ ఆజాద్, తదితరులు ఈ సభలో పాల్గొన్నారు. కొందరు ఆమరణ నిరాహార దీక్షలకు దిగారు. సంత్ రవిదాస్ మందిర్‌ను కూల్చిన చోటనే పునర్ నిర్మించాలని దళిత నేతలు డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరుపై వారు మండిపడ్డారు. తమ వర్గానికి జరిగిన అన్యాయంపైనే తమ పోరాటమని, సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా కాదని మంత్రి గౌతమ్ తెలిపారు. దళిత సంఘాలకు చెందిన మందిరాలు, అంబేద్కర్ విగ్రహాలను మాత్రమే ఎందుకు కూల్చివేస్తున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

### అయోధ్యలో రామ మందిరం లాంటిదే మా డిమాండ్: హన్స్‌రాజ్

అయోధ్యలో రామ మందిరాన్ని నిర్మించాలన్న డిమాండ్ లాంటిదే తమ డిమాండ్ అని పంజాబ్ జలంధర్‌కు చెందిన హన్స్‌రాజ్ అన్నారు. రవిదాస్ మందిరాన్ని మరోచోట నిర్మించుకోమని కొందరు చెబుతున్నారని, రామ మందిరాన్ని కూడా అయోధ్యలో కాకుండా మరోచోట నిర్మించుకోవచ్చుగా అని సోను ప్రశ్నించారు. 'మేం ఈ దేశ పౌరులం కాదా'? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. మరోవైపు ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం ఈ వివాదంపై దళితులను రెచ్చగొడుతున్నదని బీజేపీ నేత, కేంద్ర మాజీ మంత్రి విజయ్ గోయల్ ఆరోపించారు.

# పీహెచ్‌సీల్లో 24 గంటల వైద్యం!

- గ్రామీణ వైద్యసేవల పటిష్ఠతపై ప్రభుత్వం దృష్టి
- రూ.70 కోట్లతో పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో వసతులు
- రోగనిర్ధారణ పరీక్షలకు అనువైన ల్యాబ్‌ల ఏర్పాటు
- ప్రణాళికలు రూపొందించిన వైద్య, ఆరోగ్యశాఖ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడమే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని పీహెచ్‌సీల పరిధిలో 24 గంటల వైద్యం అందించడంపై కూడా దృష్టిపెట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు విస్తరించేందుకు రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో (సీహెచ్‌సీ) సౌకర్యాలు కల్పించనున్నది. రూ.70 కోట్ల నిధులతో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలను అభివృద్ధిపరిచేందుకు వైద్య, ఆరోగ్యశాఖ ప్రణాళికలు రూపొందించింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ వైద్యం రంగంలో అనేక వినూత్న మార్పులు తీసుకొచ్చారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం సర్కారు దవాఖానల ఆధునీకరణ, సేవల విస్తరణ వంటి అనేక నిర్ణయాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయి. కేసీఆర్ కిట్, డయాలసిస్ కేంద్రాలు వంటివి నిరుపేదలకు వైద్యసేవలను మరింత దగ్గర చేశాయి. ఇప్పుడు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలను బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లకుండా వైద్యసేవలు పొందేందుకు అవకాశం కలుగనున్నది. రాష్ట్రంలో మొత్తం 636 పీహెచ్‌సీల్లో 3,908 బెడ్లు, 41 సీహెచ్‌సీల్లో 1,186 బెడ్లు అందుబాటులో ఉన్నాయి. పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో తొలుత మంచినీటి కొరత తీర్చగలిగితే రోగులకు అవస్థ తొలగడంతోపాటు పరిశుభ్రత కూడా మెరుగుపడుతుందని వైద్యశాఖ భావిస్తున్నది. మెరుగైన వైద్య అందించడంతోపాటు రక్తం, మూత్ర పరీక్షలు వంటివి జరిపి రోగనిర్ధారణ చేసుకునేందుకు వీలుగా ల్యాబ్‌లను ఏర్పాటుచేయాలని చూస్తున్నది. ఇప్పటికే కొన్నికేంద్రాల్లో ఇవి అందుబాటులో ఉన్నాయి. పీహెచ్‌సీలకు కావాల్సిన మందులు, ఇతర మౌలిక సదుపాయాలు వంటి 12 అంశాలను నిర్ధారించుకుని వసతులు కల్పించేందుకు రూ.70 కోట్లు వినియోగించనున్నారు.

### ప్రధానంగా చేపట్టే చర్యలు

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించడం, మందులను అందుబాటులో ఉంచడం.
- అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు రోగనిర్ధారణ పరీక్షలకు అనువైన ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకురావడం
- దవాఖానల్లో నిత్యం కొత్త బెడ్‌షీట్లు మార్చడం, రోగులకు ఉచితంగా మందులు అందించడం వంటివి అమలుచేయనున్నారు.



పచ్చదనంతో పరవశిస్తున్న యాదాద్రి

# యాదాద్రికి హరిత సొబగులు

- కనువిందు చేస్తున్న పచ్చదనం

**యాదాద్రి భువనగిరి జిల్లా నమస్తే తెలంగాణ:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి నడయాడిన నేల హరితవనంతో పులకరిస్తున్నది. పచ్చదనంతో పరవశిస్తున్నది. 250 ఎకరాల్లో రూ.200 కోట్లతో చేపట్టిన టెంపుల్ సిటీలోని ప్రతి అంగుళం పచ్చదనంతో నిండిపోగా, రూ.20 కోట్ల అంచనాలతో చేపట్టిన కొండ చుట్టూ సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయి. టెంపుల్ సిటీ యాదాద్రిని చూసిన భక్తులు, పర్యాటకులు ముచ్చటపడుతున్నారు. ల్యాండ్ స్కేపింగ్ పనులు యాదాద్రికి కొత్త అందాన్ని తెచ్చిపెడుతున్నాయి. యాదాద్రికొండ చుట్టూ చక్కటి ల్యాండ్ స్కేపింగ్‌కు తోడు మూడంచెల్లో కొండను అందంగా తీర్చిదిద్దే పనులు జరుగుతున్న తీరుతో కొండంతా శోభాయమానంగా మారుతున్నది. యాదాద్రి కొండపైకి వచ్చే భక్తుల సౌకర్యార్థం అధికారులు ఘాట్‌రోడ్లపై పచ్చని పచ్చిగబయళ్లతోపాటు వివిధ రకాల మొక్కలను నాటడంతో దారిపొడవునా పచ్చనితోరణాలే దర్శనమిస్తున్నాయి. యాదాద్రి పుణ్యక్షేత్రాన్ని గ్రీన్‌సిటీగా మార్చాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించడంతో వైటీడీఏ అధికారులు ఆ దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఏటా తెలంగాణకు హరితహారంలో భాగంగా మొక్కలు నాటుతున్నారు. నాలుగువిడుతల్లో నాటిన మొక్కలు సైతం ఇప్పుడు పచ్చగా దర్శనమిస్తున్నాయి. రూ.110 కోట్లతో చేపట్టిన రాయిగిరి-యాదాద్రి నాలుగు వరుసల రోడ్లకు ఇరువైపులా ఏర్పాటుచేసిన పచ్చదనం.. పచ్చకబయళ్లు కనువిందు చేస్తున్నాయి. భక్తులు, పర్యాటకులు, ఇతర ప్రయాణికులు ఇక్కడ ఆగి సేదతీరుతున్నారు.

### ప్రభుత్వశాఖలు సైతం హరితహారంలో...

యాదగిరిగుట్ట పట్టణంలో ప్రభుత్వశాఖల సహకారంతో గ్రీన్‌సిటీగా యాదాద్రి కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా ప్రణాళికలను రూపొందించి యాదాద్రి పట్టణాన్ని హరితవనంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేస్తున్నారు. వివిధ పాఠశాలలు, హాస్టళ్లు, వైద్య, ఇతర సంస్థల ఆధ్వర్యంలో హరితహారం నిర్వహిస్తున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో యాదాద్రిలో ఏర్పాటుచేసిన నర్సరీల ద్వారా స్థానికులకు మొక్కలు పంపిణీ చేస్తున్నారు. నీడనిచ్చే మొక్కలతో పాటు పండ్ల మొక్కలు పంపిణీ చేపడుతున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో గతేడాది యాదాద్రి పట్టణంలో కిలోమీటర్‌కు పైగా మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపట్టడంతో పచ్చగా మారాయి.

# బాలుడి నిజాయితీ

## దొరికిన బంగారు ఉంగరాన్ని పోగొట్టుకున్నవారికి ఇచ్చిన భరత్



తనకు దొరికిన ఉంగరాన్ని తిరిగి పోగొట్టుకున్నవారికి అందజేస్తున్న భరత్

**చివ్వెంల:** నాలుగో తరగతి చదువుతున్న ఓ బాలుడు తనకు దొరికిన బంగారపు ఉంగరాన్ని బాధితులకు అందజేసి నిజాయితీ చాటుకున్నాడు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం ఖాసింపేటకు చెందిన రేగట్టి మహేశ్ తన కుమారుడి అన్నప్రాసన కార్యక్రమం రెండు నెలల క్రితం స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించారు. ఆ సమయంలో 5 గ్రాముల బంగారు ఉంగరం కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులతో కలిసి వెతికినా దొరకలేదు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం గ్రామానికి చెందిన ఆల్దాస్ భరత్ అనే నాలుగో తరగతి విద్యార్థి పాఠశాల ముగిసిన అనంతరం తోటి స్నేహితులతో ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఆడుకుంటుండగా బంగారపు ఉంగరం దొరికింది. వెంటనే దానిని తీసుకెళ్లి మహేశ్ కుటుంబ సభ్యులకు అందజేశాడు. అన్నప్రాసన రోజు ఘటన స్థలంలో ఉండి తాను కూడా బంగారు ఉంగరం వెతికినట్లు భరత్ తెలిపాడు. బుధవారం భరత్ చదువుతున్న పాఠశాలకు వెళ్లి మహేశ్ భరత్‌ను అభినందించారు.



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చిని కొనుగోలు చేసేందుకు జెండాపాట నిర్వహిస్తున్న దృశ్యం

# మిర్చి @15,200

## ఖమ్మం మార్కెట్‌లో రికార్డు ధర పలికిన తేజారకం

**ఖమ్మం వ్యవసాయం:** ఎర్రబంగారం ఎండు మిర్చి ధర మండిపోయింది. ఖమ్మం వ్యవసాయమార్కెట్‌లో బుధవారం రికార్డు స్థాయి ధర పలికింది. ఉదయం జరిగిన జెండాపాటలో మిర్చి ఖరీదుదారులు తేజారకం మిర్చిని క్వింటాల్‌కు ఒక్కింటికి రూ. 15,200 నిర్ణయించి కొనుగోలు చేశారు. శీతలగిడ్డంగుల్లో నిల్వ ఉంచిన ఏసీ మిర్చి ఎన్నడూ లేనివిధంగా ధర పలకడంతో రైతులు, అధికారులు హర్షం వ్యక్తంచేశారు. ఇంతకాలం శీతల గిడ్డంగులలో నిల్వఉంచుకున్న రైతులు, వ్యాపారులకు ఈ ధర కలిసి వచ్చినట్టయింది. జాతీయ మార్కెట్లో తేజారకం మిర్చి పంటకు డిమాండ్ ఉండటం, అవసరమైన మేర పంట ఉత్పత్తి లేకపోవడమే ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు. సీజన్ ఆరంభంలో రైతులు కొందరు మార్కెట్‌కు పంటను తీసుకొచ్చి విక్రయించుకోగా.. మరికొందరు కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వచేసుకున్నారు. ప్రస్తుతం మిర్చి మార్కెట్‌కు రాకపోవడం, అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ పెరడంతో రైతులు తాము నిల్వ ఉంచుకున్న పంటను అమ్ముకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఉదయం మార్కెట్లో జరిగిన జెండాపాటలో ఏసీ రకం మిర్చి గరిష్ఠంగా రూ.15,200 పలుకగా.. సాధారణ రకం రూ.7 వేలు పలికింది. సాధారణరకం కనిష్ఠ ధర రూ. 5వేలు కాగా, మధ్యధర రూ. 6వేలు చొప్పున పలికింది. తాలు రకం పంటను రూ 4వేలకు కొనుగోలుచేశారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఎండుమిర్చికి రికార్డు స్థాయి ధర పలకడం శుభసూచకమని ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ మద్దినేని వెంకటరమణ తెలిపారు.

# యూపీలో మంత్రివర్గ విస్తరణ

## రాజ్‌భవన్‌లో 23 మంది మంత్రుల ప్రమాణస్వీకారం

**లక్నో:** ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ బుధవారం మంత్రివర్గ విస్తరణ చేపట్టారు. ఆ రాష్ట్ర గవర్నర్ ఆనందీబేన్ పటేల్ 23 మంది మంత్రులతో ప్రమాణం చేయించారు. బీజేపీ యూపీలో 2017లో అధికారంలోకి వచ్చాక ఇదే తొలి మంత్రివర్గ విస్తరణ. ఇందులో ఇద్దరు కొత్తవారితోపాటు, మరో నలుగురు సహాయ మంత్రులకు క్యాబినెట్ మంత్రులుగా పదోన్నతి లభించింది. మరో ఆరుగురిని ఇండిపెండెంట్ ఇంచార్జి సహాయ మంత్రులుగా, 11 మందిని కొత్తగా సహాయ మంత్రులుగా మంత్రివర్గంలో చేర్చుకున్నారు. వివిధ సామాజికవర్గాలవారికి తన మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించారు. ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్‌తోపాటు ఇద్దరు ఉపముఖ్యమంత్రులు కలుపుకొని ప్రస్తుతం యూపీ ప్రభుత్వ మంత్రివర్గంలో మంత్రుల సంఖ్య 43కు చేరింది. రాష్ట్రంలో రానున్న 2022 అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీ చేపట్టిన మంత్రివర్గ విస్తరణ ఆ పార్టీ క్షేత్రస్థాయి రాజకీయాలను మరింత పటిష్ఠం చేయనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. తమ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఈ చర్య చేపట్టిందని మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్‌యాదవ్ మంత్రివర్గ విస్తరణను తప్పుపట్టారు.

## బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులకు ఓరియంటేషన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు బుధవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలకమండలి సభ్యుడు డాక్టర్ మనోహర్‌రావు హాజరై.. వ్యవసాయ కళాశాలలో ఉన్న సదుపాయాలు, వ్యవసాయరంగంలో ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు వివరించారు. బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సు నియమనిబంధనలను అసోసియేట్ డీన్ డాక్టర్ సీమ వివరించారు.

# రాజధాని మార్పు నిర్ణయమేం లేదు

## వైఎస్సార్సీపీ పార్లమెంటరీ పక్ష నేత విజయసాయిరెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని తరలించనున్నారని జరుగుతున్న ప్రచారంలో నిజంలేదని వైఎస్సార్సీపీ పార్లమెంటరీ పక్ష నేత విజయసాయి రెడ్డి స్పష్టంచేశారు. రాజధానిపై ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకొంటే తప్పకుండా చెప్తామని బుధవారం అమరావతిలో మీడియాకు వెల్లడించారు. ఇంతవరకు తీసుకోని నిర్ణయంపై చర్చ అనవసరమన్నారు. రాజధాని అమరావతికి వరద ముంపు ముప్పు ఉన్నదన్నది నిజమని పేర్కొన్నారు. భారీ వర్షాలు, వరదలు వచ్చినప్పుడు కొండవీటి వాగుతో రాజధాని అమరావతి ముంపునకు గురయ్యే ప్రమాదం ఉన్నదని చెప్పారు.

epaper.ntnews.com

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
గురువారం 22 ఆగస్టు 2019



మహబూబాబాద్ జిల్లా కొమ్ముల వంచ గ్రామానికి చెందిన వెంకటేష్ కందునూరి చిన్నప్పటి నుంచి నటుడు చిరంజీవి వీరాభిమాని. మైసూర్ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కోర్సును పూర్తిచేసిన వెంకటేష్ చిరంజీవి మీద ఉన్న అభిమానంతో 'సైరా' చిత్రానికి సంబంధించి సింబాలిక్ చిత్రాన్ని పెన్సిల్ స్కెచ్ వేశారు. దాదాపు రెండు నెలల పాటు కష్టపడి ఈ స్కెచ్‌ను రూపొందించానని, ఈ చిత్రంలో స్వాతంత్ర్య సమరానికి చిహ్నంగా సారానాథ్ స్థూపాన్ని, పోరాటానికి సింబాలిక్‌గా గద్దను, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వ్యక్తిత్వానికి గుర్తుగా సింహాన్ని చిత్రీకరించడం జరిగిందని, ఇది పూర్తిగా తన ఊహాచిత్రమేనని, మెగాస్టార్ చిరంజీవి జన్మదినం సందర్భంగా ఆయనకు ఈ పెన్సిల్ స్కెచ్‌ను బహూకరించాలనే కోరిక ఉందని వెంకటేష్ తెలిపారు.



'సాహో' చిత్రంలో ప్రభాస్, జాక్వెలిన్ ఫెర్నాండేజ్

# పైరసీపై పోరుకు..



సి.కల్యాణ్, రామ్‌మోహన్‌రావు, బసిరెడ్డి,కె.ఎస్.రామారావు, మురళీమోహన్,విజేందర్‌రెడ్డి తదితరులు

'పైరసీని అరికట్టడానికి డీ డిజిటల్ చేస్తున్న ప్రయత్నం సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను' అని అన్నారు తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పి.రామ్‌మోహన్‌రావు. డీ డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ డెమోను మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ చైర్మన్ రామ్‌మోహన్‌రావుతో పాటు తెలంగాణ స్టేట్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కె.మురళీమోహన్, సెక్రటరీ సునీల్ నారంగ్, తెలుగు నిర్మాతల మండలి అధ్యక్షుడు సి.కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు. రామ్‌మోహన్‌రావు మాట్లాడుతూ 'డిజిటల్ డెలివరీ రేట్స్ నిర్మాతలందరికి అందుబాటులోకి రావాలి' అని తెలిపారు. డిజిక్వెస్ట్ అధినేత బసిరెడ్డి మాట్లాడుతూ 'పైరసీ కారణంగా నిర్మాతలు నష్టపోతున్నారు. దీనిని అరికట్టడానికి రెండేళ్లుగా కృషిచేస్తున్నాం. డి డిజిటల్ సర్వీస్ సినిమాను పైరసీ కాకుండా కాపాడుతుంది' అని తెలిపారు. ఈ కొత్త విధానానికి అందరూ సహకరించాలని సి.కల్యాణ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మోహన్‌వడ్లపట్ల, బాల గోవింద్, దామోదర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పెన కోసం



విజయ్ సేతుపతి

ప్రముఖ నటుడు చిరంజీవి మేనల్లుడు పంజా వైష్ణవ్ తేజ్ కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'ఉప్పెన'. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ పతాకాలపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, మోహన్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బుచ్చిబాబు సానా దర్శకుడు. క్రితిశెట్టి కథానాయిక. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది. తమిళ నటుడు విజయ్ సేతుపతి ఈ సినిమాలో కీలక పాత్రను పోషిస్తున్నారు. బుధవారం నుంచి ఆయన షూటింగ్‌లో పాల్గొన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'ప్రస్తుతం హైదరాబాద్‌లోని సారథి స్టూడియోలో ఆర్ట్ డైరెక్టర్స్ మోనిక, రామకృష్ణ ప్రత్యేకంగా వేసిన భారీ సెట్‌లో వైష్ణవ్‌తేజ్, విజయ్ సేతుపతితో పాటు ప్రధాన తారాగణంపై కీలక ఘట్టాలను చిత్రీకరిస్తున్నాం. ఇప్పటివరకు నలభై శాతంషూటింగ్ పూర్తయింది. ప్రముఖ దర్శకుడు సుకుమార్ వద్ద సహాయకుడిగా పనిచేసిన బుచ్చిబాబు వినూత్న కథ, కథనాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్.

# బన్నీతో ఐటెంసాంగ్?

ఎన్టీఆర్ హీరోగా నటించిన 'జనతా గ్యారేజ్' చిత్రంలో 'పక్కా లోకల్..' అనే ప్రత్యేక గీతంలో మాస్ శైలి నృత్యాలతో అభిమానుల్ని ఫిదా చేసింది కాజల్ అగర్వాల్. తాజాగా ఆమె మరో ఐటెంసాంగ్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. అల్లు అర్జున్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'అల వైకుంఠపురంలో'. కుటుంబ అనుబంధాలు, అప్యాయతల కలబోతగా త్రివిక్రమ్ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో కథానుగుణంగా ఓ ప్రత్యేక గీతాన్ని తెరకెక్కించేందుకు దర్శకుడు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ పాటలో కాజల్ నటించబోతున్నట్లు చెబుతున్నారు. సాహిత్య ప్రధానంగా సందర్భానుసారం వచ్చే విలక్షణ గీతం కావడంతో ఈ ఐటెంసాంగ్‌లో నటించడానికి కాజల్ అంగీకరించినట్లు సమాచారం. త్వరలో ఈ పాటను అల్లు అర్జున్, కాజల్‌లపై భారీ హంగులతో తెరకెక్కించనున్నట్లు తెలిసింది. పూజా హెగ్డే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో టబు, సుశాంత్ కీలక పాత్రలను పోషిస్తున్నారు. హారిక హాసిని, గీతా ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకురానుంది.



కాజల్ అగర్వాల్

# రామారావు అనుభవాలు మాకు పాఠాలు!



ఐశ్వర్యారాజేష్, విజయ్ దేవరకొండ, రాశీఖన్నా

'కె.ఎస్. రామారావు సినిమాల్ని ప్రేమిస్తుంటారు. సినిమాలే ఆయన జీవితం. ఎంత సంపాదించిన.. పోగొట్టుకున్నా సినిమాల్లోనేనని ఇది తప్ప తనకు మరో వ్యాపారం తెలియదని నాతో అన్నారు. రామారావు అనుభవాలు మాకు పాఠాలుగా ఉపయోగపడతాయి' అని అన్నారు హీరో విజయ్ దేవరకొండ. ఐశ్వర్యారాజేష్, రాజేంద్రప్రసాద్, కార్తిక్‌రాజు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కౌసల్య కృష్ణ మూర్తి..ది క్రికెటర్'. క్రియేటివ్ కమర్షియల్స్ పతాకంపై కె.ఎస్.రామారావు సమర్పణలో కె.ఎ వల్లభ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భీమనేని శ్రీనివాసరావు దర్శకుడు. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి విజయ్‌దేవరకొండ, హీరోయిన్ రాశీఖన్నా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'కె.ఎస్.రామారావు సంస్థలో ప్రస్తుతం ఓ సినిమా చేస్తున్నాను. ఆయన కోసమే ఈ వేడుకకు వచ్చాను. 'పెళ్లిచూపులు' నచ్చి మనం కలిసి సినిమా చేద్దామని కె.ఎస్.రామారావు.. క్రాంతిమాధవ్‌ను తీసుకొని నా దగ్గరకు వచ్చారు. రామారావును మేము డాడీ అని పిలుస్తుంటాం. ప్రతిరోజు సెట్స్‌కు వస్తారాయన. తండ్రిలా సినిమా ఏం కావాలో అన్ని దగ్గరుండి చూసుకుంటారు' అని తెలిపారు. చిత్ర సమర్పకుడు కె.ఎస్.రామారావు మాట్లాడుతూ 'విజయ్ దేవరకొండ, క్రాంతిమాధవ్ కలయికలో వస్తున్న సినిమా కోసం హీరోయిన్‌ను వెతుకుతున్న సమయంలో ఐశ్వర్యారాజేష్ నటించిన తమిళ చిత్రం 'కణా' టీజర్ చూశాను. ఆమె అభినయంతో పాటు కథ నచ్చడంతో చిత్ర రీమేక్ హక్కుల్ని పోటీపడి తీసుకున్నాను. మాతృక కంటే ఎక్కువ కష్టపడి ఐశ్వర్యారాజేష్ ఈ సినిమా చేసింది. ఈ ఏడాది ఓ గొప్ప సినిమా చూశామనే అనుభూతిని ప్రతి ఒక్కరికి కలిగిస్తుంది. ఈ నెల 23న విడుదల చేస్తున్నాం'అన్నారు. మహిళా క్రికెట్ నేపథ్యంలో సాగే చిత్రమిదని, మాతృకలోని ఆత్మను తీసుకొని తన శైలికిఅనుగుణంగా సినిమాను రూపొందించానని దర్శకుడు భీమనేని శ్రీనివాసరావు చెప్పారు. తెలుగులో క్రాంతిమాధవ్ సినిమాను తొలుత అంగీకరించానని, కానీ 'కౌసల్య కృష్ణమూర్తి' మొదటగా విడుదలవుతుందని, నటిగా తనకు ఈ చిత్రం చక్కటి శుభారంభాన్ని అందిస్తుందనే నమ్మకముందని ఐశ్వర్యారాజేష్ చెప్పింది. ఛాలెంజ్, పుణ్యస్త్రీ, ముత్యమంతముద్దు తర్వాత రామారావుగారి సంస్థలో తాను చేసిన సినిమా ఇదని రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోకూరి బాబూరావు, కార్తిక్‌రాజు, రాశీఖన్నా పాల్గొన్నారు.

# ప్రేమలో ఉండిపోరాదే



తరుణ్‌తేజ్, లావణ్య

తరుణ్‌తేజ్, లావణ్య జంటగా నటిస్తున్న చిత్రం 'ఉండిపోరాదే'. గోల్డ్‌టైమ్‌ఇన్ పిక్చర్స్ పతాకంపై డాక్టర్ లింగేశ్వర్ నిర్మిస్తున్నారు. నవీన్ నాయని దర్శకుడు. సెన్సార్ పూర్తయింది. 'యు.ఎ' సర్టిఫికెట్ లభించింది. ఈ నెల 31న ఈ చిత్రం విడుదల కానుంది. నిర్మాత మాట్లాడుతూ 'నవతరం మనోభావాలకు దర్పణంలా నిలిచే చిత్రమిది. చదువే లోకంగా బతికే ఓ జంట ఎలా ప్రేమలో పడ్డారు?అవరోధాల్ని అధిగమించి తమ ప్రేమను ఏ విధంగా గెలిపించుకున్నారన్నది ఆకట్టుకుంటుంది. స్వచ్ఛమైన ప్రేమకు నిదర్శనంగా నిలుస్తుంది. సింగిల్ కట్ లేకుండా సెన్సార్ పూర్తయింది. మంచి సినిమా తీశామని సెన్సార్ సభ్యులు ప్రశంసించారు. కథను నమ్మి కొత్త నటీనటులతో ఈ సినిమాను రూపొందించాం. పతాక ఘట్టాలు హృద్యంగా సాగుతాయి' అని తెలిపారు. కుటుంబ విలువలు, ప్రేమ, వినోదం, సెంటిమెంట్‌తో పాటు వాణిజ్య హంగులు పుష్కలంగా ఉన్న చిత్రమిదని, ప్రతి ఒక్కరూ కష్టపడి, ఇష్టపడి ఈ సినిమా చేశారని, వందశాతం ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే నమ్మకముందని దర్శకుడు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: శ్రీనివాస్ విన్నకోట, సంగీతం: సాబు వర్గీస్.



సాహితి, లక్ష్య

# టీనేజ్ ప్రేమాయణం

లక్ష్య, సాహితి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'బాయ్'. అమర్ విశ్వరాజ్ దర్శకత్వం వహిస్తూ ఆర్.రవిశేఖర్‌రాజుతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 23న విడుదలకానుంది. మంగళవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిర్మాత రాజ్ కందుకూరి ఆడియో సీడీలను విడుదలచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'చాలా మంది తొలి సినిమాను కమర్షియల్ హంగులు, ప్రేమకథలతో తెరకెక్కిస్తుంటారు. దర్శకుడు అమర్ మాత్రం నిజాయితీతో సరికొత్త నేపథ్యాన్ని ఎంచుకొని ఈ సినిమా చేశారు. చిన్న సినిమాల్లో పెద్ద విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు. దర్శకనిర్మాత అమర్ విశ్వరాజ్ మాట్లాడుతూ 'పాఠశాల రోజుల్ని పూర్తిచేసుకొని కాలేజీ ప్రాయంలోకి అడుగుపెట్టడానికి సిద్ధంగా ఓ విద్యార్థి కథ ఇది. టీనేజ్‌లోని ఊహలు, కలలు, ప్రేమ భావోద్వేగాలకు అందమైన దృశ్యరూపంగా ఉంటుంది. లక్ష్య, సాహితి సహజ నటనతో కథకు ప్రాణం పోశారు. ప్రతి ఒక్కరికి బాల్యజ్ఞాపకాల్ని ఈ చిత్రం గుర్తుకుతెస్తుంది' అని అన్నారు.

